సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 290
బుధవారం 10-1-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'రాష్ట్రంలో నిరుపేదలెవరూ డబ్బులేని కారణంగా ఉన్నత విద్యకు దూరం కాకూడదు. అందుకే ఫీజుల చెల్లింపు పథకాన్ని చేపట్టాం'


టి20 సిరీస్ కూడా చేజారె...
ఆస్ట్రేలియాతో జరిగిన మూడో మ్యాచ్ లోనూ ఓడిన భారత జట్టు. - 12లో


ఆరంభ లాభాలు ఆవిరి
స్వల్ప లాభాలతో గట్టెక్కిన స్టాక్ సూచీలు. - 13లో


లక్షద్వీప్‌లో ఎయిర్‌పోర్టు..
పర్యాటకాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో లక్షద్వీప్‌లోని మినికాయ్ దీవిలో విమానాశ్రయం ఏర్పాటుకు కేంద్రం యోచిస్తోంది.
- వివరాలు 6లో


మాతృత్వానికే మచ్చ తెచ్చిన తల్లి..
ఓ స్టార్టప్ కంపెనీ సీఈఓ సుచనా సేథ్ తన నాలుగేళ్ల కుమారుడిని హతమార్చింది. శవాన్ని మాయం చేసే యత్నంలో దొరికిపోయింది.
- వివరాలు 6లో


నేటి నుంచి 'వైబ్రంట్ గుజరాత్'
గాంధీనగర్‌లో 10వ 'వైబ్రంట్ గుజరాత్ గ్లోబల్ సమ్మిట్'కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ సదస్సు మూడు రోజుల పాటు జరగనుంది.
- వివరాలు 6లో


ఫ్రాన్స్ ప్రధానిగా గాబ్రియెల్ అట్టల్
ఫ్రాన్స్ ప్రధానిగా అట్టల్ (34) నియమితులు అయ్యారు. గే అని ప్రకటించుకున్న ఫ్రాన్స్ తొలి ప్రధాని అట్టల్ కావడం గమనార్హం.
- వివరాలు 6లో

మేడిగడ్డపై విజిలెన్స్

పియర్లు కుంగడంపై విచారణకు ఆదేశించిన రాష్ట్ర ప్రభుత్వం: మంత్రి ఉత్తమ్

- మంగళవారం ఉదయం నుంచే రంగంలోకి అధికారులు
- జలసౌధ సహా రాష్ట్రవ్యాప్తంగా 10 చోట్ల ఏకకాలంలో తనిఖీలు
- మేడిగడ్డతో పాటు కాళేశ్వరంలోనే భాగమైన అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు, పంప్‌హౌస్‌ల్లో దాడులు
- పెద్దసంఖ్యలో కీలక ఫైళ్లు, రికార్డులు స్వాధీనం..పలు అంశాలపై ఆరా
- నేడూ కొనసాగనున్న సోదాలు


మహదేవపూర్‌లో బ్యారేజీ రికార్డులు స్వాధీనం చేసుకొని కారులో తరలిస్తున్న విజిలెన్స్ అధికారులు

సాక్షి, హైదరాబాద్/కాళేశ్వరం/తిమ్మాపూర్ (మానకొండూర్)/కరీంనగర్ క్రైం/జ్యోతినగర్(రామగుండం): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ బ్యారేజీ పియర్లు కుంగిన అంశంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ ఆధ్వర్యంలో విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మంగళవారం ఈ విషయం వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాలతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు మంగళవారం ఉదయం నుంచే రంగంలోకి దిగాయి. హైదరాబాద్‌లోని జలసౌధ సహా రాష్ట్రవ్యాప్తంగా నీటిపారుదల శాఖకు సంబంధించిన 10 కార్యాలయాలపై ఏకకాలంలో దాడులు నిర్వహించి విస్తృత తనిఖీలు జరిపాయి. క్షేత్ర స్థాయిలో డివిజనల్, సర్కిల్ కార్యాలయాలతో పాటు ఈఎన్సీ, సీఈ, ఎస్‌ఈల కార్యాలయాల్లో సోదాలు నిర్వహించి ఫైళ్లు, రికార్డులు స్వాధీనం చేసుకున్నాయి.

జలసౌధలో 50 మంది అధికారులు

హైదరాబాద్ జలసౌధలో ఉదయం 11 నుంచి సాయంత్రం 5 వరకు సుమారు 50 మంది విజిలెన్స్ అధికారులు వేర్వేరు బృందాలుగా విడిపోయి ఫైళ్లను తనిఖీ చేశారు. ఒకటో అంతస్తులో ఉండే కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్, గజ్వేల్ ఈఎన్సీ బి.హరిరామ్ క్యాంప్ కార్యాలయం, రెండో అంతస్తులో నీటిపారుదల శాఖ ఈఎన్సీ (జనరల్) సి.మురళీధర్ స్వీయ పర్యవేక్షణ కింద ఉండే కీలకమైన ప్రాజెక్టు అండ్ మానిటరింగ్ (పీఅండ్‌ఎం), హైడ్రాలజీ విభాగాల్లో తనిఖీలు జరిగాయి. అలాగే ఐదో అంతస్తులోని రామగుండం ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు క్యాంప్ కార్యాలయం, ఆరో అంతస్తులోని సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్స్ (సీడీఓ), క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీర్ల కార్యాలయాల్లో తనిఖీలు కొనసాగాయి. విశ్వసనీయ

మిగతా 2వ పేజీలో ▶

ఐదు ఉమ్మడి జిల్లాల పార్టీ నేతల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, ఉత్తమ్, పొన్నం



మార్కెట్ కమిటీలు రద్దు

- కొత్త కమిటీల ఏర్పాటుకు సన్నాహాలు చేసుకోండి
- అధికారుల పోస్టింగులు, బదిలీల్లో జోక్యం చేసుకోవద్దు
- ఐదు ఉమ్మడి జిల్లాల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుతమున్న వ్యవసాయ మార్కెట్ కమిటీలను రద్దు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కొత్త కమిటీల ఏర్పాటుకు సన్నాహాలు చేసుకోవాలని మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలకు సూచించారు. పార్టీ కోసం పనిచేసిన వారికే ఈ కమిటీల్లో ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మర్రి చెన్నారెడ్డి మానవవనరుల కేంద్రంలో మంగళవారం ఐదు ఉమ్మడి జిల్లాలకు చెందిన ఇన్‌చార్జ్ మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలతో రేవంత్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, కరీంనగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో అధికారుల పోస్టింగులు, బదిలీల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు జోక్యం చేసుకోవద్దని హెచ్చరించారు. సమర్థులైన అధికారులను ప్రభుత్వమే గుర్తించి అవసరమైనచోట వారి సేవలు ఉపయోగించుకుంటుందన్నారు. ఇలాంటి వ్యవహారాల్లో ఎవరు తలదూర్చినా నిఘా యంత్రాంగం దృష్టి సారిస్తుందనే విషయాన్ని గుర్తించాలని మంత్రులు,ఎమ్మెల్యేలతో అన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

త్వరలో జరిగే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. నిజమైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని, త్వరలోనే ఇందిరమ్మ కమిటీలు నియమించి ప్రజలకు సంక్షేమ పథకాలు చేరవేస్తామన్నారు. అయితే

మిగతా 2వ పేజీలో ▶

స్థిరాస్తి, ఫర్నిచర్ రంగాల్లో అపార అవకాశాలు
గోద్రెజ్ ఆగ్రోవెట్ ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి - 3లో

న్యూస్‌రీల్

ఎమ్మెల్సీలను బ్రోకర్లని అంటారా!


శాసనమండలిని ఇరానీ కేఫ్‌గా, ఎమ్మెల్సీలను రియల్ ఎస్టేట్ బ్రోకర్లుగా చిత్రీకరించిన సీఎం రేవంత్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు వాణీదేవి, ఎంఎస్ ప్రభాకర్, దేశపతి శ్రీనివాస్ డిమాండ్ చేశారు.
- వివరాలు 2లో

శ్రమిస్తే పార్లమెంట్ ఎన్నికల్లో సత్ఫలితాలు


కష్టపడి పనిచేస్తే పార్లమెంట్ ఎన్నికలలో మంచి ఫలితాలు సాధిస్తామని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ అభిప్రాయపడ్డారు. గాంధీభవన్‌లో ఆమె టీపీసీసీ అధికార ప్రతినిధులతో సమావేశమయ్యారు.
- వివరాలు 2లో

పండక్కి ముందే 'ప్రైవేట్' దోపిడీ!


సంక్రాంతి రద్దీ కంటే ముందే ప్రైవేట్ బస్సులు దారి దోపిడీకి తెరతీశాయి. చార్జీలను రెట్టింపు చేశాయి. కాంట్రాక్ట్ క్యారేజీలుగా నమోదైన వందలాది బస్సులు స్టేజీ క్యారేజీలుగా రోడ్డెక్కి ప్రయాణికుల జేబులు గుల్ల చేస్తున్నాయి.
- వివరాలు 7లో

మగపులిని మట్టుబెట్టారు


కుమురంభీం జిల్లాలో ఈ నెల 6న ఆడపులి, 8న ఐదేరాళ్ల మగపులి (ఎస్9) కళేబరాలను గుర్తించిన విషయం తెలిసిందే. ఆడపులి మరో పులితో పోరులో చనిపోగా, మగపులి విషంతో చనిపోయినట్టు అధికారులు గుర్తించారు.
- వివరాలు 5లో

ఈ-రేస్‌పై చర్యలు తీసుకుంటాం

- న్యాయపరంగా ముందుకెళ్తాం
- నెక్స్ జెన్‌కు లబ్ధి చేకూర్చడం కోసమే బీఆర్‌ఎస్ సర్కారు నిర్వహణ
- రూ.110 కోట్ల చెల్లింపు కోసం గత ప్రభుత్వం ఒప్పందం
- నాటి మంత్రివర్గం, మంత్రి అనుమతి లేకుండా ఆ కంపెనీకి రూ.55 కోట్లు చెల్లించిన ఓ ఉన్నతాధికారి
- మిగిలిన రూ.55 కోట్ల కోసం కంపెనీ నోటీసులిచ్చింది
- రేస్‌తో హైదరాబాద్‌కు, రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టీకరణ
- కేటీఆర్ ఆరోపణలకు ఖండన



సాక్షి, హైదరాబాద్: సచివాలయ బిజినెస్ రూల్స్‌కి విరుద్ధంగా, ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేసుకున్న ఫార్ములా ఈ-రేస్ ఒప్పందం, నిర్వహణపై న్యాయపరంగా ముందుకు వెళ్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఏ విధమైన విధి విధానాలు పాటించకుండా, వ్యాపార సూత్రాలకు విరుద్ధంగా నెక్స్ జెన్ అనే కంపెనీకి లబ్ధి చేకూర్చడం కోసమే గతేడాది హైదరాబాద్‌లో 'ఫార్ములా ఈ-రేస్' నిర్వహించారని ఆరోపించారు. వచ్చే ఫిబ్రవరిలో జరగాల్సి ఉన్న ఈవెంట్ నిర్వహణ కోసం నాటి మంత్రివర్గం, సంబంధిత శాఖ మంత్రి అనుమతి లేకుండా ఇటీవల బదిలీ అయిన పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రూ.55 కోట్లను ప్రైవేటు కంపెనీకి చెల్లించారని భట్టి తెలిపారు. ఈవెంట్ నిర్వహణకు రూ.110 కోట్లతో ఒప్పందం జరగగా, మిగిలిన రూ. 55 కోట్లను చెల్లించాలని సదరు కంపెనీ నోటీసు పంపిందన్నారు. గత పాలకులు వారి కోరికలు తీర్చుకోవడానికి రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారని ధ్వజమెత్తారు. తాము అధికారంలోకి వచ్చాక 'ఫార్ములా ఈ-రేసు'ను రద్దు చేయడంపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారంటూ మాజీ మంత్రి కేటీఆర్‌పై మండిపడ్డారు. మంగళవారం సచివాలయ మీడియా సెంటర్‌లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఆ రేస్ వల్ల రాష్ట్రానికి ఏం ఆదాయం వచ్చింది కేటీఆర్?

ఫార్ములా ఈ-రేసు రద్దుతో హైదరాబాద్ అభివృద్ధికి నష్టం జరిగిందని సోషల్ మీడియా 'ఎక్స్'వేదికగా కేటీఆర్ చేసిన ఆరోపణలను ఖండించారు. గతేడాది నిర్వహించిన ఫార్ములా ఈ-రేస్‌తో హైదరాబాద్‌కు ఎలాంటి లాభం జరగలేదని, పైగా ప్రభుత్వ నిధులను అప్పనంగా ఒక ప్రైవేటు కంపెనీకి

మిగతా 2వ పేజీలో ▶

'అర్జున'తో అందలం..



- జాతీయ క్రీడా పురస్కారాల ప్రదానోత్సవం మంగళవారం రాష్ట్రపతి భవన్‌లో ఘనంగా జరిగింది. భారత స్టార్ పేస్ బౌలర్ షమీతో పాటు తెలంగాణ బాక్సర్ హుసాముద్దీన్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అంధ క్రికెటర్ అజయ్ కుమార్ రెడ్డి 'అర్జున అవార్డు' అందుకున్న వారిలో ఉన్నారు. విదేశాల్లో టోర్నీలు ఆడేందుకు వెళ్లిన తెలంగాణ షూటర్ ఇషా సింగ్... 'ఖేల్ రత్న' అవార్డు గ్రహీతలు, బ్యాడ్మింటన్ స్టార్స్ సాత్విక్ సాయిరాజ్ (ఆంధ్రప్రదేశ్), చిరాగ్ శెట్టి (మహారాష్ట్ర) ఈ కార్యక్రమానికి గైర్హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ స్విమ్మర్ తులసీ చైతన్యకు టెన్‌జింగ్ నార్గే సాహస పురస్కారం లభించింది. -12లో


పార్లమెంటు టికెట్ కోసం చినబాబు పెట్టిన షరతులకు అర్భుడు ఒకరొచ్చార్సార్!


ఖమ్మం లోక్‌సభ సన్నాహక సభలో మాట్లాడుతున్న కేటీఆర్

ఆ మూడు అక్షరాలే పవర్‌ఫుల్..

- కేసీఆర్ సీఎంగా కన్నా ప్రతిపక్షంలో ఉంటేనే కాంగ్రెస్‌కు ప్రమాదం
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలు
- ఫిబ్రవరి రెండో వారం నుంచి ఆయన ప్రజల మధ్యకు వస్తారు
- అసెంబ్లీకి వస్తే ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు

సాక్షి, హైదరాబాద్: 'కేసీఆర్ అధికారంలో ఉండటం కన్నా ప్రతిపక్షంలో ఉంటేనే కాంగ్రెస్‌కు ప్రమాదం. సీఎం అనే రెండు అక్షరాలకంటే కేసీఆర్ అనే మూడు అక్షరాలే పవర్‌ఫుల్. ఫిబ్రవరి రెండో వారం నుంచి ఆయన ప్రజల మధ్యకు వస్తారు. అధికారంలో ఉన్నప్పటికంటే ప్రతిపక్షంలో ఉంటేనే పోరాట పటిమ చూపగలుగుతాం. మనమంతా తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో గట్టిగా పోరాడిన వాళ్లమే. ఇటీవలి అసెంబ్లీ సమావేశాల్లోనూ బీఆర్‌ఎస్ పోరాట పటిమను ప్రజలు చూశారు. ఇక రాబోయే రోజుల్లో కేసీఆర్ అసెంబ్లీకి వస్తే ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు..' అని భారత్ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు అన్నారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం జరిగిన ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశంలో

మిగతా 2వ పేజీలో ▶



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

మోదీ మూడోసారి ప్రధాని కావడాన్ని అడ్డుకోలేరు

- కేసీఆర్, రాహుల్, అసద్‌లు లక్ష చొప్పున వచ్చినా సరే..
- వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో అంచనాలకు మించిన ఫలితాలు
- కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు
- దేశాభివృద్ధికి ప్రతి భారతీయుడు సంకల్పం తీసుకోవాలని విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: లక్షమంది అసదుద్దీన్‌లు, లక్ష మంది కేసీఆర్‌లు, లక్ష మంది రాహుల్‌గాంధీలు వచ్చినా నరేంద్రమోదీ మూడోసారి ప్రధాని కావడాన్ని అడ్డుకోలేరని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఏప్రిల్‌లో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో అంచనాలకు మించిన ఫలితాలు రాబోతున్నాయని, వచ్చే ఐదేళ్లలో దేశంలో ఎవరూ ఊహించని మార్పులు జరగబోతున్నాయని చెప్పారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నమో యాప్ వికసిత్ భారత్ అంబాసిడర్ వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొన్నారు. 2047లోపు భారత్ అభివృద్ధి చెందాలని ప్రతి భారతీయుడు సంకల్పం తీసుకోవాలని కిషన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల కోసం కాదు.. దేశాభివృద్ధి కోసం వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రతి పౌరుడు వికసిత్ భారత్ అంబాసిడర్‌గా మారాలని, నేను సైతం

మిగతా 2వ పేజీలో ▶



ఐనవోలు జాతరకు రండి..
ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలకు (జాతరకు) రావాలంటూ సీఎం ఎ.రేవంత్‌రెడ్డిని ఆలయ కమిటీ ఆహ్వానించింది. ఈ సందర్భంగా సచివాలయంలో సీఎంకు అర్చకులు స్వామివారి ఆశీర్వచనాలు అందించారు. - సాక్షి, హైదరాబాద్

మేడిగడ్డపై విజిలెన్స్

▶ మొదటి పేజీ తరువాయి
సమాచారం మేరకు.. మేడిగడ్డతో పాటు కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు, పంప్‌హౌస్‌లకు సంబంధించిన ఫైళ్లను కూడా అధికారులు జప్తు చేసి తీసుకెళ్లారు. సీడీఓ సీఈ కార్యాలయం నుంచి బ్యారేజీలు, పంప్‌హౌస్‌ల డిజైన్లు, డ్రాయింగ్స్‌ను పట్టుకెళ్లారు. అలాగే కాళేశ్వరం ప్రాజెక్టు తొలి దశ కింద చేపట్టిన రెండు టీఎంసీల ప్రాజెక్టు పనులతో పాటు మూడో టీఎంసీ ప్రాజెక్టుకు సంబంధించిన ఫైళ్లను తీసుకెళ్లారు. మొత్తం అన్ని సర్వేలు, వ్యయ అంచనాలు, డీపీఆర్ తయారీ, టెండర్ల నిర్వహణ, కాంట్రాక్టర్లతో చేసుకున్న ఒప్పందాలు, పనుల్లో నాణ్యతా పర్యవేక్షణ, నిర్వహించిన పరీక్షలు, బిల్లుల చెల్లింపులు, బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి తీసుకున్న రుణాల వినియోగం తదితర అంశాలకు సంబంధించిన ఫైళ్లను కూడా పట్టుకెళ్లారు. తనిఖీల అనంతరం విజిలెన్స్ ఎస్పీ శ్రీనివాసరావు నేతృత్వంలోని బృందం ఈఎన్సీ మురళీధర్‌తో ఆయన చాంబర్‌లో సమావేశం అయ్యింది. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివిధ అంశాలపై ఆరా తీసింది. రాత్రి 9 వరకు సోదాలు కొనసాగాయి.

రాకపోకలు బంద్..సెల్‌ఫోన్ల స్వాధీనం
తనిఖీల సమయంలో లోపలి వ్యక్తులు బయటికి వెళ్లేందుకు, బయటి వ్యక్తులు లోనికి వచ్చేందుకు అధికారులు అనుమతించలేదు. అలాగే తనిఖీలకు సంబంధించిన సమాచారాన్ని బయటకు చెప్పకుండా అధికారుల సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం.

కుంగిన పియర్ల పరిశీలన
ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంటకు మహదేవపూర్ డివిజన్ కార్యాలయానికి చేరుకున్న అధికారులు మేడిగడ్డ బ్యారేజీలో కుంగిన పియర్లను పరిశీలించారు. మరో బృందం కన్నెపల్లిలోని లక్ష్మీపంపుహౌస్ మునిగిన ప్రాంతం, కంట్రోల్ రూమ్‌ను పరిశీలించింది. పలు కీలక రికార్డులు స్వాధీనం చేసుకున్న అధికారులు.. ప్రాజెక్టు డీపీఆర్, సీడబ్ల్యూసీ క్లియరెన్స్‌లు, బ్యారేజీ, పంపుహౌస్‌ల డ్రాయింగ్, డిజైన్‌లు తదితర వివరాలు స్థానిక అధికారులను అడిగారు. నిర్మాణ పనులు పూర్తయిన సర్టిఫికెట్స్, భూమి అక్విటెన్స్ స్థితి, ప్రస్తుత పనులపై కూడా ఆరా తీశారు. నీటి విడుదల, విద్యుత్ వినియోగ వివరాలు, అధికారుల బదిలీల వివరాలు, ఫిర్యాదులు తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. రాత్రి పొద్దుపోయే వరకు విచారణ కొనసాగింది. మరోవైపు తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలోని నీటిపారుదల శాఖ కార్యాలయంలో కరీంనగర్ విజిలెన్స్ ఎస్పీ రమణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఇవి కూడా రాత్రి 10 గంటల వరకు కొనసాగాయి. మరోవైపు పెద్దపల్లి జిల్లా ఎస్టీపీసీలోని నీటి పారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ కార్యాలయాల్లో సోదాలు కొనసాగాయి. స్థానికంగా పలు ఇంజనీరింగ్ విభాగాల కార్యాలయాల్లో కూడా తనిఖీలు నిర్వహించారు. కాగా బుధవారం కూడా తనిఖీలు కొనసాగుతాయని ఎస్పీ రమణారెడ్డి తెలిపారు.

హైకోర్టు సీజేకు ప్రభుత్వం లేఖ

గతేడాది అక్టోబర్ 21న మేడిగడ్డ బ్యారేజీకి సంబంధించిన 7వ బ్లాకు కుంగిపోయిన విషయం తెలిసిందే. అప్పట్లో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) ఆధ్వర్యంలోని బృందం మేడిగడ్డ బ్యారేజీని సందర్శించి డిజైన్, నిర్మాణం, నాణ్యత, పర్యవేక్షణ, నిర్వహణ లోపాలతోనే బ్యారేజీ కుంగిందని నివేదిక సమర్పించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుంది. దీనిపై వారం రోజుల్లో న్యాయ విచారణకు ఆదేశిస్తామని ఇటీవల రాష్ట్ర శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రాష్ట్ర మంత్రివర్గ భేటీలో కూడా ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. అలాగే మేడిగడ్డపై విచారణ కోసం సిట్టింగ్ జడ్జి ఒకరిని కేటాయించాలని విజ్ఞప్తి చేస్తూ గతంలోనే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. తాజాగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు ఆదేశించింది.

నేడు ముఖ్యమంత్రి సమీక్ష
కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజీ కుంగిన ఘటనలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం రాష్ట్ర సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించనున్నారు. న్యాయ విచారణ విషయమై గతంలోనే నిర్ణయం తీసుకోగా, తాజాగా విజిలెన్స్ విచారణకు ఆదేశించిన నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకోనున్నారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగడానికి మూలకారణాలు తెలుసుకోవడం, బ్యారేజీ పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలు, బుంగలు ఏర్పడిన అన్నారం బ్యారేజీతో పాటు సుందిళ్ల బ్యారేజీల్లో లోపాలను గుర్తించడానికి నిర్వహించాల్సిన పరీక్షలు.. తదితర అంశాలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

పేద విద్యార్థులు, దాతల మధ్య వారధిగా రాజ్‌భవన్

రాష్ట్ర గవర్నర్ తమిళిసై

సాక్షి, హైదరాబాద్: పేద విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను బహూకరించేందుకు దాతలు ముందుకు రావాలని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పిలుపునిచ్చారు. 'డొనేట్ ఏ డివైస్'కార్యక్రమంలో భాగంగా అక్షయవిద్యా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రాజ్‌భవన్‌లో వంద మంది పేద విద్యార్థినులకు ల్యాప్‌టాప్‌లను గవర్నర్ బహూకరించారు. పేద విద్యార్థులు, దాతల మధ్య వారధిగా రాజ్‌భవన్ పనిచేస్తుందని గవర్నర్ అన్నారు.

అయోధ్య రామాలయ పాదుకలకు పూజలు
అయోధ్య రామాలయం కోసం చల్లా శ్రీనివాసశాస్త్రి రూపొందించిన స్వర్ణ పాదుకలకు గవర్నర్ తమిళిసై మంగళవారం రాజ్‌భవన్‌లో పూజలు నిర్వహించారు. గర్భగుడిలో ఈ పాదుకలు నిత్యం కోట్లాది మంది భక్తుల పూజలను అందుకోనున్నాయని గవర్నర్ అన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసశాస్త్రిని ప్రత్యేకంగా అభినందించారు.

నరసింహన్ భేటీ: రాష్ట్ర మాజీ గవర్నర్ నరసింహన్ దంపతులు మంగళవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసైని మర్యాదపూర్వకంగా కలిశారు.



స్వర్ణ పాదుకలకు నమస్కరిస్తున్న గవర్నర్

గృహాలపై సౌర విద్యుదుత్పత్తిని ప్రోత్సహించండి

రెడ్కోపై సమీక్షలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



సాక్షి, హైదరాబాద్: సొంత అవసరాలకు విద్యుదుత్పత్తి చేసుకునే విధంగా గృహాలు, కమర్షియల్ భవనాలపై సౌరవిద్యుత్ పలకల ఏర్పాటును ప్రోత్సహించాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అధికారులను ఆదేశించారు. సౌరవిద్యుత్ పలకలను ఏర్పాటు చేసుకునేవారి కోసం అమలు చేస్తున్న సబ్సిడీ పథకాలపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ(టీఎస్ రెడ్కో)పై సచివాలయంలో మంగళవారం ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీతో కలిసి సమీక్ష నిర్వహించారు. భవిష్యత్‌లో విద్యుత్ కొరత రాకుండా ఉండటానికి సౌర విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవాలన్నారు. 1–3 కిలోవాట్ల సామర్థ్యంతో సౌర విద్యుత్ పలకలను ఏర్పాటు చేసుకుంటే కిలోవాట్‌కు రూ.18 వేలు, 3–10 కిలోవాట్ల సామర్థ్యంతో సౌర విద్యుత్ పలకలు ఏర్పాటు చేసుకుంటే కిలోవాట్‌కు రూ.9 వేలు చొప్పున ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని తెలిపారు. సమీక్షలో టీఎస్ రెడ్కో ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాల గురించి రెడ్కో వీసీ, ఎండీ ఎన్.జానయ్య పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

క్లుప్తంగా...

6 గ్యారంటీలపై అప్రమత్తంగా ఉండండి: కేటీఆర్

- డిప్యూటీ సీఎం భట్టి మాటలు నమ్మి మీ డబ్బు కోల్పోవద్దు
- ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు ఎవరికీ చెప్పొద్దని సూచన

సాక్షి, హైదరాబాద్: ప్రజాపాలన దరఖాస్తులు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్తున్నాయంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఆందోళన వ్యక్తం చేశారు. సున్నిత సమాచారం సైబర్ నేరస్తుల చేతిలో పడే అవకాశముందని, దరఖాస్తుదారులెవరూ ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు ఎవరికీ చెప్పొద్దని 'ఎక్స్' వేదికగా సూచించారు. 'ప్రజాపాలన దరఖాస్తులను ప్రైవేటు వ్యక్తులు నిర్లక్ష్యంగా పడేస్తున్నట్లు పలువురి బాధితుల నుంచి వింటున్నాం.. పలు వీడియోలు చూస్తున్నాం. ఈ దరఖాస్తుల్లో కోట్లాది మంది తెలంగాణ ప్రజలకు సంబంధించిన సున్నిత సమాచారం ఉంది. సైబర్ నేరస్తుల చేతికి గోప్యమైన సమాచారం చిక్కకుండా సరైన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా. మీకు పెన్షన్లు లేదా ఇళ్లు లేదా ఆరు గ్యారంటీల్లో ఏదైనా ఇస్తామని మిమ్మల్ని ఎవరైనా ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు కావాలని అడిగితే ఇవ్వకూడదని తెలంగాణ సోదరసోదరీమణులను కోరుతున్నా. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాటలను నమ్మి మీ డబ్బును కోల్పోవద్దు. బీఆర్ఎస్‌కు మీరు ఓటు వేసినా వేయకున్నా సరే.. నా మాటలను సీరియస్‌గా తీసుకోండి. సైబర్ నేరస్తులు వేసే ఎరలకు బలికావద్దు' అని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

17 ఎంపీ సీట్లకు బీజేపీ ప్రభారీల నియామకం



సాక్షి, హైదరాబాద్: వచ్చే లోక్‌సభ ఎన్నికల సన్నాహకాల్లో భాగంగా రాష్ట్ర బీజేపీ చురుకుగా అడుగులు వేస్తోంది. ఇటీవల జరిగిన రెండురోజుల సన్నాహక సమావేశంలో లోక్‌సభ ఎన్నికల కోసం నిర్వహించాల్సిన కసరత్తుపై చర్చించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రాష్ట్రంలోని 17ఎంపీ సీట్లకు పొలిటికల్ ఇన్‌చార్జీలను సైతం నియమించింది. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి ఈ 17 స్థానాల్లో లోక్‌సభ ప్రభారీలు – ఇన్‌చార్జి (సంస్థాగత) లను నియమించింది. ఈ మేర కు మంగళవారం లోక్‌సభ ప్రభారీలను కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర చీఫ్ కిషన్‌రెడ్డి నియమించారు.

లోక్‌సభ నియోజకవర్గాలకు ప్రభారీలు వీరే
ఆదిలాబాద్–అల్జాపూర్ శ్రీనివాస్, పెద్దపల్లి–వీరబెల్లి రఘునాథరావు, కరీంనగర్–పెద్దోళ్ల గంగారెడ్డి, నిజామాబాద్–వెంకటరమణి, జహీరాబాద్– బద్దం మహిపాల్‌రెడ్డి, మెదక్–మీసాల చంద్రయ్య, మల్కాజిగిరి– గోలి మధుసూదన్‌రెడ్డి, సికింద్రాబాద్–వీరెల్లి చంద్రశేఖర్, హైదరాబాద్–పాపారావు, చేవెళ్ల–అంకాపురం విష్ణువర్ధన్‌రెడ్డి, మహబూబ్‌నగర్– కేపీఎల్ఎన్ రెడ్డి(రాజు), నాగర్‌కర్నూల్–ఎడ్ల అశోక్‌రెడ్డి, నల్లగొండ–చాడ శ్రీనివాస్‌రెడ్డి, భువనగిరి–ఎం.జయశ్రీ, వరంగల్ – డా.వి.మురళీధర్ గౌడ్, మహబూబాబాద్–నూకల వెంకటనారాయణరెడ్డి, ఖమ్మం– జె.శ్రీకాంత్.

'టీఎస్‌పీఎస్సీ' రాజీనామాలను ఆమోదించాలి

గవర్నర్‌కు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ



సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల రాజీనామాలను వెంటనే ఆమోదించాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో గవర్నర్‌కు రాసిన లేఖను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలో రెండు లక్షల ఉద్యోగాలు, ఆ తర్వాత ఏడాదికి లక్ష చొప్పున ఐదేళ్లలో మొత్తం ఆరు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి వాగ్దానం చేసిందని గుర్తు చేశారు. దీని కోసం చైర్మన్, సభ్యులతో కూడిన పూర్తిస్థాయి పబ్లిక్ సర్వీస్ కమిషన్ బోర్డు అవసరముందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌తోపాటు మరో ఇద్దరు సభ్యులు పదవులకు రాజీనామా చేశారని, వాటిని ఆమోదించకపోవడంతో ప్రభుత్వం ఉద్యోగాల భర్తీపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోతుందన్నారు. రిక్రూట్‌మెంట్ ప్రక్రియ ప్రారంభించేందుకు వీలుగా చైర్మన్ సభ్యుల రాజీనామాపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఆయన గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు.

ఆ చాక్లెట్లు తిని మత్తులోకి జారి!

కొత్తూరులో స్కూలు పక్కన పాన్ డబ్బాల్లో విక్రయిస్తున్న చాక్లెట్లు తిని..
- తరగతి గదుల్లో వింతగా ప్రవర్తిస్తున్న చిన్నారులు
- మొదట ఉచితంగా అలవాటు చేసి.. ఇప్పుడు రూ. 20కి అమ్ముతున్న వైనం



మత్తుమందుగా అనుమానిస్తున్న చాక్లెట్

కొత్తూరు: స్కూలు సమీపంలోని పాన్ డబ్బాల్లో విక్రయిస్తున్న చాక్లెట్లు తిని విద్యార్థులు మత్తులోకి జారుకోవడం, వింత వింతగా ప్రవర్తిస్తున్న దృష్టాంతాలు రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వెలుగుచూశాయి. ఉపాధ్యాయులు తెలిపిన వివరాల ప్రకారం.. స్కూలు సమీపంలోని పాన్ డబ్బాల్లో లభించే చాక్లెట్లను తరచూ కొని తింటున్న పలువురు విద్యార్థులు తరగతి గదుల్లో మత్తులోకి జారుకుంటున్నారు. కొద్ది రోజులుగా విద్యార్థులు వింతగా ప్రవర్తించడాన్ని గమనించిన ఉపాధ్యాయులు ఆరా తీయగా చాక్లెట్ల వల్లనే అని తేలింది. వీటిని మొదట పాన్ డబ్బాల వ్యాపారులు ఉచితంగా విద్యార్థులకు అందించారని, క్రమంగా వాటికి బానిసలైన విద్యార్థులకు ఒక్కో చాక్లెట్ 20 రూపాయలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఉపాధ్యాయుల సమాచారం మేరకు ఎస్‌వోటీ పోలీసులు మంగళవారం సదరు పాన్ డబ్బాలపై దాడిచేయగా స్వల్ప మొత్తంలో చాక్లెట్లు లభించాయి. అయితే ఈ చాక్లెట్లలో ఏముందనేది తెలియరాలేదని చెబుతున్నారు. హెచ్ఎం అంగోర్ నాయక్‌ను వివరణ కోరగా విద్యార్థులు వింతగా ప్రవర్తిస్తున్న విషయం వాస్తవమేనని, దీనిపై స్థానిక మున్సిపల్ అధికారులు, పోలీసులకు సమాచారం అందించామని చెప్పుకొచ్చారు.



రూ.75 కోట్లతో సమ్మక్క - సారక్క జాతరకు ఏర్పాట్లు

నెలాఖరులోగా పనుల పూర్తికి మంత్రుల ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఫిబ్రవరి తొలి వారంలో జరగనున్న సమ్మక్క, సారలమ్మ మహా జాతర ఏర్పాట్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.75 కోట్లను మంజూరు చేసిందని, జనవరి 31లోగా పనులన్నీ పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ ఆదేశించారు. జాతర ఏర్పాట్లపై ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి సమీక్ష నిర్వహించారు. జాతరకు వచ్చే భక్తులు ప్రశాంతంగా అమ్మవార్ల దర్శనం చేసుకొని వెళ్లేలాగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఉచిత బస్ సౌకర్యంతో బస్ ప్రయాణంలో వచ్చే మహిళా భక్తులు పెరిగే అవకాశం ఉందని, అందుకు తగ్గట్టూ ఏర్పాటు చేయాలన్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు.

'సంగమేశ్వరతో పాలమూరుకు నష్టం'



మహబూబ్‌నగర్ న్యూటౌన్: 'రాయలసీమలో సంగమేశ్వర ప్రాజెక్టు ద్వారా రోజుకు 3 టీఎంసీల నీటి ని తీసుకునేందుకు కృష్ణానదిపై డ్యాం కడుతున్నా రు. అప్పట్లో ఏపీ ప్రభుత్వం సంగమేశ్వర డ్యాం కట్టాలని చూస్తే కేసీఆర్ ఆపారు. కానీ, ప్రస్తుతం అక్కడ పనులు జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్టు నిర్మిస్తే పాలమూరు జిల్లా తీవ్రంగా నష్టపోతుంది. జిల్లావాసిగా సీఎం రేవంత్‌రెడ్డి దీనిపై దృష్టిపెట్టాలి' అని భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత అన్నారు. మంగళవారం ఆమె మహబూబ్‌నగర్ లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, చంద్రశేఖర్‌లతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లా డారు. దేశంలోనే అత్యధికంగా సాగుకు యోగ్యమైన 35 లక్షల ఎకరాల భూమి ఉన్న ప్రాంతం పాల మూరు అని, ఇక్కడి కరువును పారద్రోలేందుకే పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు చేపట్టామన్నారు. ఈ ప్రాజెక్టు పనులు పది శాతం పూర్తి చేస్తే జిల్లాలోని 12 లక్షల ఎకరాలకు నీరందుతుందని అన్నారు.

శ్రమిస్తే పార్లమెంట్ ఎన్నికల్లో సత్ఫలితాలు

కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చాలా బలంగా ఉందని, కష్టపడి పనిచేస్తే పార్లమెంట్ ఎన్నికలలో మరింత మంచి ఫలితా లు సాధిస్తామని రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ అభిప్రాయపడ్డారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలపై గాంధీభవన్‌లో మంగళవారం టీపీసీసీ అధికార ప్రతినిధుల సమా వేశం జరిగింది. ఈ సందర్భంగా దీపాదాస్ మాట్లాడుతూ అధికార ప్రతినిధుల బాధ్యత చాలా ఉందని చెప్పారు. ప్రభుత్వ పథకాలను జనంలోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రణాళిక తయారు చేసుకుని ముందుకెళ్లాలని, బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం రాజకీయాలను ప్రజలకు వివరించాలన్నారు. బీజేపీ మతతత్వ రాజకీయాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని కోరారు. బీజేపీ తెలంగాణ విషయంలో ప్రత్యే క దృష్టి సారించిందని హెచ్చరించారు. రాష్ట్రంలో గెలవగానే నేతలు విశ్రాంతిలో ఉంటున్నారని, కానీ పార్లమెంట్ ఎన్నిక లకు పెద్దఎత్తున పోరాటానికి సిద్ధం కావాలని దీపాదాస్ మున్షీ కోరారు. సమావేశంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌తో జగ్గారెడ్డి భేటీ



సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే తూర్పు జగ్గారెడ్డి మంగళవారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని కలిశారు. ఉదయం జూబ్లీహిల్స్‌లోని రేవంత్ నివాసానికి వెళ్లిన జగ్గారెడ్డి 20 నిమిషాల పాటు ఆయనతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతల మధ్య రాజకీయ అంశాలపైనే చర్చ జరిగిందని తెలుస్తోంది. పీసీసీ అధ్యక్ష పదవితో పాటు, రానున్న లోక్‌సభ ఎన్నికల్లో జగ్గారెడ్డి కుటుంబ సభ్యుల పోటీ, నెల రోజుల కాంగ్రెస్ పాలన, ప్రజాపాలన కార్యక్రమం తదితర అంశాలపై ఇద్దరూ చర్చించినట్టు గాంధీభవన్ వర్గాల సమాచారం.

ఈ రేస్‌పై చర్యలు తీసుకుంటాం

▶ మొదటి పేజీ తరువాయి
కట్టబెట్టారని విమర్శించారు. తమ ప్రభుత్వంపై ప్రజలకు ఎన్నో ఆశలు ఉన్నాయని, ప్రతిపైసా ప్రజల అవసరాల కోసం మాత్రమే తాము ఖర్చు చేస్తామన్నారు. వాళ్లు ఎవరో హైదరాబాద్‌కు వచ్చి వెళ్లడానికి రూ.100 కోట్లు కట్టాలా? అని ప్రశ్నించారు. ఫార్ములా ఈ రేస్ నిర్వహణతో రాష్ట్రానికి ఎలాంటి ఆదాయం ఉండదని స్పష్టం చేశారు.

ప్రజాభవన్‌లో రోజూ నన్ను కలవచ్చు
ప్రజా పాలన అభయ హస్తం దరఖాస్తుల స్వీకరణ రాష్ట్రవ్యాప్తంగా ఎలాంటి చిన్న సంఘటన లేకుండా చాలా పకడ్బందీగా నిర్వహించామని భట్టి తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద రాష్ట్రంలో ఇప్పటి వరకు 6.50 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేసి లబ్ధి పొందారన్నారు. ప్రజా భవన్‌లో ఎవరైనా తనను ప్రతి రోజూ ఉదయం 8.30 నుంచి 9.30 వరకు కలవవచ్చునని స్పష్టం చేశారు.

విడతల వారీగా రైతుబంధు నిధులు
రోజు వారీగా రైతుబంధు నిధులను విడుదల చేస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. ఒక ఎకరం ఉన్న రైతులకు ఇప్పటికే రైతుబంధు నిధులు చెల్లించామని, రెండు ఎకరాలున్న రైతులకు చెల్లింపులు జరుగుతున్నాయన్నారు. విడతల వారీగా రైతులకు రైతుబంధు నిధులు ఇస్తామన్నారు.

మార్కెట్ కమిటీలు రద్దు

▶ మొదటి పేజీ తరువాయి
నియోజకవర్గస్థాయిలో నిజాయతీ, నిబద్ధత ఉన్న అధికారులను నియమించుకోవాలని, అవినీతి అధికారులను ప్రోత్సహించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. అధికారులు, పోలీసుల బదిలీల్లో పైరవీలకు తావు లేదని రేవంత్ స్పష్టం చేశారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే పనులు చేయొద్దని హితవు పలికారు. ప్రతీ నియోజకవర్గ అభివృద్ధికి రూ.10 కోట్లు ప్రత్యేక నిధిని కేటాయిస్తున్నట్టు రేవంత్ ప్రకటించారు. నిధుల ప్రాథమ్యాలను నిర్ణయించే బాధ్యత ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రులకు అప్పగిస్తామన్నారు. ఇన్‌చార్జ్ మంత్రులతో సమన్వయం చేసుకుంటూ నియోజకవర్గాలను అభివృద్ధి చేసుకోవాలని, స్థానిక సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. పార్లమెంటు ఎన్నికల్లో 12 లోక్‌సభ స్థానాలకు తగ్గకుండా గెలిపించుకోవాలని సీఎం పిలుపునిచ్చారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క, కొండా సురేఖతో పలువురు ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు భేటీలో పాల్గొన్నారు.

మోదీ మూడోసారి ప్రధాని కావడాన్ని అడ్డుకోలేరు

▶ మొదటి పేజీ తరువాయి
అన్నట్లు దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఎల్‌కే అద్వానీ సారథ్యంలో అయోధ్యలో రామాలయం నిర్మించాలని 1990లో బీజేపీ (పాలమూరులో) తీర్మానం చేసిందని, అద్వానీ రథయాత్ర చేపడితే దేశమంతా జేజేలు పలికిందని కిషన్‌రెడ్డి గుర్తు చేశారు. కలలో కూడా ఊహించని విధంగా మన కళ్ల ముందు అయోధ్య రామాలయం నిర్మాణం పూర్తయ్యిందని అన్నారు.

దీనిని సెక్యులరిజం అంటారా?

టేకులపల్లి లక్ష్మి హత్యపై కవిత, కేటీఆర్ ఎందుకు మాట్లాడలేదు: రఘునందన్



సాక్షి, హైదరాబాద్: బిల్కిస్ బానో కేసులో 11 మంది దోషుల క్షమాభిక్షను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని బీజేపీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు చెప్పారు. ఈ తీర్పుపై రాహుల్ గాంధీ, కవిత, కేటీఆర్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కించపరుస్తూ మాట్లాడటాన్ని ఖండిస్తున్నామన్నారు. వీరు కుహనా లౌకిక వాదులుగా ప్రధాని మోదీని విమర్శించడమే కాకుండా బీజేపీకి ఇది చెంపపెట్టు అంటూ వ్యాఖ్యలు చేశారన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, పార్లమెంట్ ఎన్నికల్లో మైనారిటీ ఓట్ల కోసం మాత్రమే వారు మాట్లాడుతున్నారు తప్ప ఆ వర్గాలపై ప్రేమతో మాత్రం కాదని స్పష్టం చేశారు. రామమందిర నిర్మాణంపై జడ్జిమెంట్ ఇచ్చింది కూడా సుప్రీంకోర్టే కదా..మరి రామమందిర నిర్మాణం తీర్పును వీళ్లు ఎందుకు స్వాగతించలేదని ప్రశ్నించారు. ఒక్కొక్క కేసులో ఒక్కోలా మాట్లాడటం సెక్యులరిజమా అని రఘునందన్ నిలదీశారు. ఆదిలాబాద్‌లో దళిత బిడ్డ టేకులపల్లి లక్ష్మి హత్య జరిగినప్పుడు కవిత, కేటీఆర్ ఎందుకు మాట్లాడలేదు? అప్పుడు తెరవని నోర్లు ఇప్పుడెందుకు లేస్తున్నాయని ప్రశ్నించారు.

ఆ మూడు అక్షరాలే పవర్‌ఫుల్..

▶ మొదటి పేజీ తరువాయి
ఆయన మాట్లాడారు.

త్వరలో రాష్ట్ర, జిల్లా కమిటీలు
'ప్రస్తుతం పార్టీ పరంగా జరుగుతున్న పార్లమెంటు నియోజకవర్గ సమావేశాలు ముగిసిన తర్వాత అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్షలు ఉంటాయి. త్వరలో బీఆర్ఎస్ రాష్ట్ర, జిల్లా కమిటీలు కూడా ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి రెండు మూడు నెలలకోమారు అన్ని కమిటీల సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహిస్తాం..'అని కేటీఆర్ ప్రకటించారు.

కేసీఆర్ దళంగా ముందుకు సాగుదాం
'తక్కువ సమయంలోనే ప్రజల విశ్వాసాన్ని కోల్పోయే లక్షణం కాంగ్రెస్ పార్టీ సొంతం. 1989 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీని తిరస్కరించి కాంగ్రెస్‌ను గెలిపించినా, ఏడాదిన్నరలోనే ప్రజలు ఆ పార్టీ మీద విశ్వాసాన్ని కోల్పోయారు. అప్పట్లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే దీనికి నిదర్శనం. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నిలుపుకొనే నిజాయితీ, చిత్తశుద్ధి కాంగ్రెస్ పార్టీకి ఉండదు. అధికారంలోకి వచ్చిన వెంటనే వాగ్దానాలు అమలు చేస్తామన్న కాంగ్రెస్ ఇప్పుడు కాలయాపన చేస్తోంది. హామీల అమల్లో కాంగ్రెస్ వైఖరి పట్ల ప్రజల్లో అసహనం మొదలైంది. ఈ నేపథ్యంలో హామీల అమలు కోసం కాంగ్రెస్‌పై ఒత్తిడి పెంచేలా బీఆర్ఎస్ చేసే పోరాటానికి పార్టీ యంత్రాంగం కార్యోన్ముఖులు కావాలి. ప్రజల్లో నెలకొన్న అసంతృప్తిపై సమీక్షించుకోవడంతో పాటు, పార్టీ పరంగా ఆత్మ విమర్శ చేసుకుంటున్నాం. తెలంగాణ గళం, బలం బీఆర్ఎస్ పార్టీయే. రాబోయే ఎన్నికల్లో 'కేసీఆర్ దళం'గా ఐకమత్యంతో ముందుకు సాగుదాం..'అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

దళితబంధు ఇచ్చినా ఓట్లు పడలేదు

'మధిర నియోజకవర్గం పార్టీ అభ్యర్థి లింగాల కమల్‌రాజ్‌కు.. 2019లో ఓడినా జిల్లా పరిషత్ చైర్మన్ పదవి ఇచ్చాం. మధిర మండలం చింతకాని మండలంలో లబ్ధిదారులందరికీ దళితబంధు ఇచ్చినా కమల్‌రాజ్‌కు ఓట్లు పడలేదు. ఆయన నాలుగు సార్లు పోటీ చేసి ఓడిపోయారు. పార్టీ ఆయన గొంతు కోసిందంటూ వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తున్నా. ఎమ్మెల్యే అభ్యర్థులకు పార్టీ టికెట్‌తో పాటు రూ.40 లక్షల చెక్కు ఇచ్చి పువ్వుల్లో పెట్టి చూసుకున్నాం..'అని కేటీఆర్ చెప్పారు.

ఇక మీ కోసం మీ దగ్గరకే: మాజీ మంత్రి హరీశ్
'బీఆర్ఎస్ ఓటమి తాత్కాలికం. భవిష్యత్తు అంతా మనదే. కాంగ్రెస్ పాలనలో బీఆర్ఎస్ కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలు పెరిగాయి. కేసీఆర్ కక్ష సాధింపు చర్యలకు గనుక పూనుకుని ఉంటే కాంగ్రెస్ నేతలు జైల్లో ఉండేవారు. కేసీఆర్‌కు అభివృద్ధి తప్ప పగతనం తెలియదు..'అని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. 'ఇకపై మేం హైదరాబాద్‌లో ఉండం. మీ కోసం మీ దగ్గరకే వస్తాం. నాలుగు రోజులు ఓపిక పడితే ప్రజలు మళ్లీ బీఆర్ఎస్‌కే అధికారాన్ని బంగారు పళ్లెంలో పెట్టి అప్పగిస్తారు..'అని స్పష్టం చేశారు.

అభివృద్ధి చెందినా వ్యతిరేక ఫలితాలు: నామా
కేసీఆర్ పాలనలో ఖమ్మం అభివృద్ధి చెందినా బీఆర్ఎస్‌కు వ్యతిరేక ఫలితాలు వచ్చాయని ఎంపీ నామా నాగేశ్వర్‌రావు అన్నారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ హామీలు అమలు చేయకపోవడాన్ని తాము ప్రశ్నిస్తున్నామంటూ, పార్లమెంటు ఎన్నికల కోడ్ వెలువడే లోపు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంటులో తెలంగాణ గొంతుగా బీఆర్ఎస్ నిలిచిందని, గత ఐదేళ్లలో కాంగ్రెస్, బీజేపీ కంటే బీఆర్ఎస్ ఎక్కువ ప్రశ్నలు లేవనెత్తిందని తెలిపారు. బీఆర్ఎస్‌కు మళ్లీ పూర్వవైభవం వస్తుందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ అన్నారు. ఎంపీ రవిచంద్ర, మాజీ విప్ రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, మదన్‌లాల్, కందాళ ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీలను బ్రోకర్లని అంటారా!

సీఎం రేవంత్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి
- మండలిని ఇరానీ కేఫ్ అని తక్కువ చేసేలా మాట్లాడారు
- మండలి చైర్మన్ గుత్తాకు ఎమ్మెల్సీల వినతిపత్రం

సాక్షి, హైదరాబాద్: శాసనమండలిని ఇరానీ కేఫ్‌గా, ఎమ్మెల్సీలను రియల్ ఎస్టేట్ బ్రోకర్లుగా చిత్రీకరిస్తూ ఓ చానల్ ఇంటర్వ్యూలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డిపై కఠినచర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎమ్మెల్సీలు సురభి వాణీదేవి, ఎంఎస్ ప్రభాకర్, దేశపతి శ్రీనివాస్ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. సీఎం వ్యాఖ్యలు మొత్తం శాసనమండలి సభ్యులను అవమానపరిచేలా ఉన్నాయని పేర్కొన్నారు. టీవీ చానల్ వేదికగా పెద్దల సభపై సీఎం మాట్లాడిన తీరు ఎథిక్స్ కమిటీ పరిశీలించాల్సిన రీతిలో ఉందని అభిప్రాయపడ్డారు. గౌరవ సభ్యులను బాధ్యత కలిగిన ముఖ్యమంత్రి బ్రోకర్లు, ల్యాండ్ డీలర్లుగా ఎలా అభివర్ణిస్తారని ప్రశ్నించారు. శాసన మండలిలో అనేక మంది నిజాయితీ కలిగిన సభ్యులతో పాటు వివిధ రంగాల్లో సేవలకు తమ జీవితాలను అంకితం చేసిన వారు ఉన్నారని పేర్కొన్నారు. సీఎం వాడిన భాషకు ఎంతో వేదనకు గురయ్యామని, ఎథిక్స్ కమిటీ పరిశీలనకు సీఎం వ్యాఖ్యలను పంపి చర్యలు తీసుకోవాలని కోరారు.

క్లుప్తంగా...

గ్రామ పంచాయతీల పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి

సీఎం రేవంత్‌రెడ్డిని కోరిన తెలంగాణ సర్పంచ్‌ల సంఘం

సాక్షి, హైదరాబాద్: గ్రామపంచాయతీల పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం కోరింది. ఈ మేరకు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని సర్పంచ్‌ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుర్వి యాదయ్యగౌడ్, కోలన్ శ్రీనివాస్‌రెడ్డి కలిసి వినతిపత్రం సమర్పించారు. సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, లింకు రోడ్లు, బీటీ రోడ్ల పనులు పూర్తిచేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. జనవరి 31వ తేదీన సర్పంచ్‌ల పదవీకాలం పూర్తి అవుతుందని, ఎన్నికలు జరిగే వరకు ఆ పనులు చేయించే అధికారం సర్పంచ్‌లకే ఇవ్వాలని కోరారు.

'గుంటూరు కారం' టికెట్ల ధర పెంపునకు అనుమతి

హోంశాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: నటుడు మహేశ్‌బాబు హీరోగా నటించిన 'గుంటూరు కారం' సినిమా టికెట్ల ధరల పెంపునకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ చిత్రం ప్రదర్శించే సింగిల్ స్క్రీన్లలో రూ.65, మల్టీప్లెక్స్ థియేటర్లలో రూ.100 టికెట్ల ధర పెంపునకు అనుమతి ఇస్తూ హోంశాఖ ముఖ్యకార్యదర్శి జితేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీ వెంకటేశ్వర ఫిల్మ్స్ అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు. ధరల పెంపు ఈనెల 12 నుంచి 18వ తేదీ వరకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేశారు. ఈ నెల 12న అర్ధరాత్రి ఒంటి గంటకు రాష్ట్రంలో 23 చోట్ల బెనిఫిట్ షోలకు అనుమతి ఇచ్చారు.

భానుకిరణ్ బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వు

సాక్షి, హైదరాబాద్: మద్దెలచెరువు సూర్యనారాయణ అలియాస్ సూరి హత్య కేసులో అరెస్టయి జైలులో ఉన్న భానుకిరణ్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు తీర్పు రిజర్వు చేసింది. టీడీపీ నేత పరిటాల రవి హత్యకేసులో ప్రధాన నిందితుడైన సూరిని, 2011 జనవరి 4న భానుకిరణ్ హత్య చేశాడు. హైదరాబాద్‌లోనే సూరితోపాటు కారులో ప్రయాణించిన భానుకిరణ్ యూసుఫ్‌గూడ ప్రాంతంలో నాటు తుపాకీతో కాల్చి చంపి పరారయ్యాడు. దర్యాప్తు చేపట్టిన సీఐడీ 2012 ఏప్రిల్ 21న జహీరాబాద్ వద్ద భానుకిరణ్‌ను అదుపులోకి తీసుకుంది. కేసు వాదనలు విన్న నాంపల్లి కోర్టు భానుకిరణ్‌కు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.20 వేలు జరిమానా విధిస్తూ 2018లో తీర్పునిచ్చింది. తీర్పును సవాల్ చేస్తూ భానుకిరణ్ హైకోర్టులో పిటిషన్ దాఖ లు చేశారు. అనంతరం ఈ ప్రధాన పిటిషన్‌లో బెయిల్ ఇవ్వాలని కోరుతూ 2023లో మధ్యంతర అప్లికేషన్(ఐఏ) వేశారు. ఈ ఐఏపై న్యాయమూర్తి జస్టిస్‌కె.లక్ష్మణ్, జస్టిస్ శ్రీసుధ ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ చేపట్టింది. పీపీ రాజేందర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్‌కు బెయిల్ ఇచ్చి బయటకు పంపండం అతని ప్రాణాలకే ప్రమాదమన్నారు. ఈ క్రమంలో పిటిషనర్‌కు బెయిల్ ఇవ్వడం సరికాదన్నారు. ఐఏలో వాదనలు పూర్తవడంతో ధర్మాసనం తీర్పు రిజర్వు చేసింది.



సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమైన గోద్రెజ్ ఆగ్రోవెట్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాంసింగ్ యాదవ్ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం, చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు, సీఎస్ శాంతికుమారి, జయేశ్ రంజన్

స్థిరాస్తి, ఫర్నిచర్ రంగాల్లో అపార అవకాశాలు

గోద్రెజ్ ఆగ్రోవెట్ ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి

- ఆయిల్ పామ్, పాడి వ్యాపార విస్తరణకు సంపూర్ణ సహకారం
- యువతలో నైపుణ్యాభివృద్ధిని పెంచే కార్యక్రమాలు చేపట్టండి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో స్థిరాస్తి, ఫర్నిచర్, వినియోగదారుల ఉత్పత్తుల రంగాల్లో ఉన్న అపారమైన వ్యాపార అవకాశాలను పరిశీలించాల్సిందిగా గోద్రెజ్ ఆగ్రోవెట్ కంపెనీకి సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. గోద్రెజ్ ఆగ్రోవెట్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాంసింగ్ యాదవ్ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రితో సమావేశమై చర్చలు జరిపింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. అగ్రోవెట్ రాష్ట్రంలో ఇప్పటికే ప్రారంభించిన ఆయిల్ పామ్, పాడి వ్యాపారాన్ని విస్తరించేందుకు సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా యువతలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించే కార్యక్రమాలను చేపట్టాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. కాగా ఈ కంపెనీ.. మలేసియాకు చెందిన సిమ్ డార్బీ కంపెనీతో కలిసి ఖమ్మం జిల్లాలో ఇంటిగ్రేటెడ్ ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలో వంట నూనెలు, డెయిరీ, అగ్రో, వెటర్నరీ సర్వీసెస్, ఆగ్రో కెమికల్స్, పశువుల దాణా రంగాల్లో వ్యాపారం నిర్వహిస్తోంది. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు, సీఎస్ శాంతికుమారి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

అంకుల్.. స్కూల్‌లో వాష్‌రూమ్స్ లేవు

ఎంపీ సంజయ్‌కు విద్యార్థుల మొర.. నిధుల మంజూరుకు హామీ

వేములవాడ రూరల్: 'అంకుల్.. మాకు వాష్ రూమ్స్, మూత్రశాలలు లేవు, ఇబ్బందులు పడుతున్నాం'అని ఓ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కు మొరపెట్టుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం వెంకటాంపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన వికసిత్‌భారత్ సంకల్పయాత్రకు సంజయ్ హాజరయ్యారు. కార్యక్రమాన్ని ముగించుకుని తిరిగి వెళ్తున్న క్రమంలో బాలరాజుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ సమస్యలను ఎంపీకి ఏకరువు పెట్టారు. దీనికి ఆయన స్పందిస్తూ సౌకర్యాలకు ఎన్ని నిధులు అవసరమో ప్రతిపాదనలు 24 గంటల్లో తెలపాలని అధికారులకు సూచించారు.



సంజయ్‌కు తమ బాధలు చెబుతున్న విద్యార్థులు

'ధరణి' పునర్నిర్మాణానికి ప్రత్యేక కమిటీ

- సభ్యులుగా కాంగ్రెస్ నేత కోదండరెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ రేమండ్ పీటర్, భూచట్టాల నిపుణుడు సునీల్‌తోపాటు మరొకరు

సాక్షి, హైదరాబాద్: ధరణి పోర్టల్ సంస్కరణలపై రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ ప్రారంభించింది. ఈ పోర్టల్ వల్ల ఎదురవుతున్న సమస్యలు పరిశీలించడంతోపాటు ధరణి పునర్నిర్మాణానికి ఐదుగురు సభ్యులతో ప్రత్యేక కమిటీని మంగళవారం ఏర్పాటు చేసింది. ఏఐసీసీ కిసాన్ సెల్ వైస్ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నేత ఎం.కోదండరెడ్డి, ఉమ్మడి రాష్ట్రంలో భూపరిపాలన ప్రధాన కమిషనర్‌గా పని చేసిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రేమండ్ పీటర్, భూచట్టాల నిపుణుడు, నల్సార్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ ఎం.సునీల్‌కుమార్, రిటైర్డ్ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ మధుసూదన్‌లను సభ్యులుగా నియమించింది. ప్రస్తుత భూపరిపాలన ప్రధాన కమిషనర్ మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. ఈ మేరకు రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిత్తల్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

పరిపాలనలో 'రెవెన్యూ' కీలకం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



కుత్బుల్లాపూర్: రెవెన్యూ శాఖ పరిపాలనలో కీలకమని, ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడానికి రెవెన్యూ ఉద్యోగులు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్న తీరు అభినందనీయమని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం కొంపల్లిలో తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) రాష్ట్ర అధ్యక్షుడు వంగ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభకు మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రెవెన్యూ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, గత ప్రభుత్వం ఆ శాఖను నిర్వీర్యం చేసిందని, భూరికార్డులను ధరణి పేరుతో అస్తవ్యస్తంగా నిర్వహించడంతో రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో రెవెన్యూ శాఖను పటిష్టపరిచి రైతులకు న్యాయం చేస్తామని, రెవెన్యూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం రవీందర్‌రెడ్డి మాట్లాడారు. ట్రెసా ప్రధాన కార్యదర్శి గౌతమ్ కుమార్ మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ స్థాయిలో సేవలకు ఆటంకం కలగకుండా క్షేత్రస్థాయిలో సిబ్బందిని నియమించాలని కోరారు. కార్యక్రమానికి సుమారు 5వేలకు పైగా రెవెన్యూ ఉద్యోగులు తరలిరావడంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది.

పారిశ్రామికాభివృద్ధిలో హెచ్‌సీసీబీ

మంత్రి కొండాతో సంస్థ ప్రతినిధుల భేటీ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పారిశ్రామికాభివృద్ధిలో పాలు పంచుకునేందుకు ప్రముఖ శీతలపానీయాల తయారీ సంస్థ హిందుస్థాన్ కోకాకోలా బేవరేజెస్ (హెచ్‌సీసీబీ) ముందుకొచ్చింది. ఈమేరకు మంగళవారం అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో సంస్థ ప్రతినిధుల బృందం భేటీ అయింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోకాకోలా రాష్ట్రంలో ఇప్పటివరకు దాదాపు రూ.3 వేల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టిందని వివరించారు. సిద్దిపేట జిల్లా బండ తిమ్మాపూర్‌లో గ్రీన్‌ఫీల్డ్ బాట్లింగ్ ప్లాంట్ నిర్మాణంలో ఉందని తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులతో పాటు సామాజికాభివృద్ధిలో తమ సంస్థ భాగస్వామి అవుతోందని, అందుకు తగిన విధంగా ప్రాజెక్టులను విస్తరిస్తామని వెల్లడించారు. నీరు, ఘన వ్యర్థాల నిర్వహణ సామర్థ్యం పెంపు, వ్యర్థ జలాల పునర్వినియోగం, యువతకు ఉపాధి అవకాశాలు, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని, ఉద్యోగ అవకాశాలలో మహిళలకు ప్రాధాన్యమిస్తామని సంస్థ ప్రతినిధులు మంత్రికి వివరించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మారుమూల గ్రామాల్లో తాగునీటి ట్యాంకులు, పాఠశాలల్లో మొబైల్ టాయిలెట్లు, అంగన్‌వాడీ భవనాలను నిర్మిస్తామని తెలిపారు. భేటీలో కోకాకోలా బేవరేజెస్ పబ్లిక్ అఫైర్స్ చీఫ్ హిమాన్షు, క్లస్టర్ హెడ్ ముకుందు త్రివేది, బాపూయే తదితరులు పాల్గొన్నారు.

దొడ్డిదారి ఉద్యోగాలను సీఎం దృష్టికి తీసుకెళ్తా

మంత్రి పొన్నం ప్రభాకర్



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ శాఖల్లో దొడ్డిదారి ఉద్యోగాల వ్యవహారంపై విచారణ కోసం సీఎం దృష్టికి తీసుకెళ్తానని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. అక్రమంగా ఉద్యోగాలు పొందిన వారంతా వెంటనే రాజీనామా చేయాలని ఆయన ఆదేశించారు. మంగళవారం గాంధీభవన్‌లో పొన్నం విలేకరులతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యుత్ శాఖతో పాటు మరికొన్ని శాఖల్లో అనేక మంది ఉద్యోగులు దొడ్డి దారిన చొరబడ్డారని ఆరోపించారు. మాజీ ఎంపీ బంధువు పరీక్ష రాయకుండానే అక్రమంగా ఉద్యోగం పొంది, నెలనెలా జీతం తీసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

ఆటోడ్రైవర్ల సమస్యలను పరిష్కరించండి

పదేళ్లుగా ఆటో డ్రైవర్లు అమానవీయ స్థితులను ఎదుర్కొన్నారని పొన్నం ప్రభాకర్ ఎదుట తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్ల సంఘాల జేఏసీ నేతలు గోడు వెళ్లబోసుకున్నారు. జేఏసీ కన్వీనర్ వెంకటేశం (ఏఐటీయూసీ), సత్తిరెడ్డి (టీఏడీఎస్), నరసింహారెడ్డి (ఐఎన్‌టీయూసీ), ఎంఏ సలీం (ఆటో జేఏసీ), మీర్జా రఫత్‌బేగ్ (ఆటో ఓనర్స్ అసోసియేషన్), ఏఐటీయూసీ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ జంగయ్య, నేతలు, తదితరులు పొన్నం నివాసంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి నేతృత్వంలో కలసి వినతిపత్రం అందించారు. ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

ఆధార్ కేంద్రాల సంఖ్య పెంచాలి



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పథకాలకు ఆధార్ లింక్ ఉన్న నేపథ్యంలో ఆధార్ కేంద్రాల సంఖ్యను తక్షణమే పెంచాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కోరారు. ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాలు, ఇతరత్రా అవసరాలు, 'అభయహస్తం'పథకానికి అధార్ అనుసంధానం తప్పనిసరి చేయడంతో మీసేవ కేంద్రాల వద్ద విపరీతంగా రద్దీ పెరిగిందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎంత నిశ్శబ్దంగా మారితే,
అంత చక్కగా వినబడుతుంది.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 10 జనవరి 2024

ప్రజాస్వామ్యం లేని గెలుపు?

ఆమె గెలవడం ఇది అయిదోసారి. అందులోనూ ఇది వరుసగా నాలుగో గెలుపు. మామూలుగా అయితే ఇది అసాధారణం. అయితే, బంగ్లాదేశ్‌లో కాదు. ఆ దేశంలో ఆదివారం పార్లమెంటరీ ఎన్నికలు జరిగిన తీరు కానీ, ప్రధాని షేక్ హసీనా సారథ్యంలోని అవామీ లీగ్ (ఏఎల్) ఘన విజయం కానీ అనూహ్యమేమీ కాదు. మునుపటి ప్రధాని ఖలీదా జియా నేతృత్వంలోని ప్రధాన ప్రతిపక్షమైన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ, దాని మిత్రపక్షాలు... అన్నీ కలిపి 15 పార్టీలు ప్రజాతీర్పుకు దూరంగా ఉన్నప్పుడు పాలక పక్షానిదే గెలుపు కాక మరేమవుతుంది! ఎన్నికలను బహిష్కరించాలంటూ ప్రతిపక్షాలు ప్రజలకు పిలుపునివ్వడంతో సహజంగానే ఓటింగ్ శాతం గణనీయంగా తగ్గింది. 2018 నాటి 80 శాతం సగానికి పడిపోయి, 40 చిల్లర వద్ద తచ్చాడింది. ఫలితాలూ ఊహించినట్టే వచ్చాయి.

మొత్తం 300 స్థానాల్లో 299 స్థానాలకు ఎన్నికలు జరగగా, పాలక పక్షానికి 223 వచ్చాయి. విచిత్రమేమంటే, ఆ తర్వాత అత్యధిక స్థానాలు గెలిచింది స్వతంత్రులే. ఇలా ఇండిపెండెంట్లుగా గెలిచిన 62 మందిలో కూడా అత్యధికులు పాలక అవామీ లీగ్ టికెట్లు ఇవ్వడానికి నిరాకరిస్తూ, పార్టీ అధికారిక అభ్యర్థిపై పోటీ చేసి గెలవమన్న వాళ్ళే! అలా గెలిచినవాళ్ళే! ఇప్పుడు బంగ్లాదేశ్ పార్లమెంట్‌లో రెండో అతి పెద్ద వర్గం ఈ ఇండిపెండెంట్లదే! 'జాతీయ పార్టీ' 11 సీట్లు, మరో మూడు విపక్ష పార్టీలు 3 సీట్లతో ఆ తర్వాతి స్థానాల్లో నామావశిష్టంగా నిలిచాయి. ఇప్పుడిక ఎవరిని పార్లమెంట్‌లో ప్రధాన ప్రతిపక్షంగా ప్రకటిస్తారో చూడాలి. అధికారిక ప్రకటనలెలా ఉన్నా, ఆచరణలో వాస్తవికంగా బంగ్లా ఇప్పుడు ఒక రకంగా ప్రతిపక్షమే లేని పార్లమెంట్ అయింది. షేక్ హసీనా తన తాజా విజయంతో అటు ప్రతిపక్షాలనే కాదు... ఇటు ప్రజాస్వామ్యాన్ని సైతం ఓడించారని విశ్లేషకులంటున్నది అందుకే!

ప్రపంచంలో దీర్ఘకాల మహిళా ప్రభుత్వాధినేత అనే కిరీటం హసీనాదే. 2009 నుంచి హసీనా తాలూకు పార్టీదే అధికారం. అప్పటి నుంచి ఇన్నేళ్ళలో మంచీ చెడులు రెంటిలోనూ హసీనా ఉక్కుమహిళే! అటు ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలతో దేశాన్ని దుర్భర దారిద్ర్యం నుంచి బయటకు తెచ్చి ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసిన కీర్తి, ఇటు మానవ హక్కుల ఉల్లంఘనలు, ప్రతిపక్షాలను ఉక్కుపాదంతో తొక్కేసిన అపకీర్తి... రెండూ ఆమెవే. దేశ ఆర్థిక పురోగతి, సామాజిక అభివృద్ధిలో అవిస్మరణీయ పాత్ర ఈసారి కూడా ఆమెకు విజయం అందించి ఉండవచ్చు. అంతమాత్రాన మిగతా తప్పులన్నీ ఒప్పులై పోవు. అసలు ఈ ఎన్నికల ప్రక్రియ నిష్పాక్షికతపై అంతర్జాతీయ పరిశీలకులు, మానవ హక్కుల సంఘాల వారు అనుమానాలు, ఆందోళనలు వ్యక్తం చేశారు. కీలక సంస్థలు, వ్యవస్థల పైన, అసమ్మతి వినిపించకుండా చివరకు మీడియా పైన కూడా హసీనా సర్కార్ నియంత్రణపై విమర్శలూ వచ్చాయి. 17 కోట్లకు పైగా జనాభా ఉన్న బంగ్లాదేశ్ తరుణ ప్రజాస్వామ్యానికి ఇది వన్నె తీసుకురాదు. బలమైన ప్రతిపక్షం లేకుంటే ప్రజాస్వామ్య వ్యవస్థే లేదు.

హసీనా మరోసారి ఎన్నికవడం భారత్‌కు మాత్రం ఒక రకంగా శుభవార్తే! ఎందుకంటే, హసీనా హయాంలో భారత – బంగ్లాదేశ్ బంధాలు బలపడ్డాయి. వాణిజ్యం పెరిగింది. మెరుగైన రోడ్డు, రైలు రవాణా సదుపాయాలు ఏర్పడ్డాయి. అంతకన్నా ముఖ్యంగా దక్షిణాసియా ప్రాంతానికి తీవ్రవాదం పెనుముప్పుగా పరిణమించిందని ఏకాభిప్రాయంతో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో మునుపటి షేక్ హసీనా హయాం మరో పర్యాయం కొనసాగడం ఢిల్లీ దృష్టి నుంచి చూస్తే మంచిదే! బంగ్లాదేశ్‌లో రాజకీయ సుస్థిరత, విదేశాంగ విధానాల కొనసాగింపు మనకు లాభించే విషయాలు. పైగా, అంతర్యుద్ధంలో కూరుకుపోయిన ఉమ్మడి పొరుగుదేశమైన మయన్మార్ నుంచి శరణార్థుల సమస్య పెరుగుతూ, తీవ్రవాదులకు ఆయుధాలు సులభంగా అందివచ్చే పరిస్థితులున్న సమయంలో బంగ్లాదేశ్‌లో స్నేహశీల సర్కార్ ఉండడం భారత్‌కు ఒకింత సాంత్వన.

నిజానికి, రాగల కొద్దినెలలు దక్షిణాసియా ప్రాంతానికి కీలకం. ఎందుకంటే, ఈ ప్రాంతంలోని పలు దేశాల్లో ఈ ఏడాదే ఎన్నికలున్నాయి. ఈ ఫిబ్రవరి 8న పాకిస్తాన్‌లో ఎన్నికలు జరగనుంటే, ఆ తరువాత కొద్దినెలలకే శ్రీలంకలో అధ్యక్ష పదవికి ఎన్నిక. ఇక, ఏప్రిల్ – మే నెలల్లో భారత్‌లో లోక్‌సభ ఎన్నికలు సరేసరి. వివిధ దేశాల ఎన్నికల ఫలితాలు, కొలువు దీరే కొత్త ప్రభుత్వాలు, వాటి వైఖరిలో మార్పులను బట్టి భారత ఉపఖండంలో అనేక మార్పులు రావడం సహజం. ఇప్పటికే నిరుడు సెప్టెంబర్‌లో మాల్దీవుల్లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో భారత వ్యతిరేక వైఖరిని అస్త్రంగా చేసుకొని, మహమ్మద్ మొయిజు గద్దెనెక్కారు. భారత్‌కు దీర్ఘకాలిక మిత్రదేశమైన మాల్దీవులు అప్పటి నుంచి ఢిల్లీ కన్నా బీజింగ్ వైపు మొగ్గుతూ ఉండడం చూస్తూనే ఉన్నాం. తాజా లక్షద్వీప్ వర్సెస్ మాల్దీవ్స్ ఘటనలోనూ అదే కనపడింది. వీటన్నిటి దృష్టితో చూసినప్పుడూ బంగ్లాదేశ్‌లో మరోసారి భారత అనుకూల హసీనా సర్కార్ ఏర్పాటవడం భారత్‌కు ప్రయోజనకరమే!

ఇటు భారత్‌తో వాణిజ్య, సాంస్కృతిక సంబంధాలు, అటు చైనా సైనిక ఆలంబన – రెండూ కొనసాగిస్తూ హసీనా చేస్తున్న సమతూకం అందరికీ చేతకావు. అలాంటి ఆమె విజయాలు ప్రశంసార్హమే అయినా, సాగిస్తున్న రాజకీయ అణచివేతను విస్మరించలేం. ఆన్‌లైన్‌లో విమర్శించినా అరదండాలే అన్న డిజిటల్ భద్రతా చట్టం లాంటివి పౌరస్వేచ్ఛకు ప్రతిబంధకాలు. ప్రజాస్వామ్య వాతావరణమే లేకుంటే, చివరకు అమెరికా సహా ఇతర అభివృద్ధి చెందిన దేశాలు వాణిజ్య షరతులు విధిస్తాయి. అదే అదనుగా బంగ్లాదేశ్ పక్షాన చైనా బరిలోకి దిగుతుంది. అది భారత్‌కూ అభిలషణీయం కాదు. అందుకే, ప్రతిపక్షాలను ఊపిరి పీల్చుకోనిచ్చేలా, వ్యవస్థల స్వతంత్రతను కాపాడేలా హసీనా సర్కార్‌కు భారత్ నచ్చజెప్పాలి. బంగ్లాకూ, భారత్‌కూ దీర్ఘకాలంలో అదే శ్రేయస్కరం.

అభివృద్ధిలో సరికొత్త నమూనా

విశ్లేషణ



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

భారత్‌లోని అనేక ప్రాంతాలు ఇప్పటికీ ఆధునిక ఆర్థిక వ్యవస్థకు అనుసంధానం కాలేదు. ప్రపంచ మార్కెట్ వ్యవస్థలకు అనుసంధానించడంలో విద్యదే కీలక పాత్ర. ఆధునిక విద్యాసంస్థలతో కూడిన గ్రామాభివృద్ధి నమూనాను ఏ రాష్ట్ర ప్రభుత్వమూ అనుసరించలేదు. ఈ నమూనాపై ఏపీలో వైఎస్ జగన్ ప్రభుత్వం దృష్టి సారించింది. రెండు వినూత్న ఆలోచనలను ముందుకు తేవడం ద్వారా జగన్ దీన్ని సాధ్యం చేశారు: 1. ప్రభుత్వ రంగంలో నాణ్యమైన ఇంగ్లీషు మీడియం విద్యను అందించడం. 2. పాఠశాల మౌలిక సదుపాయాలు, గ్రామ పరిపాలనను భారీగా మార్చడానికి వనరులను ఖర్చు చేయడం. దాని భవిష్యత్తు ప్రభావాన్ని దేశం మొత్తం మీద ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా ఊహించలేకపోయారు. ఇది విప్లవాత్మకమైన అభివృద్ధి నమూనా.

2024 సాధారణ ఎన్నికలకు ముందు భారతదేశంలో ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ముగిశాయి. ఇక, పార్లమెంటు ఎన్నికలతో పాటు అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కొనే నాలుగు రాష్ట్రాలు: ఆంధ్రప్రదేశ్, ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం.

ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిని మునుపెన్నడూ ఊహించని పథంలోకి మార్చింది. సాధారణంగా అభివృద్ధి అంటే... ఎత్తయిన భవనాలు, మంచి రోడ్లు వంటి పట్టణ మౌలిక సదుపాయాలలో పెట్టుబడి పెట్టడానికి విధానాలను రూపొందించడమే అని రాష్ట్ర ప్రభుత్వాలు భావిస్తాయి. సాధారణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీ మొత్తంలో బడ్జెట్ నిధులను పెద్ద కాంట్రాక్ట్ నిర్మాణాలకు వెచ్చిస్తాయి. ప్రపంచీకరణ యుగంలో నయా ఉదారవాద ఆర్థికవేత్తలు అలాంటి ఖర్చును మంచి అభివృద్ధిగా పరిగణిస్తారు. ఆరెస్సెస్, బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కూడా ఈ నమూనానే అనుసరిస్తోంది. సోషలిస్ట్ ఎకానమీ నుండి పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ వైపునకు మారిన చైనా కూడా ఇదే నమూనాను అవలంబించింది. వీటితో పోలిస్తే భారతీయ కుల అసమానతలకు కాస్త భిన్నమైన విధానం అవసరం.

భారతదేశంలో రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యం ఉన్నప్పటికీ, దాని అసాధారణమైన కుల అడ్డంకులు ప్రజల కేంద్రిత అభివృద్ధికి అనేక అవరోధాలను సృష్టించాయి. రెండవది, భారతీయ గ్రామాలు చెల్లాచెదురుగా ఉన్నాయి. వ్యవసాయాభివృద్ధి పూర్తిగా వ్యవసాయాన్ని పెట్టుబడిగా మార్చే దశకు చేరుకోలేదు. దేశంలోని అనేక ప్రాంతాలు ఇప్పటికీ ఆధునిక ఆర్థిక వ్యవస్థకు అనుసంధానం కాలేదు. ప్రజలను జాతీయ, ప్రపంచ మార్కెట్ ఆర్థిక వ్యవస్థలకు అనుసంధానించడంలో వారి విద్యే కీలక పాత్ర పోషిస్తోంది.

గ్రామీణులను ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోకి...

గ్రామీణ పిల్లలకు, యువతకు విద్యను అందించడానికి ఆధునిక విద్యాసంస్థలతో కూడిన గ్రామాభివృద్ధి నమూనాను ఏ రాష్ట్ర ప్రభుత్వమూ అనుసరించలేదు. ఈ నమూనాపై జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం దృష్టి సారించింది. గత ఐదేళ్లలో తన బడ్జెట్‌లో ఎక్కువ భాగం గ్రామీణ విద్యా మౌలిక సదుపాయాలు, సాఫ్ట్ స్కిల్స్‌ను నిర్మించడం కోసం కేటాయించింది.

విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో గత పదేళ్లలో టీడీపీ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాలు పూర్తి వ్యతిరేకమైన అభివృద్ధి నమూనాలను ఎలా ఎంచుకున్నాయో చూడాలి. టీడీపీ ప్రభుత్వం కృష్ణా నది ఒడ్డున ఉన్న 30,000 ఎకరాల సారవంతమైన వ్యవసాయ భూమిని లాక్కొని, రాష్ట్ర బడ్జెట్‌లో ఎక్కువ భాగం అమరావతిని నిర్మించేందుకు కేటాయించడానికి సిద్ధమైంది. పెద్ద నగరాలు మాత్రమే పెట్టుబడులు తెస్తాయనీ, వెలుపలి నుంచి వచ్చే పెట్టుబడితో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనేది నయా ఉదారవాద ఆర్థిక ఆలోచన. ఇది భారీ స్థాయి పెట్టుబడులతో కూడిన సిటీ మాల్ మార్కెట్‌లలోకి విస్తారమైన గ్రామీణ ప్రజలను తీసుకోలేదు. అందుకే, ధనవంతుల కోసం ఉద్దేశించిన ప్రైవేట్ పాఠశాల విద్యతో సరిపోయే పాఠశాల వ్యవస్థలో వారిని విద్యావంతులను చేయాలి. ఆ ప్రైవేట్ పాఠశాల విద్య ఇంగ్లీషు మీడియంలో కొనసాగాలి. గ్రామీణ వ్యవసాయాధారిత పిల్లలకు ప్రభుత్వ రంగంలో ఇలాంటి విద్యను అందించకపోతే వారు రాష్ట్ర, జాతీయ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో చేరలేరు.



విప్లవాత్మక అభివృద్ధి నమూనా

భారీ మల్టీ లేన్ రోడ్లు, పెద్ద విమానాశ్రయాలు, ఓడరేవులతో కూడిన 'హైవే ఎకానమీ', ప్రభుత్వ రంగ పరిశ్రమలను భారీగా ప్రైవేటీకరించడం ఆర్‌ఎస్‌ఎస్ దృక్పథానికి బాగా సరిపోతుందని మితవాద ఆర్థికవేత్తలు భావిస్తున్నారు. ఆరెస్సెస్‌కి సంబంధించిన ఈ ఆధునిక ఆలోచన పురాతనమైన మధ్యయుగ వర్ణ ధర్మ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానమై ఉంది. ఆ వ్యవస్థలో శూద్ర ఉత్పాదక ప్రజానీకానికి ఆస్తులపై యాజమాన్యం ఉండకూడదు. ఈ నమూనాతో చంద్రబాబు భ్రమించి పోయారు. వైఎస్ జగన్ మాత్రం అభివృద్ధి నమూనానే మార్చేశారు. దీన్ని నేను శూద్ర అభివృద్ధి నమూనా అని పిలుస్తున్నాను. రాష్ట్ర బడ్జెట్ ప్రధానంగా అన్ని కులాలు, కార్మిక వర్గాలను కలిగి ఉన్న వ్యవసాయ, చేతివృత్తుల ఉత్పాదక ప్రజానీకానికి ఉద్దేశించినదని సూచించడానికి నేను శూద్ర అనే చారిత్రక పదాన్ని ఉపయోగిస్తున్నాను.

మొత్తం వ్యవసాయ, చేతివృత్తులకు చెందిన ఉత్పాదక ప్రజానీకంలో (ఆదివాసీ, దళిత వర్గాలు, రిజర్వుడ్ శూద్ర ఓబీసీలు, రెడ్డి, కమ్మ, కాపు వంటి అన్‌రిజర్వుడ్ శూద్రులు అందరూ ఇందులో ఉంటారు) నైపుణ్యాలు, వనరుల పునాదిని తప్పనిసరిగా మార్చాలని వైఎస్ జగన్ సరిగ్గా అర్థం చేసుకున్నారు. రాష్ట్ర పెట్టుబడిని పాఠశాల, కళాశాల విద్య, గ్రామ పరిపాలనలోకి మార్చడం ద్వారా ఈ పరివర్తన సాధ్యమవుతుంది.

వైఎస్ జగన్ రెండు వినూత్న ఆలోచనలను ముందుకు తేవడం ద్వారా ఇదంతా సాధ్యం చేశారు: 1) ప్రభుత్వ రంగంలో నాణ్యమైన ఇంగ్లీషు మీడియం విద్యను అందించడం. ఇది నైపుణ్యం, జ్ఞానం రెండింటిలోనూ గ్రామాన్ని ప్రపంచంతో కలుపుతుంది. విద్యా ఖర్చుల కోసం డబ్బును బదిలీ చేయడం ద్వారా పాఠశాల, కళాశాల పిల్లల తల్లులకు ఆర్థిక సహాయం అందించడాన్ని కూడా దీనికి జోడించారు. 2) పాఠశాల మౌలిక సదుపాయాలను, గ్రామ పరిపాలనను భారీగా మార్చడానికి రాష్ట్ర అభివృద్ధి వనరులను ఖర్చు చేయడం. ప్రధాన వ్యాపారాలు లేని, శ్రమతో పని చేసే సాంప్రదాయ శూద్రులందరికీ ఈ నమూనాలో కొత్త నైపుణ్యాలు, ప్రపంచ భాషతో వ్యవహరించడానికి ప్రవేశం లభిస్తుంది. దాని భవిష్యత్తు ప్రభావాన్ని ఇప్పటి వరకు దేశం మొత్తం మీద ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా ఊహించలేకపోయారు. ఇది విప్లవాత్మకమైన అభివృద్ధి నమూనా.

పెట్టుబడుల కేంద్ర మార్పు

ఈ నమూనా... పెట్టుబడిని కేంద్రీకృత పట్టణ రంగాల నుండి వైవిధ్యమైన గ్రామీణ సమాజాలకు మారుస్తుంది. ఇది పట్టణ బ్యాంకుల్లోని డబ్బు నిల్వలను గ్రామీణ మార్కెట్లకు తరలిస్తుంది. ఇది విస్తారమైన గ్రామీణ ప్రజల ఆరోగ్యం, వ్యయం, ఉత్పత్తి, విజ్ఞాన పునాదిని మెరుగుపరుస్తుంది. మొత్తంగా సంపద కేంద్రీకరణను పట్టణ ధనవంతుల నుండి విస్తారమైన గ్రామీణ ప్రజానీకానికి బదలాయిస్తుంది. ఈ పెట్టుబడి ఉచితాల కిందికి రాదు. ఇది భవిష్యత్ విప్లవానికి సంబంధించిన పెట్టుబడి. సాధారణంగా విప్లవం గురించి మాట్లాడే కమ్యూనిస్టులు కూడా భారతీయ కుల–సాంస్కృతిక సమాజంలో విప్లవం అంటే ఏమిటో అర్థం చేసుకోలేకపోయారు. బెంగాల్‌లో వారి 34 ఏళ్ల పాలన గ్రామీణ ప్రజానీకాన్ని ప్రపంచీకరణ ప్రక్రియతోనూ, ఆంగ్ల విద్యతోనూ ముడిపెట్టకుండా ఎలా దూరంగా ఉంచిందో నిరూపించింది.

ఈ విప్లవం భారతదేశ అభివృద్ధిపై రెండు ముఖ్యమైన ప్రభావాలను కలిగి ఉంది. చారిత్రాత్మకంగా జ్ఞాన వ్యవస్థను నియంత్రిస్తున్నందున సంపద మొత్తంగా ద్విజ సంఘాల చేతుల్లో కేంద్రీకృతమై ఉంది. పురాతన కాలంలో ఇది సంపదను, సంస్కృత భాషను నియంత్రించింది. మధ్యయుగ కాలంలో ద్విజులు ముస్లిం పాలకులతో కలిసి సంపదను, పర్షియన్ భాషను నియంత్రించారు. గత 75 ఏళ్లుగా వారు సంపదను, ఆంగ్ల భాష ఆధారిత జ్ఞానాన్ని నియంత్రించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం విద్యపై దృష్టి సారించడం ద్వారా వైఎస్ జగన్ ప్రభుత్వం సంపదను, విజ్ఞానాన్ని వ్యవసాయ, చేతివృత్తుల వారి చేతుల్లోకి తెచ్చింది.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

తారుమారు



ముస్లింల పవిత్ర స్థలాలైన మక్కా, మదీనాల్లోకి ముస్లిమేతరులకు ప్రవేశం లేదు. అలాంటిది స్మృతీ ఇరానీ(కేంద్ర మంత్రి), నిరుపమా కొట్రు (ఉన్నతాధికారి) ఇవ్వాళ మదీనా సందర్శించారు. ఒకవైపు సౌదీ అరేబియా ఉదార, నాగరిక దేశంగా మారుతుంటే, మరోవైపు నా బంగ్లాదేశ్ మాత్రం (ఒకప్పటి) ఛాందస, అనాగరిక సౌదీలా మారుతోంది.

– తస్లీమా నస్రీన్, రచయిత్రి

వెళ్లిపోయిన లెజెండ్



ఒక అందమైన యుగం ముగిసింది. భారత శాస్త్రీయ సంగీతంలో గొప్ప లెజెండ్స్‌లో ఒకరైన ఉస్తాద్ రషీద్ (ఖాన్) జీ వెళ్లిపోవడం అత్యంత విషాదకరం (క్యాన్సర్‌తో మరణించారు). ఆయన మా సినిమాలో 'సజ్నా' పాట పాడటం మర్చిపోలేను. ఆయన కుటుంబానికి నివాళి.

– మిమీ చక్రవర్తి, నటి, లోక్‌సభ ఎంపీ (తృణమూల్)

స్ఫూర్తికి సలామ్!



2023లో నాకు అతిపెద్ద ప్రేరణ శీతల్ దేవి. ఆమె పట్టుదల సంభ్రమం కలిగించింది. ఆమె మీద ఎవరైనా సినిమా తీస్తే బాగుండు. బాలబాలికలు ఎందరికో స్ఫూర్తి కాగలదు. శీతల్... నీకు వందనం! (16 ఏళ్ల రెండు చేతులూ లేని విలువిద్యా క్రీడాకారిణి. అర్జున అవార్డు అందుకుంది.)

– దీపికా నారాయణ్ భరద్వాజ్, డాక్యుమెంటరీ ఫిల్మ్ మేకర్

నూతన దౌత్యం?



మాల్దీవుల విషయంలో భారత స్పందన... సంప్రదాయేతర మార్గాల ద్వారా బలప్రయోగ దౌత్యానికి ఒక పాఠ్యపుస్తక ఉదాహరణ.

– హేమాన్ జాకబ్, ప్రొఫెసర్

ఎలాంటి సందర్భం!



రాష్ట్రపతి ద్రౌపది (ముర్ము)... అర్జున, ద్రోణాచార్య అవార్డులను బహూకరించడం దానికదే ఒక ఇతిహాసం.

– రమేశ్ శ్రీవత్స్, వ్యాఖ్యాత

ఇన్ బాక్స్

తీర్పు హర్షణీయం

'బిల్కిస్ బానో' కేసులో యావజ్జీవ జైలు శిక్ష అనుభవిస్తున్న 11 మందినీ విడుదల చేస్తూ గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు తప్పు పట్టింది. రెండు వారాలలోగా 11 మంది ముద్దాయిలూ జైలు అధికారుల ముందు లొంగిపోవాల్సిందిగా ఆదేశాలిచ్చింది.

ఈ తీర్పుకు వివిధ సాంస్కృతిక సంస్థల సమ్మిళిత రూపమైన విజయవాడ 'సంగమం' హర్షం వ్యక్తం చేస్తోంది. జస్టిస్ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన సుప్రీంకోర్టు బెంచ్... 2002లో గుజరాత్‌లో బిల్కిస్ బానోపై సామూహిక లైంగిక దాడి చేయడం, ఆమె కుటుంబ సభ్యులను చంపడం వంటి దారుణాలకు పాల్పడిన హంతకుల శిక్షాకాలంలో రెమిషన్ ఇవ్వవచ్చునని సిఫార్సు చేసిన గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వ చర్యను తప్పు పట్టింది. ఆ సిఫార్సు ఆధారం చేసుకుని ఒకానొక సుప్రీంకోర్టు బెంచ్ యావత్ జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న వారిని 2022 ఆగస్టు 15న విడు దల చేసిన సంగతి తెలిసిందే. అసలు అలాంటి రెమిషన్ యధాలా పప్పు నిర్ణయమనీ, అలాంటి నిర్ణయం గైకొనే అర్హత గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వానికి లేదనీ కూడా సుప్రీం కోర్టు స్పష్టం చేసింది.

వాస్తవానికి కేసు విచారణ జరిగిన, శిక్ష విధించిన మహారాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వానికి మాత్రమే రెమిషన్ గురించిన సిఫారసు చేసే అవకాశం ఉన్నది. కానీ, గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం రెమిషన్ సిఫారసు చేసింది. దీంతో భయంకర నేరానికి పాల్పడిన 11 మంది ముద్దాయిలకు 75 ఏళ్ల స్వాతంత్ర్య అమృతకాలంలో 2022 ఆగస్టు 15న విడుదల అయ్యే అవకాశం లభించింది. వారిని గుజరాత్ రాష్ట్ర బీజేపీ నాయకులు దండలతో అభినందనలతో స్వాగత సత్కారాలు నిర్వహించారు. విజయోత్సవాలు జరిపారు.

దేశం దేశమంతా సిగ్గుపడేట్లు చేసిన ఈ సంఘటనను ప్రశ్నిస్తూ బిల్కిస్ బానో తిరిగి సుప్రీంకోర్టుకు ఫిర్యాదు చేశారు. అలాగే కొందరు ప్రజా ప్రయోజనాల వాజ్యాన్ని వేశారు. తాజాగా తీర్పు నిచ్చిన సుప్రీంకోర్టు, తనకు లేని అధికారాలను ఉపయోగించుకుని బిల్కిస్ కేసులో ముద్దాయిలకు గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం రెమిషన్ వచ్చేట్లు చేయటాన్ని తప్పు పట్టిన దృష్ట్యా, తక్షణమే గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వ మంత్రివర్గం రాజీనామా చేయాలి.

– సి. ఉమా మహేశ్వరరావు, సినీ దర్శకులు, 'సంగమం' కోకన్వీనర్

భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అయోధ్య

సందర్భం



డా॥ పాలేరు పోతురాజు

భారత దేశ ప్రాచీన నగరాలలో అత్యంత ప్రముఖమైన నగరం అయోధ్య. గత కొన్ని దశాబ్దాలుగా ఇది భారత్‌లో వార్తల్లో నానుతూనే ఉంది. ఈ ఏడాది జనవరి 22న అయోధ్యలో నిర్మించిన రామాలయంలో బాల రాముని ప్రాణ ప్రతిష్ఠ జరుగనున్న నేపథ్యంలో మళ్లీ వార్తల్లో నిలిచింది. నేటి ఉత్తరప్రదేశ్‌లోని ఫైజాబాద్ జిల్లాలో సరయు నది ఒడ్డున అయోధ్య ఉంది. ఇతిహాసాలు, పురాణాల్లో అయోధ్య ప్రముఖంగా పేర్కొనబడింది. మాంధాత, సత్యహరిశ్చంద్రుడు, రఘువంశ రాముడు లాంటి ఐతిహాసిక పురుషులు ఈ ప్రాంతాన్ని పాలించారని అంటారు. రామాయణంలో వాల్మీకి ఈ నగరాన్ని వర్ణిస్తూ ఏడు వేల చ.కి.మీ. వైశాల్యంలో విస్తరించిందని పేర్కొన్నాడు.

'షోడశ మహాజన పదాలు' అని వ్యవహరించిన 16 రాజ్యాలు అత్యంత ప్రాచీన కాలంలో భారత ఉప ఖండంలో ఉండేవని చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. వీటిలో ఒక రాజ్యమే కోసల. ఈ రాజ్యాన్ని పరిపాలించినవాడు గౌతమ బుద్ధుని తండ్రియైన శుద్ధోదనుడు. బుద్ధుడు వర్షాకాలములో అయోధ్యలో నివసించినట్లు బౌద్ధ గ్రంథాలు చెబుతున్నాయి. భారతదేశాన్ని సందర్శించిన చైనా యాత్రికులు పాహియాన్, హుయాన్ త్సాంగ్ తమ రచనలలో అయోధ్య నగరంలో చాలా బౌద్ధ ఆలయాలు ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే జైన తీర్థంకరుల ఆలయాలూ ఇక్కడ ఉండేవి. ఇప్పటికీ అయోధ్య జనాభాలో బౌద్ధ, జైన మతస్థులు కలిసి ఒక శాతంగా ఉండటం చూస్తే... ప్రాచీన కాలం నుంచి ఇక్కడ ఈ మతాల ఉనికి కొనసాగుతున్నదని అర్థమవుతోంది.

16వ శతాబ్దం వచ్చేటప్పటికి మొగలాయీల రాజ్యానికి బాబర్ అంకురార్పణ చేశాడు. అతడి పాలనాకాలంలోనే అయోధ్యలో 'బాబ్రీ మసీద్' నిర్మిత మయ్యింది. ఈ మసీదు నిర్మించిన ప్రాంతంలోనే రాముడు జన్మించినట్లు హిందూ సంస్థలు భావిస్తున్నాయి. మొఘలుల పతనం తర్వాత అనేక ప్రాంతీయ రాజ్యాలు ఏర్పడినాయి. వాటిలో ఒకటి 'అవధ్'. ఈ రాజ్య మొదటి పాలకుడు సాదత్ ఖాన్. వీరు పర్షియా నుండి రావటం వలన ఈ ప్రాంతంలో భారతీయ, పారశీక సంస్కృతుల మేలు కలయికతో 'లక్నో సంస్కృతి' విలసిల్లింది. వీరి కాలంలో అయోధ్యలో నిర్మించిన మోతీమహల్, గులాబీ బారి (షుజా ఉద్దౌలా సమాధి) వంటి కట్టడాలు వీరి వాస్తు శైలికి మంచి ఉదాహరణలు. ఈ పాలకులే అయోధ్యలోని 'హనుమాన్ గరి' ఆలయ నిర్వహణకు భూదానాలు చేశారు. అయోధ్యలో అనేక సూఫీ సన్యాసుల సమాధులూ (దర్గాలు) ఉన్నాయి. అంటే సూఫీ మతం కూడా ఇక్కడ చెప్పుకోదగిన విధంగానే విలసిల్లిందని భావించాలి.

1949 నాటికి బాబ్రీ మసీద్ తమదని హిందూ సంస్థలు ప్రకటించడంతో నెహ్రూ ప్రభుత్వం మసీదుకు తాళం వేయించింది. తరువాత ఈ అంశం కోర్టుకెక్కింది. ఈ లోపు కొన్ని పరిణామాల నేపథ్యంలో 1986 ఫిబ్రవరిలో ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ మసీదు తాళాలు తీయించారు. 1987లో దూరదర్శన్‌లో రామాయణం సీరియల్ దేశవ్యాప్తంగా ప్రసారం కావటంతో 'రామ జన్మభూమి' అంశాన్ని హిందూ మతవాద సంస్థలు ప్రజలలోకి చాలా తేలికగా తీసుకొని వెళ్ళగలిగాయి. దేశ రాజకీయాలలో 1984లో రెండు సీట్లు ఉన్న బీజేపీ 1989లో 86 సీట్లు గెలవగలిగిన స్థితికి చేరుకుంది. బీజేపీ అధ్యక్షుడు ఎల్కే అద్వాణీ 'రామ జన్మభూమి'ని ఆయుధంగా చేసుకొని రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకోవడం కోసం 1990 సెప్టెంబర్ 25న గుజరాత్‌లోని సోమనాథ్ నుండి 6 వేల మైళ్ళ దూరంలో ఉన్న అయోధ్యకు రథయాత్ర ప్రారంభించారు. ఈ రథ యాత్ర 10 రాష్ట్రాల గుండా ప్రయాణించటానికి ఏర్పాట్లు చేసుకొన్నారు. అక్టోబరు 23న బిహార్‌లోని సమస్తిపూర్ చేరుకున్న రథ యాత్రను నాటి ముఖ్య మంత్రి లాలు ప్రసాద్ యాదవ్ అడ్డుకుని అద్వాణీని అరెస్టు చేయించారు. ఈ నేపథ్యంలో 75 వేల మంది కరసేవకులు అయోధ్య చేరటంతో ఆనాటి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ములాయంసింగ్ యాదవ్ బాబ్రీ మసీదును వారి నుంచి కాపాడారు. 1992లో కేంద్రంలో కాంగ్రెస్, యూపీలో బీజేపీ అధికారంలో ఉన్నాయి. డిసెంబరు 6న కరసేవకులు బాబ్రీ మసీద్‌ను కూల్చివేసి అక్కడ రాముని విగ్రహాలు పెట్టారు.



2014 ఎన్నికలలో బీజేపీ సంపూర్ణ మెజారిటీ సాధించిన తరువాత సుప్రీం కోర్టు 2019లో 2.77 ఎకరాలలో రామాలయం నిర్మించటానికి అనుమతి నిచ్చింది. ముస్లింలకు వేరొక చోట 5 ఎకరాలలో మసీద్‌ను నిర్మించుకోవటానికి అనుమతి నిచ్చింది. 2020లో నాటి ప్రధాని నరేంద్రమోదీ రామ మందిరానికి శంకుస్థాపన చేశారు. ఈ ఏడాది జనవరి 22న ఆ మందిరంలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ జరుగనున్నది. అయోధ్యలోని రాముని ఆలయ సముదాయం 64 ఎకరాలలో నిర్మితమయ్యింది. ప్రధాన ఆలయం 2.77 ఎకరాలలో 'నాగర' శైలిలో సిమెంటు, ఇనుము ఉపయోగించకుండా మూడు అంతస్తుల్లో 5 మండపాలతో 'అష్టభుజి' ఆకృతిలో నిర్మించారు. అత్యంత ప్రాచీన కాలం నుంచి ఇప్పటి వరకు అయోధ్య, దాని చుట్టు పక్కల ప్రాంతాలను గమనించినట్లయితే... అది అనాది నుంచీ అనేక మతాలకూ, సంస్కృతులకూ ఆలవాల మయ్యిందని అర్థమవుతోంది. వివిధ మతాలవారు కలిసి మెలిసి సహజీవనం చేశారని తెలుస్తోంది. ఇప్పుడు కూడా అయోధ్యలో హిందూ దేవాలయాల దగ్గర ముస్లింలు పూజాసామగ్రి అమ్ముతూ వుంటారు. అదే విధంగా ముస్లింల దర్గాల దగ్గర హిందువులు తమ వ్యాపారాలను కొనసాగిస్తూ వున్నారు. బౌద్ధులూ, జైనులూ గణనీయంగానే ఇక్కడ నివసిస్తున్నారు. భవిష్యత్తులో కూడా అయోధ్య మతసామరస్యానికీ, భిన్నత్వంలో ఏకత్వానికీ ప్రతీకగా నిలుస్తుందని ఆశిద్దాం.

వ్యాసకర్త గుంటూరు హిందూ కళాశాలలో చరిత్ర అధ్యాపకులు । 9441 693201

పశుపతి

భోళాశంకరుడని కాబోలు, శివుడితో ఆయన భక్తులు అప్పుడప్పుడూ చమత్కారంగా వాదిస్తుంటారు.

'ఓ శంకరా, నేను పశువులా ప్రవర్తిస్తూ పాశవికమైన పనులు చేస్తూ ఉంటాను గదా అని, 'వీడొక పశువు' అని నన్ను దూరం చేయకు' అని వాదిస్తాడు ఒక భక్తుడు. 'నేను పశువునైతే, నా రక్షణ భారం ఎవరిది? 'పశుపతి'వి నువ్వే కనక ఆ బాధ్యత నీదే! పైగా నువ్వు ఇప్పటికే ఒక పశువును నీ చెప్పు చేతలలో ఉంచుకొని, దాని మీదే విహరిస్తుంటావన్నది జగమెరిగిన సత్యం. కాబట్టి నేను పశువునయితే, నన్ను అదుపు చేసి, సరయిన మార్గంలో సవ్యంగా నడిపించడం నీకు కష్టం కాదు. అది నీకు అలవాటే.

జ్యోతిర్మయం

లేక, నేను అనేక విధాలైన పాపాలు చేసి కళంకితుడినయిపోయానని నువ్వు నన్ను తోసిపారేస్తావేమో, అదీ న్యాయం కాదు. నువ్వు లోకమంతా వెతికివెతికి, మరేదీ దొరకనట్టు, మచ్చ(కళంకం) ఉన్న చంద్రుడిని తెచ్చుకొని, నిరభ్యంతరంగా సిగపూవుగా అలంకరించుకొన్నవాడివి. కనక, కళంకితుడినన్న నెపంతో నన్ను కాదనడం నీకు భావ్యం కాదు.

అంతే కాదు, నేను ఎన్నో అబద్ధాలాడుతుంటాను. రెండు నాలుకల వాడిని. 'ద్విజిహ్వు'డిని. నిజమే. కానీ ఆ సాకు చూపి నన్ను నువ్వు వదిలించుకోవడానికి ప్రయత్నిస్తే, అదీ అన్యాయమే అవుతుంది. నువ్వు రెండు నాలుకలున్న పాములను కోరి కోరి, ఆభరణాలుగా ధరించి తిరిగే వాడివి. సర్పాలతో సహ జీవనం చేసే వాడివి, రెండు నాలుకల వాడినని నన్నెలా తిరస్కరిస్తావు?

అందుచేత, త్వదంగీకృతాః, శర్వ! సర్వే–అపి ధన్యాః– ఓ పరమశివా! నువ్వు స్వీకరించినవన్నీ ధన్యత్వాన్ని పొందుతాయి. నేనూ అంతే' అని భక్తుడి వాదం. సబబే కదా?

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** బ.చతుర్దశి రా.7.27 వరకు, తదుపరి అమావాస్య, **నక్షత్రం:** మూల రా.7.24 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** సా.5.52 నుండి 7.24 వరకు, తదుపరి తె.4.49 నుండి 6.21 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.45 నుండి 12.33 వరకు, **అమృత ఘడియలు:** ప.1.17 నుండి 2.51 వరకు ; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 6.37, **సూర్యాస్తమయం:** 5.38.

వికారాబాద్-కృష్ణా రైల్వే లైన్‌కు ప్రణాళికలు సిద్ధం చేయండి

దక్షిణ మధ్య రైల్వే జీఎంకు సీఎం రేవంత్ సూచన



సీఎం రేవంత్‌ను కలిసిన దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: వికారాబాద్-కృష్ణా రైల్వే లైన్ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. మంగళవారం సచివాలయంలో సీఎంను అరుణ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రైల్వే లైన్ల అభివృద్ధి, కొత్త రైల్వే లైన్ల ఏర్పాటుపై ఈ సమావేశంలో చర్చించారు. గతంలో ప్రతిపాదించిన వికారాబాద్-కృష్ణా రైల్వే లైన్ అభివృద్ధిపైనా సమావేశంలో చర్చ జరిగింది. ఎంతో కాలంగా నిర్లక్ష్యానికి గురైన ఈ మార్గాన్ని పూర్తి చేయాల్సిన అవసరముందని సీఎం సూచించారు. ఈ మార్గాన్ని పూర్తి చేస్తే పరిసర ప్రాంతాల అభివృద్ధి వేగవంతమవుతుందని, పరిశ్రమలను నెలకొల్పేందుకు వీలుంటుందని చెప్పారు. అలాగే వివేక్ కె.టంకా నేతృత్వంలోని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసింది. బృందంలో రాజ్యసభ సభ్యుడు వందన చవాన్, కనకమేడల రవీంద్రకుమార్, దర్శన సింగ్, విల్సన్, లోక్‌సభ సభ్యుడు వీణాదేవి, జస్బీర్‌సింగ్ గిల్, రఘురామ కృష్ణరాజు ఉన్నారు.

మగపులిని మట్టుబెట్టారు



పులి కళేబరాన్ని దహనం చేసిన ప్రదేశం

రెండు పులుల్లో ఒకటి అసహజ మరణం • మెడకు ఉచ్చు, తిన్న ఆహారంలో విషం • ప్రాథమికంగా గుర్తించిన అధికారులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మగపులిది అసహజ మరణమని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ డివిజన్ దరిగాం-సర్కెపల్లి మధ్య బూడిదమామిడి అడవుల్లో ఈ నెల 6న ఏడాదిన్నర ఆడపులి, ఈ నెల 8న ఐదేరాళ్ల మగపులి (ఎస్9) కళేబరాలను గుర్తించిన విషయం తెలిసిందే. అయితే ఆడపులి మరోపులితో పోరులో చనిపోగా, మగపులి విషంతో చనిపోయినట్టు అధికారులు గుర్తించారు. మంగళవారం ఎన్టీసీఏ (నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ) నియమించిన టీంతో కలిసి పీసీసీఎఫ్ ఆర్‌ఎం డొబ్రియల్, చీఫ్ వైల్డ్‌లైఫ్ ఇన్‌చార్జి ఎంసీ పర్గేన్, సీసీఎఫ్ శాంతారామ్, డీఎఫ్‌ఓ నీరజ్‌కుమార్, కాగజ్‌నగర్ ఎఫ్‌డీఓ వేణుబాబు, ఎఫ్ఆర్వో వేణుగోపాల్, పశువైద్యాధికారులు, ఎన్జీఓ, ఇతర సిబ్బందితో వివరాలు తీసుకున్నారు. అనంతరం ఎన్టీసీఏ నిబంధనల మేరకు అడవిలోనే పులి, పశుకళేబరాలను దహనం చేశారు.

పులిపై విష ప్రయోగం



ఒక పులి అంతర్గత పోరులో, మరో పులి విషం పెట్టడంతో చనిపోయినట్టు ప్రాథమికంగా అంచనాకు వస్తున్నాం. మగపులి మెడకు ఉచ్చు కూడా ఉంది. అది వదులుగా ఉంది. పులి ఉచ్చు పడితే తనంతట తాను తీసుకునే ప్రయత్నం చేస్తుంది. కనిపిస్తున్న ఆధారాలను బట్టి పులి వేటాడిన పశుకళేబరంలో ఎవరైనా విషం కలిపి ఉండొచ్చు. దానిని తిన్న పులి చనిపోయి ఉండొచ్చనిపిస్తోంది. నమూనాలు మూడు ల్యాబ్‌లకు పంపుతున్నాం. నివేదిక వస్తే స్పష్టత వస్తుంది. ఘటనపై కేసు నమోదు చేశాం. విచారణలో స్థానిక పోలీసు సాయంతో నేరస్తులను పట్టుకుంటాం. - ఆర్‌ఎం డొబ్రియల్

పులులెలా చనిపోతున్నాయి?

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కవ్వాల్ టైగర్ కారిడార్‌లో వరుస ఘటనలు అనేక అనుమానాలకు తావిస్తున్నాయి. మొదట రెండు పులుల ఆవాస ఆధిపత్య పోరులో ఒకటి చనిపోయిందని తేల్చారు. మరో పులి అదే తీరుగా పొట్లాటలో మృతి చెందిందని చెప్పే ప్రయత్నాలు చేశారు. కానీ ఒకేచోట రెండు మరణించడం, పశువుల కళేబరాలు ఉండడంతో ఆ దిశగా విచారణ మొదలైంది. 'తడోబా-అంధేరి', 'తిప్పేశ్వర్'కు పెన్‌గంగా, ప్రాణహిత పక్కనే ఉన్న కాగజ్‌నగర్ పులుల రాకపోకలకు ప్రధాన కారిడార్‌గా ఉంది. దరిగాం సమీపప్రాంతాల్లోనే ఎస్9 మగపులి, ఎస్6 అనే ఆడపులితో జతకట్టడంతో నాలుగు పిల్లలు జన్మించాయి. వాటి వయసు రెండేళ్లు దాటడంతో ఆవాసం వెతుక్కుంటున్నాయి. మరోవైపు ఎస్6 కోసం మరో మగపులి రావడం, అక్కడే ఎస్9 కూడా ఉండడంతో ఆధిపత్య పోరు మొదలైంది. ఇలా తల్లి, నాలుగు పిల్లలు, మగపులులతో అక్కడే సంచరిస్తున్నాయి. అడవిలో వన్యప్రాణుల లభ్యత లేక స్థానిక గిరిజన రైతుల పశువులే వాటికి ఆహారంగా మారాయి. రెండేళ్లుగా ఆరు పశువులను చంపగా, కొందరికే పరిహారం రాగా, మరికొందరికి అందలేదు.

పశువులపై దాడులతో ప్రతీకారమా...

పశువులను చంపేస్తున్న పులులను హతమార్చాలని ఎవరైనా కోపంతో ఈ ఘాతుకానికి పాల్పడ్డారా? అనే కోణంలో విచారణ మొదలైంది. గతంలో పులులకు ఉచ్చులు బిగిసి ఇబ్బంది పడిన ఘటనలు ఉన్నాయి. ఐదేళ్ల క్రితం చెన్నూరు డివిజన్‌లో అమర్చిన ఉచ్చుకు కే4 ఆడపులి చిక్కి నడుము భాగంలో ఉండిపోయింది. ఇప్పటికీ ఆ పులి జాడ లేదు. అదే డివిజన్ శివ్వారం, ఉట్నూరు డివిజన్‌లోనూ ఉచ్చులతో పులులకు ముప్పు జరిగాయి.

ఎస్6, ఆ పిల్లలు సురక్షితమేనా?

ఎస్6తోపాటు మరో మూడు పిల్లలు క్షేమంగా ఉన్నాయా? అనే అనుమానాలు వస్తున్నాయి. పులుల మరణానికి ముందు చివరగా దరిగాం పరిధిలోనే ఓ పశువును హతమార్చి భుజిస్తుండగా కెమెరాకు చిక్కాయి. ఆ తర్వాత వాటి జాడ లేదు. ఆవాసాల ఆధిపత్య పోరు, కొత్త పులి రాకతో ఘర్షణతో వేరే చోటుకు వెళ్లాయా? లేక విషం, ఉచ్చుల బారిన పడ్డాయా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. వీటి ఆచూకీకి 50 మంది యానిమల్ ట్రాకర్స్ వెతుకుతున్నారని, ఈ చుట్టుపక్కల యాభైదాకా కెమెరా ట్రాక్‌లను అమర్చి పర్యవేక్షిస్తున్నట్టు ఓ ఉన్నతాధికారి 'సాక్షి'కి తెలిపారు.

పులులకు గడ్డు కాలమే!

గత ఏడాది 178 పులుల మరణాలు

సాక్షి, న్యూఢిల్లీ: దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా గత ఏడాదిలో అధికంగా పులుల మరణాలు సంభవించినట్టు నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్టీసీఏ) తన తాజా నివేదికలో వెల్లడించింది. ఒక్క 2023లోనే ఏకంగా 178 పులులు మరణించాయని తెలిపింది. ఇందులో అధికంగా మహారాష్ట్రలో 45, మధ్యప్రదేశ్‌లో 40, ఉత్తరాఖండ్‌లో 20, తమిళనాడులో 15 పులులు మరణించినట్టు పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లో గత ఏడాది 2 పులులు మృత్యువాత పడగా, తెలంగాణలో మాత్రం ఎలాంటి మరణాలు సంభవించలేదు. ఇక ఏడాది తొలి పది రోజుల్లోనే మూడు పులులు మరణించినట్టు రికార్డులు చెబుతుండగా, అందులో రెండు మరణాలు తెలంగాణలోనే సంభవించాయి. మరోపులి ఉత్తర్‌ప్రదేశ్‌లో మరణించింది. అయితే పులుల మరణాల్లో 77శాతానికిపైగా సహజ మరణాలే ఉన్నాయని, ఇందులో 40శాతం పులి పిల్లలే అధికంగా ఉన్నాయని పర్యావరణ మంత్రిత్వ శాఖ చెబుతోంది.

ఫిట్‌నెస్‌పై పెరిగిన శ్రద్ధ

'ఫిట్‌రైజ్ 75'ముగింపులో అమిత్ గార్గ్



సాక్షి, హైదరాబాద్: దేశసేవలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ(ఎస్‌వీపీ ఎన్‌పీఏ) 75 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ఎన్‌పీఏ ఆధ్వర్యంలో 75 రోజులుగా నిర్వహిస్తున్న 'ఫిట్‌రైజ్ 75'కార్యక్రమం మంగళవారం ముగిసింది. జాతీయ పోలీస్ అకాడమీలో నిర్వహించిన ముగింపు వేడుకల్లో ఎన్‌పీఏ డైరెక్టర్ అమిత్‌గార్గ్ మాట్లాడుతూ 'ఫిట్‌రైజ్-75'తో ఫిట్‌నెస్‌పై మరింత శ్రద్ధ పెరిగిందన్నారు. ఎన్‌పీఏ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేంద్ర సాయుధ పోలీస్ బలగాలు, రాష్ట్ర పోలీస్ బలగాలకు సంబంధించిన 60 సంస్థలకు చెందిన 1,200 యూనిట్లలోని పోలీస్ సిబ్బంది, వారి కుటుంబసభ్యులతోపాటు సాధారణ ప్రజలు కొన్నిచోట్ల పాల్గొన్నట్టు తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఫిట్ ఇండియా కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ కార్యక్రమాన్ని ఎన్‌పీఏ నిర్వహించినట్టు తెలిపారు.

సీపీఎస్ పట్ల ఏపీ సీఎం జగన్ నిర్ణయం హర్షణీయం

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగులకు సీపీఎస్‌కు బదులుగా పాత పెన్షన్ పథకాన్ని అమలు చేసే విషయంలో ఏపీ సీఎం వైఎస్ జగన్ తీసుకున్న నిర్ణయం హర్షించదగిందని సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చీటి భూపతిరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీపీఎస్ అమల్లోకి వచ్చిన సెప్టెంబర్ 1, 2004 తర్వాత నియమితులైన ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలనే కేంద్రం ఉత్తర్వులకు అనుగుణంగా సీఎం మెమో జారీ చేశారన్నారు.

తెలంగాణను ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం: జూపల్లి



మంత్రులు జూపల్లి, పొన్నంలను సత్కరిస్తున్న దృశ్యం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణను అప్పుల ఊబి నుంచి తప్పించి ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. మంగళవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్‌లను సత్కరించింది. ఈ సందర్భంగా సభనుద్దేశించి జూపల్లి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. ఇప్పటివరకు మాటల్లో చెప్పిన బంగారు తెలంగాణను నిజమైన బంగారు తెలంగాణగా నిర్మించుకుందామని పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి నెల దాటకముందే బీఆర్ఎస్ నేతలు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, రూ.7 లక్షల కోట్ల అప్పులు బీఆర్ఎస్ పుణ్యమే అని ఎద్దేవాచేశారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజల ఆకాంక్షలు, అమరవీరుల ఆశయాలు నెరవేరలేదని, కాంగ్రెస్ పార్టీతోనే ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయని జూపల్లి చెప్పారు. కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి, తెలంగాణ జానపద కళాకారుల రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి సుంచు లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

జీఎంఆర్ స్కూల్ ఆఫ్ ఏవియేషన్‌లో ఇంటిగ్రేటెడ్ కోర్సులు

శంషాబాద్: ఎయిర్‌క్రాఫ్ట్ మరమ్మతుల నిర్వహణకు సంబంధించిన కోర్సులకు జీఎంఆర్ ఏవియేషన్ స్కూల్ శ్రీకారం చుట్టింది. ఇందుకోసం ఎంఆర్‌ఓ (మెయింటెనెన్స్ రిపేర్ ఓవర్‌హాలింగ్)లో ఆన్ జాబ్ శిక్షణతో కూడిన ఇంటిగ్రేటెడ్ కోర్సులకు ఏవియేషన్ స్కూల్ రూపకల్పన చేసిందని జీఎంఆర్ ఏరో టెక్నిక్ అధ్యక్షుడు అశోక్ గోపీనాథ్ వివరించారు. ఈ నెల 18న ప్రారంభం కానున్న స్కూల్‌లో 2024 -2025 విద్యా సంవత్సరానికి కోర్సులు ప్రారంభమవుతాయన్నారు. కోర్సుల వివరాలను ఆయన మీడియాకు వివరించారు. ఈఏఎస్ఏ (యూరోపియన్ యూనియన్ ఏవియేషన్ సేఫ్టీ ఏజెన్సీ), డీజీసీఏతో కలిసి నిర్వహించే ఈ కోర్సులో రెండేళ్ల అకడమిక్ ట్రెనింగ్‌తో పాటు మరో రెండేళ్లు జీఎంఆర్ ఏరో టెక్నిక్‌లో శిక్షణ ఉంటుందన్నారు. రెండో కోర్సుగా కంబైడ్ బీ1.1, బీ2 ఎయిర్‌క్రాఫ్ట్ మెయిన్‌టెనెన్స్ ఇంజనీరింగ్ లైసెన్సింగ్ ప్రోగ్రాం, ఎయిర్‌క్రాఫ్ట్ స్పెసిఫిక్ ట్రైనింగ్ కోర్సు, విమానాల తయారీ, ఎయిర్‌క్రాఫ్ట్ కాంపోజిట్, ఇతర అనుబంధ కోర్సులను ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. ఇంటర్ లేదా టెన్ ప్లస్ టూలో గణితం, భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం సబ్జెక్టులతో ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. అర్హులైన ఔత్సాహిక విద్యార్థులు దరఖాస్తు అనంతరం స్కూల్ నిర్వహించే ప్రవేశ పరీక్షలో 65 శాతం మార్కులతో అర్హత పొందాలన్నారు. ఆత్మనిర్భర్ భారత్ దార్శనికతకు అనుగుణంగా ఈ స్కూల్‌ను తీర్చిదిద్దినట్లు వివరించారు. కార్యక్రమంలో ఏవియేషన్ స్కూల్ హెడ్ అవినాశ్ తదితరులు పాల్గొన్నారు.

బార్ల నష్టాలను నివారించాలి

- మంత్రి జూపల్లికి బార్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ వినతి

బంజారాహిల్స్(హైదరాబాద్): బార్ అండ్ రెస్టారెంట్ల నష్టాల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బార్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్‌గౌడ్ నేతృత్వంలో యజమానులు మంత్రి జూపల్లి కృష్ణారావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాల్లో పర్మిట్ రూమ్‌లకు పెట్టిన నిబంధనలు సక్రమంగా అమలవడంలేదని, దీని వల్ల బార్ల ఆదాయం పడిపోతోందని తెలిపారు. పక్క పక్కనే బార్లు ఉండటం వల్ల తీవ్ర నష్టం జరుగుతోందని, వాటి మధ్య అరకిలోమీటర్ దూరం ఉండేవిధంగా చూడాలని కోరారు. లిక్కర్‌పై పెంచిన రేటును సెస్ రూపంలో తీసుకుంటున్నారని, దాన్ని తీసివేసి బిల్లు రూపంలో వేయాలని కోరారు. బెల్టుషాపులపై చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలోనే అధికారులతో సమావేశమై చర్యలు తీసుకుంటామని మంత్రి వారికి హామీ ఇచ్చారు.

గ్లాండ్ కెమికల్స్‌లో ఐటీ సోదాలు

సాక్షి, హైదరాబాద్: పన్ను ఎగవేత ఆరోపణలపై హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లోని ఫార్మాస్యూటికల్ సంస్థ గ్లాండ్ కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయాల్లో ఆదాయపు పన్ను శాఖ దర్యాప్తు విభాగం అధికారులు మంగళవారం సోదాలు నిర్వహించారు. జూబ్లీహిల్స్‌లోని సంస్థ కార్యాలయం, డైరెక్టర్ల నివాసాలు, పన్ను ఎగవేతకు పాల్పడినట్లు అనుమానిస్తున్న తయారీ కేంద్రాల్లోనూ ఈ సోదాలు కొనసాగాయి. కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్‌గా బీఎస్ మల్లేశ్వరరావు, మరో ఐదుగురు డైరెక్టర్లకు సంబంధించి ఆదాయపు పన్ను శాఖ దర్యాప్తు విభాగం సోదాలు నిర్వహించింది. ఏకకాలంలో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని రాయదుర్గం, మొయినాబాద్, కోకాపేటలోని ఈ సోదాలు కొనసాగినట్టు తెలిసింది. సంస్థ బ్యాంక్ నివేదికలు, ఆడిట్ రికార్డులు, ఇతర కీలక పత్రాలను అధికారులు పరిశీలించారు. అనుమానాస్పద లావాదేవీలపై ఆరా తీశారు.

హైదరాబాద్ నుంచి ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: సంక్రాంతి ప్రయాణాల రద్దీ దృష్ట్యా హైదరాబాద్-నర్సాపూర్ మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్.రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్-నర్సాపూర్ (07058/07059) ప్రత్యేక రైలు ఈ నెల 15వ తేదీ రాత్రి 11.10 గంటలకు బయల్దేరి మర్నాడు ఉదయం 8.35 గంటలకు నర్సాపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 16వ తేదీ సాయంత్రం 6 గంటలకు నర్సాపూర్ నుంచి బయల్దేరి మర్నాడు ఉదయం 4.50 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది.

నేటినుంచి జాతీయ చేనేత ప్రదర్శన

సాక్షి, హైదరాబాద్: కేంద్ర చేనేత డెవలప్‌మెంట్ కమిషన్ ఆధ్వర్యంలో 'జాతీయ చేనేత ప్రదర్శన-2024' ఈ నెల 10 నుంచి 23వ తేదీ వరకు హైదరాబాద్ పీపుల్స్ ప్లాజాలో జరగనుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చేనేత ఉత్పత్తుల మార్కెటింగ్ పెంచడం లక్ష్యంగా ఈ ప్రదర్శన జరుగుతుంది. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాలకు చెందిన 140 అపెక్స్ చేనేత, ప్రాథమిక చేనేత సహకార సంఘాలు, మ్యాక్స్ సొసైటీలు తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి ధర్మవరం, ఉప్పాడ, పెద్దాపురం సిల్క్ షర్టింగ్, వెంకటగిరి, చీరాల, మంగళగిరి చీరలు, డ్రెస్ మెటీరియల్స్, పొందూరు కాటన్, సిల్క్ షర్టింగ్స్, కాటన్ షర్టింగ్స్, బందరు, కలంకారీ చీరలు, ఫ్యాబ్రిక్, కాళహస్తి పెన్ కలంకారీ చీరలు ప్రదర్శిస్తారు. తెలంగాణ నుంచి పోచంపల్లి, గద్వాల్, నారాయణపేట పట్టు చీరలు, పోచంపల్లి, కొయ్యలగూడెం టై అండ్ డై దుప్పట్లు, వరంగల్ డ్యూరీస్ (రగ్గులు), కరీంనగర్, హుజురాబాద్ దుప్పట్లు, టవల్స్ కూడా ఉంటాయి. తమిళనాడు, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ బిహార్, జమ్ము కశ్మీర్ రాష్ట్రాల ఉత్పత్తులను అందుబాటులో ఉంచుతారు.

క్లుప్తంగా...

ఫ్రాన్స్ ప్రధానిగా గాబ్రియెల్ అట్టల్



పారిస్: ఫ్రాన్స్ ప్రధాన మంత్రిగా అత్యంత పిన్న వయస్కుడైన 34 ఏళ్ల గాబ్రియెల్ అట్టల్ నియమితులయ్యారు. ప్రతిపక్షాల నుంచి తీవ్ర రాజకీయ ఒత్తిళ్లు ఎదురవుతున్న నేపథ్యంలో అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ మంత్రివర్గ ప్రక్షాళన చేపట్టారు. ఈ క్రమంలో ప్రస్తుత ప్రధాని ఎలిజబెత్ బోర్న్ సోమవారం రాజీనామా చేశారు. ఆమె స్థానంలో అట్టల్‌ను నియమిస్తున్నట్లు మంగళవారం మాక్రాన్ ప్రకటించారు. మంత్రి వర్గంలో కొందరు కీలక మంత్రులు మాత్రం యథాతథంగా కొనసాగే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. ప్రభుత్వ ం ప్రతినిధిగా, విద్యాశాఖ మంత్రిగా అంచెలంచెలుగా ఎదుగుతూ గాబ్రియెల్ అట్టల్ ప్రధాని పదవి చేపట్టడం ఆసక్తికరంగా మారింది. గే అని ప్రకటించుకున్న ఫ్రాన్స్ మొట్టమొదటి ప్రధాని అట్టల్ కావడం గమనార్హం. బోర్న్ మంత్రి వర్గంలో అట్టల్ అత్యధిక ప్రజాదరణ కలిగిన మంత్రిగా ఒపీనియన్ పోల్స్‌లో వెల్లడైంది.

భూటాన్ ఎన్నికల్లో పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ విజయం

థింపు: భూటాన్ పార్లమెంట్ ఎన్నికల్లో పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ(పీడీపీ) మరోసారి విజయం సాధించింది. మంగళవారం ఓట్ల లెక్కింపు చేపట్టారు. నేషనల్ అసెంబ్లీలో మొత్తం 47 స్థానాలకు గాను పీడీపీ 30 స్థానాలు గెలుచుకుంది. భూటాన్ టెండ్రెల్ పార్టీ కేవలం 17 సీట్లకే పరిమితమైంది. తుది ఫలితాలపై ఎన్నికల సంఘం బుధవారం ప్రకటన చేయనుంది. భూటాన్ 2008లో రాచరికం అంతమై, పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రారంభమైంది. అప్పటి నుంచి ఇవి నాలుగో సార్వత్రిక ఎన్నికలు. పీడీపీ విజయం సాధించడంతో ఆ పార్టీ అధినేత, మాజీ ప్రధానమంత్రి త్సెరింగ్ టాబ్‌గే మరోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. భూటాన్ దేశం చైనా, ఇండియా మధ్యలో ఉంటుంది. ఇక్కడ దాదాపు 8 లక్షల జనాభా ఉంది. కొన్నేళ్లుగా ఆర్థిక సంక్షోభంతో సతమతమవుతోంది. గత ఐదేళ్లుగా వృద్ధి రేటు కేవలం 1.7 శాతంగా ఉంది.

ల్యాండ్ ఫర్ జాబ్స్ కుంభకోణం.. లాలూ కుటుంబీకులపై చార్జిషీట్

న్యూఢిల్లీ: ల్యాండ్ ఫర్ జాబ్స్ కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలపై లాలూ భార్య, మాజీ సీఎం రబ్రీ దేవి, కుమార్తె మిసా భారతి తదితరులపై ఈడీ చార్జిషీటు దాఖలు చేసింది. యూపీఏ హయాంలో లాలూ ప్రసాద్ యాదవ్ రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో ఈ కుంభకోణం జరిగినట్లుగా ఈడీ ఆరోపిస్తోంది. ఇప్పటికే ఈ కేసులో సీబీఐ చార్జిషీటు వేసింది. తాజాగా ఈడీ వేసిన చార్జిషీటులో ఆర్‌జేడీ చీఫ్ లాలూ యాదవ్ మరో కుమార్తె హేమా యాదవ్(40), లాలూ కుటుంబ సన్నిహితుడు అమిత్ కట్యాల్, రైల్వే ఉద్యోగి హృదయానంద చౌదరితోపాటు ఏకే ఇన్ఫోసిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఏబీ ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ రెండు సంస్థలకు డైరెక్టర్‌గా ఉన్న షరీకుల్ బారి పేర్లు కూడా ఉన్నాయి. ఈ కేసు ఢిల్లీలోని ప్రత్యేక మనీ లాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్‌ఏ) కోర్టు ముందుకు ఈ నెల 16వ తేదీన రానుందని అధికార వర్గాలు తెలిపాయి.

శివసేన ఉద్ధవ్ వర్గం ఎమ్మెల్యేపై ఈడీ దాడులు

ముంబై: శివసేన ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి చెందిన ఎమ్మెల్యే రవీంద్ర వైకర్, ఆయనకు సంబంధించిన సంస్థలపై మంగళవారం ఈడీ అధికారులు దాడులు జరిపారు. ముంబైలోని జోగేశ్వరి ప్రాంతంలో లగ్జరీ హోటల్ నిర్మాణంలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై నమోదైన మనీ లాండరింగ్ కేసు దర్యాప్తు భాగంగా ఏడు చోట్ల సోదాలు జరిపినట్లు అధికారులు తెలిపారు. తోట కోసం కేటాయించిన భూమిలో ఫైవ్ స్టార్ హోటల్ నిర్మాణం కోసం వైకర్ అక్రమంగా అనుమతులు పొందారంటూ ముంబై పోలీస్ ఆర్థిక నేరాల విభాగం నమోదు చేసిన కేసు ఆధారంగా ఈడీ మనీ లాండరింగ్ కేసు పెట్టింది.

జూలై 7న నీట్ పీజీ పరీక్ష

న్యూఢిల్లీ: నేషనల్ ఎలిజిబిలిటీ ఎంట్రన్స్ టెస్ట్–పీజీ పరీక్షను ఈ ఏడాది జూలై 7వ తేదీకి రీషెడ్యూల్ చేసినట్లు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ మంగళవారం తెలిపింది. ఈ పరీక్షకు కటాఫ్ అర్హత తేదీ ఈ ఏడాది ఆగస్ట్ 15గా పేర్కొంది. నీట్ పీజీ పరీక్షను మార్చి 3వ తేదీన నిర్వహించనున్నట్లు గతంలో ప్రకటించిన విషయం గుర్తు చేసింది. ఈ పరీక్షను సవరించిన షెడ్యూల్‌ను అనుసరించి జూలై 7వ తేదీన నిర్వహిస్తామని వివరించింది. ఎండీ/ఎంఎస్, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ఒకే ఒక్క అర్హత పరీక్ష నీట్ పీజీ ఎలిజిబిలిటీ కం ర్యాంకింగ్ పరీక్ష.

షిండే, స్పీకర్ భేటీ అనైతికం

సుప్రీంకోర్టులో శివసేన (ఉద్ధవ్) పిటిషన్

న్యూఢిల్లీ: మహారాష్ట్రలో శివసేన పార్టీ ఎమ్మెల్యేల అనర్హతపై స్పీకర్ తుది నిర్ణయం తీసుకోవడానికి సుప్రీంకోర్టు విధించిన గడువు మరో మూడు రోజుల్లో ముగియనుంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నర్వేకర్ సమావేశమై, చర్చించుకోవడం పట్ల శివసేన(ఉద్ధవ్ వర్గం) అధినేత ఉద్ధవ్ ఠాక్రే తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నర్వేకర్ ఈ నెల 7న షిండేను ఆయన అధికార నివాసంలో కలిసినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. శివసేన పార్టీ ఎమ్మెల్యేలు షిండే, ఉద్ధవ్ వర్గంగా విడిపోయిన సంగతి తెలిసిందే. అవతలి వర్గం ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ రెండు వర్గాలు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నాయి.

వామ్మో 2023!

చరిత్రలోనే అత్యంత వేడి ఏడాది | ఏకంగా 1.48 డిగ్రీలు పెరిగిన సగటు ఉష్ణోగ్రత



- చివరి ఆర్నెల్లలోనైతే ప్రతి రోజూ రికార్డు స్థాయి ఎండలే
- సముద్ర ఉష్ణోగ్రతల్లో కూడా ఏకంగా 0.44 డిగ్రీల పెరుగుదల
- ప్రపంచవ్యాప్తంగా అనూహ్యంగా పెరుగుతున్న సముద్ర మట్టాలు
- వెల్లడించిన ఈయూ వాతావరణ సంస్థ నివేదిక

భూతాపం విషయంలో 2023 కనీవినీ ఎరగని రికార్డు సృష్టించింది. అత్యంత వేడిమి డిసెంబర్ నెల ముగియక ముందే 2023 రికార్డులకెక్కడం తెలిసిందే. అయితే చరిత్రలో ఇప్పటిదాకా అత్యధికంగా 1.48 డిగ్రీల సగటు ఉష్ణోగ్రత పెరుగుదల నమోదైన ఏడాదిగా 2023 నిలిచింది! 2016 నాటి రికార్డు కంటే ఇది ఏకంగా 0.17 డిగ్రీలు అధికం! అదే 1991–2020 మధ్య 20 ఏళ్ల సగటుతో పోలిస్తే ఏకంగా 0.6 డిగ్రీలు ఎక్కువ!! గతేడాదికి సంబంధించిన ఉష్ణోగ్రతల గణాంకాలను క్షుణ్నంగా విశ్లేషించిన మీదట యూరోపియన్ యూనియన్ వాతావరణ పర్యవేక్షణ సంస్థ కోపర్నికస్ మంగళవారం విడుదల చేసిన నివేదిక ఈ మేరకు పేర్కొంది. అంతేకాదు, 2023 రెండో అర్ధ భాగంలో దాదాపుగా ప్రతి రోజూ ఎండ తీవ్రతలో కొత్త రికార్డులు నెలకొల్పినట్టు తేల్చింది! ఇది నిజంగా భయానక పరిణామమేనని సైంటిస్టులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు...

– సాక్షి, నేషనల్ డెస్క్

2023 నవంబర్ 17. భూ ఉష్ణోగ్రతలో ఏకంగా 2.06 డిగ్రీల పెరుగుదల నమోదైన తేదీ! మానవ చరిత్రలో ఉష్ణోగ్రతల పెరుగుదలను రికార్డు చేయడం మొదలు పెట్టినప్పటి నుంచీ అత్యధిక పెరుగుదల అదే! అలా మానవాళి చరిత్రలో ఓ దుర్దినంగా నవంబర్ 17న నిలిచిపోయింది. తర్వాత అదే నెలలో మరోసారి ఉష్ణోగ్రత పెరుగుదల 2 డిగ్రీలను దాటేసింది. దాంతో పర్యావరణవేత్తల్లో గగ్గోలు మొదలైంది. కానీ 2023 రెండో భాగంలో, అంటే జూలై నుంచి డిసెంబర్ దాకా ప్రతి రోజూ ఎండలు కనీవినీ ఎరగని రీతిలో ప్రపంచాన్ని అల్లాడించాయని కోపర్నికస్ తాజా నివేదిక తేల్చింది. పైగా 2023లో 1.48 డిగ్రీల సగటు ఉష్ణోగ్రత పెరుగుదల నమోదవడమూ భయపెట్టే పరిణామమే. భూ ఉష్ణోగ్రతలో పెరుగుదలను పారిశ్రామికీకరణనాటి తొలినాళ్లతో, అంటే 1850–1900 సంవత్సరాల మధ్య కాలపు సగటుతో పోల్చి చెబుతారు. అప్పటితో పోలిస్తే దాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ 1.5 డిగ్రీల కంటే దిగువకు కట్టడి చేయాలన్నది 2015 నాటి పారిస్ ఒప్పందంలో ప్రపంచ దేశాలన్నీ సంయుక్తంగా చేసుకున్న తీర్మానం. కానీ 2023లో సగటు ఉష్ణోగ్రత పెరుగుదల దాదాపుగా ఆ లక్ష్మణరేఖను తాకింది. 1850తో పోలిస్తే గతేడాది ప్రతి రోజూ ఉష్ణోగ్రతలో 1 డిగ్రీ కంటే ఎక్కువ పెరుగుదల నమోదైంది! 2015లో తొలిసారిగా ఒక్క రోజు ఇలా 1 డిగ్రీ పెరుగుదల నమోదైతేనే ప్రపంచమంతా విస్మయపడింది. అది కాస్తా కేవలం ఏడేళ్లకే రోజువారీ పరిణామంగా మారిపోయింది. పైగా సగటు పెరుగుదలే దాదాపుగా 1.5 డిగ్రీలను తాకేసింది. గ్లోబల్ వార్మింగ్ అడ్డూ అదుపూ లేకుండా పెరిగిపోతోందనేందుకు ఇంతకు మించిన తార్కాణం అవసరం లేదని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. ఈ లెక్కన 2024లో ఉష్ణోగ్రత సరికొత్త రికార్డులు సృష్టించి భూగోళాన్ని మరింత వినాశనం దిశగా నెట్టడం ఖాయమని తాజా నివేదికలో కోపర్నికస్ కూడా అంచనా వేయడం మరింత ఆందోళన కలిగిస్తోంది. జూన్‌లోపే సగటు భూతాపోన్నతి 1.5 డిగ్రీలను దాటేస్తే ఆశ్చర్యం లేదని అది అభిప్రాయపడింది. అదే జరిగితే భూమిపై కీలక పర్యావరణ వ్యవస్థల్లో చాలావరకు అంతటి తాపాన్ని తట్టుకోలేవు. అప్పుడిక ప్రపంచంలో ఒకవైపు తీవ్ర కరువులు, కార్చిచ్చులు, మరోవైపు భయంకరమైన తుపాన్లు నిత్య సమస్యలుగా మారిపోతాయి. గతేడాది అమెరికా, కెనడా, హవాయి, దక్షిణ యూరోప్‌ల్లో నిత్యం కార్చిచ్చులు చెలరేగడం, పలు దేశాలు కనీవినీ ఎరగని వరదలతో, గడ్డకట్టించే చలి పరిస్థితులతో అతలాకుతలం కావడం తెలిసిందే.

వాతావరణ మార్పులు, ఎల్ నినో...

2023 ఇంతగా మండిపోవడానికి వాతావరణ మార్పులే ప్రధాన కారణమని కోపర్నికస్ నివేదిక స్పష్టం చేసింది. దానికి తోడు గతేడాది జూలైకల్లా ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో నెలకొన్న ఎల్ నినో (కరువు) పరిస్థితులు పరిస్థితిని మరింత దిగజార్చినట్టు వివరించింది. ఫలితంగా పసిఫిక్ మొదలుకుని ప్రతి మహాసముద్రమూ ఎప్పుడూ లేనంతగా వేడెక్కినట్టు పేర్కొంది. 1991–2020 సగటుతో పోలిస్తే 2023లో సముద్రాల సగటు ఉష్ణోగ్రత పెరుగుదల ఏకంగా 0.44 డిగ్రీలుగా నమోదైంది! దాంతో మంచు ప్రాంతాలైన ఆర్కిటిక్, అంటార్కిటికాలపై దీని ప్రభావం విపరీతంగా పడటం మొదలైంది. అక్కడి మంచు ఎన్నడూ లేనంతగా కొన్నాళ్లుగా శరవేగంగా కరిగిపోతోంది. ఈ దెబ్బకు సముద్ర మట్టాలు ప్రమాదకరంగా పెరిగేలా కనిపిస్తున్నాయి. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా తీర ప్రాంత మహా నగరాలు చాలావరకు నీట మునుగుతాయి. అదే జరిగితే ప్రపంచంలో కనీసం మూడో వంతు జనాభా నిర్వాసితులుగా మారతారని అంచనా. ఊహించుకోవడానికే భయం కలిగే ఇలాంటి పరిణామాలెన్నో అతి త్వరలో జరిగేలా కనిపిస్తున్నాయని సైంటిస్టులు అభిప్రాయపడుతున్నారు.

లక్షద్వీప్‌లో ఎయిర్‌పోర్టు

- వాణిజ్య సర్వీసులను సైతం నడిపేందుకు అవకాశం
- పర్యాటక రంగాన్ని ప్రోత్సహించనున్న కేంద్రం

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల లక్షద్వీప్‌లో చేపట్టిన పర్యటన.. దేశీయ పర్యాటకుల్లో ఆ దీవుల సముదాయంపై ఒక్కసారిగా ఆసక్తిని పెంచింది. ఈ నేపథ్యంలో కేంద్ర పాలిత ప్రాంతం లక్షద్వీప్‌లో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో ప్రభుత్వం విమానాశ్రయాన్ని ఏర్పాటు చేయాలని తలపోస్తోంది. యుద్ధ విమానాలతోపాటు వాణిజ్య విమాన సర్వీసులను సైతం నడిపేందుకు వీలైన విమానాశ్రయాన్ని లక్షద్వీప్‌లోని మినికాయ్ దీవిలో నిర్మిస్తే బాగుంటుందని యోచిస్తోంది. ఇప్పటి వరకు మినికాయ్ దీవిలో విమానాశ్రయాన్ని ఏర్పాటు చేయాలనే రక్షణ శాఖ ప్రతిపాదన మాత్రమే కేంద్రం వద్ద ఉంది. ఇటీవలి పరిణామాల నేపథ్యంలో సైనిక, పౌర అవసరాలకు సైతం సరిపోయేలా ఎయిర్‌పోర్టును నిర్మించే సరికొత్త ప్రతిపాదన కేంద్రం పరిశీలిస్తోందని అధికారవర్గాలు తెలిపాయి. అరేబియా సముద్రం, హిందూ మహాసముద్రాలకు బేస్‌గా, పెరుగుతున్న పైరసీ, సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు చెక్ పెట్టేందుకు వ్యూహాత్మకంగా చాలా కీలకమైందిగా ఇక్కడి ఎయిర్‌పోర్టు మారేందుకు అవకాశాలున్నాయని ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి. అరేబియా సముద్రంపై నిఘాను మరింత విస్తృతం చేసుకునేందుకు మినికాయ్ వద్ద ఎయిర్‌పోర్టు వైమానిక దళానికి ఉపయోగపడనుంది. ప్రస్తుతం లక్షద్వీప్ మొత్తంలో ఒకే ఒక్క విమానాశ్రయం అగట్టిలో ఉంది. ఇక్కడ చిన్న విమానాలు మాత్రమే దిగేందుకు అవకాశం ఉంది. మినికాయ్ దీవిలో విమానాశ్రయం అందుబాటులోకి వస్తే పర్యాటక రంగం అభివృద్ధి చెందనుంది. మరోవైపు, భారత్‌తో వివాదం తమకు భారీగా నష్టం చేసేలా కన్పిస్తున్న నేపథ్యంలో మాల్దీవులకు చెందిన పర్యాటక సంస్థలు రంగంలోకి దిగాయి. ఇటీవల సస్పెన్షన్‌కు గురైన తమ మంత్రులు ప్రధాని మోదీపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్టు పేర్కొన్నాయి.

కుక్క మాంసం వినియోగంపై దక్షిణ కొరియా నిషేధం

సియోల్: శతాబ్దాలుగా ఆచారంగా వస్తున్న కుక్క మాంసం వినియోగాన్ని చట్ట విరుద్ధమని ప్రకటించే చారిత్రక బిల్లును దక్షిణ కొరియా పార్లమెంట్ ఆమోదించింది. మంగళవారం ఈ బిల్లుకు నేషనల్ అసెంబ్లీ 208–0 ఓట్లతో ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. మంత్రి మండలి ఆమోదం, అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ సంతకంతో బిల్లు చట్ట రూపం దాల్చనుంది. యూన్ ప్రభుత్వం కుక్క మాంసంపై నిషేధానికి అనుకూలంగా ఉండటంతో బిల్లు చట్ట రూపం దాల్చడం లాంఛనప్రాయం కానుంది. శునక మాంసం వినియోగం, వాటిని మాంసం కోసం పెంచడం, విక్రయం, వధించడం 2027 నుంచి నేరం కానుంది. ఉల్లంఘిస్తే మూడేళ్ల వరకు జైలు శిక్ష పడుతుంది. కుక్క మాంసం వినియోగంపై నిషేధానికి గతంలో పలుమార్లు ప్రభుత్వాలు ప్రయత్నించినప్పటికీ రైతులు, కుక్క మాంసం పరిశ్రమదారుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. తాము ఇక ఎంతమాత్రం కుక్క మాంసం భుజించబోమంటూ ఇటీవలి సర్వేల్లో మెజారిటీ దక్షిణ కొరియన్లు అభిప్రాయం వ్యక్తం చేయడంతో ప్రభుత్వం అందుకు అనుగుణంగా చట్టం తెచ్చింది.

ప్రఖ్యాత హిందుస్తానీ గాయకుడు ఉస్తాద్ రషీద్ ఖాన్ కన్నుమూత



కోల్‌కతా: ప్రముఖ హిందుస్తానీ గాయకుడు ఉస్తాద్ రషీద్ ఖాన్ (55)మంగళవారం కోల్‌కతాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కన్నుమూశారు. 2019 నుంచి ప్రొస్టేట్ క్యాన్సర్‌తో ఆయన బాధపడుతున్నారు. గత నెలలో గుండెపోటుకు గురైన ఖాన్ అప్పటి నుంచి ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించి ఖాన్ మంగళవారం మధ్యాహ్నం 3.45కు తుదిశ్వాస విడిచారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. రాంపూర్–సహస్వాన్ ఘరానా సంప్రదాయానికి చెందిన ఖాన్ ఘరానా వ్యవస్థాపకుడు ఇనాయత్ హుస్సేన్ ఖాన్ ముని మనవడు. యూపీలోని బదౌన్‌కు చెందిన ఖాన్ కుటుంబం ఆయనకు పదేళ్ల వయస్సులో 1980లో కోల్‌కతాకు వలస వచ్చింది. సీఎం మమతా బెనర్జీ ఆస్పత్రికి వెళ్లి ఖాన్ కుటుంబసభ్యులను ఓదార్చారు. రషీద్ ఖాన్ మృతి పట్ల రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ సంతాపం ప్రకటించారు. ఇలా ఉండగా, ఖాన్ 11 ఏళ్ల వయస్సులోనే 1994లో మొట్టమొదటి కచేరీలో పాల్గొని, సంగీత కళాకారుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. రాంపూర్ సహస్వాన్ సంప్రదాయ గానానికి చిట్ట చివరి దిగ్గజంగా ఆయన పేరు తెచ్చుకున్నారు. 'విలంబిత్ ఖయాల్' శైలిలో మూడు దశాబ్దాలుగా కోట్లాది మంది సంగీత ప్రియులను ఆయన గాత్రం అలరిస్తోంది. మై నేమ్ ఈజ్ ఖాన్, జబ్ వుయ్ మెట్, ఇసాక్, మంటో, మౌసమ్ తదితర చిత్రాల్లో నేపథ్య గాయకుడిగా ఉన్నారు. ఆయన్ను కేంద్రం పద్మ శ్రీ, పద్మ భూషణ్ అవార్డులతో గౌరవించింది.

మాతృత్వానికే మచ్చ తెచ్చిన తల్లి

- నాలుగేళ్ల కుమారుడిని కిరాతకంగా హత్య చేసిన స్టార్టప్ కంపెనీ సీఈఓ
- గోవాలో చంపి, కొడుకు శవాన్ని బ్యాగులో కుక్కి ట్యాక్సీలో కర్ణాటకకు తరలింపు
- అరెస్టు చేసిన పోలీసులు
- ఆరు రోజుల కస్టడీకి నిందితురాలు



సాక్షి బళ్లారి: మాతృత్వానికే మచ్చ తెచ్చిన కన్నతల్లి ఘాతుకం ఇది. కృత్రిమ మేధ స్టార్టప్ కంపెనీ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) సుచనా సేథ్ తన నాలుగేళ్ల కుమారుడిని గోవాలో స్వయంగా హత్య చేసింది. కిరాతకంగా పసిబిడ్డ ప్రాణాలను బలితీసుకుంది. మృతదేహాన్ని మాయం చేసేందుకు ప్రయత్నించి చివరకు పోలీసులకు దొరికిపోయింది. కన్నబిడ్డ శవాన్ని బ్యాగ్‌లో కుక్కి, ట్యాక్సీలో పొరుగు రాష్ట్రం కర్ణాటకకు చేరుకుంది. సోమవారం రాత్రి చిత్రదుర్గలో ఆమెను అరెస్టు చేసినట్లు గోవా పోలీసులు తెలిపారు. మంగళవారం గోవాకు తరలించి, న్యాయస్థానంలో హాజరుపర్చారు. నిందితురాలు సుచనా సేథ్‌ను తదుపరి విచారణ నిమిత్తం ఆరు రోజుల పాటు పోలీసు కస్టడీకి అప్పగిస్తూ గోవా కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆమె దురాగతానికి ఒడిగట్టడానికి కారణం ఏమిటన్న దానిపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

భర్త నుంచి విడిపోయి..

39 ఏళ్ల సుచనా సేథ్ మైండ్‌ఫుల్ ఏఐ ల్యాబ్ అనే స్టార్టప్ కంపెనీ సీఈఓగా పనిచేస్తోంది. 2021లో 'టాప్ 100 బ్రిలియంట్ ఉమెన్ ఇన్ ఏఐ ఎథిక్స్'గా గుర్తింపు పొందింది. ఈ నెల 6న తన కుమారుడితో కలిసి ఉత్తర గోవాలోని కాండోలిమ్‌లో సర్వీసు అపార్టుమెంట్‌లో అద్దెకు దిగింది. రెండు రోజులపాటు అక్కడే గడిపింది. ఓ పని కోసం తాను బెంగళూరు వెళ్లాల్సి ఉందని, ట్యాక్సీ ఏర్పాటు చేయాలని ఈ నెల 8న అపార్ట్‌మెంట్ సిబ్బందిని కోరింది. ట్యాక్సీని అద్దెకు తీసుకోవడం కంటే విమానంలో వెళ్లడమే చౌక అని వారు సూచించగా, అందుకు నిరాకరించింది. ట్యాక్సీ కావాలని పట్టుబట్టడంతో వారు ఆ మేరకు వాహనం ఏర్పాటు చేశారు. 8వ తేదీన తెల్లవారు జామునే ట్యాక్సీలో బెంగళూరుకు పెద్ద బ్యాగుతో బయలుదేరింది. అపార్ట్‌మెంట్‌లో ఆమె గదిని శుభ్రం చేయడానికి వెళ్లిన సిబ్బందికి అక్కడ టవల్‌పై రక్తపు మరకలు కనిపించాయి. అంతేకాకుండా అపార్ట్‌మెంట్ నుంచి వెళ్లిపోయినప్పుడు ఆమె వెంట కొడుకు లేడని గుర్తించారు. అనుమానంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు రంగంలోకి దిగి, సుచనా సేథ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఆ రక్తపు మరకలు తన పీరియడ్స్‌కు సంబంధించినవని, తన బిడ్డ ఉత్తర గోవాలోని మార్‌గావ్‌లో తన స్నేహితురాలి వద్ద ఉన్నాడని బదులిచ్చింది. అంతేకాకుండా సదరు మిత్రురాలి చిరునామా కూడా చెప్పింది. పోలీసులు వెంటనే అక్కడికి వెళ్లి విచారించగా, అది నకిలీ చిరునామా అని తేలింది. దాంతో ట్యాక్సీ డ్రైవర్‌ను ఫోన్‌లో సంప్రదించారు. కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లాలో ఉన్నట్లు అతడు చెప్పగా, స్థానిక పోలీసులను అప్రమత్తం చేశారు. పోలీసులు సుచనా సేథ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్దనున్న బ్యాగ్‌ను తెరిచి చూడగా బాలుడి మృతదేహం కనిపించింది. గోవా పోలీసులు చిత్రదుర్గ చేరుకొని, నిందితురాలిని అదుపులోకి తీసుకున్నారు. గోవాకు తరలించి, ఐపీసీ సెక్షన్ 302(హత్య), సెక్షన్ 201(సాక్ష్యాధారాలను ధ్వంసం చేయడం)తోపాటు గోవా చిల్డ్రన్స్ చట్టం కింద ఆమెపై కేసులు నమోదు చేశారు. భర్త నుంచి విడిపోయానని, విడాకుల కోసం ప్రయత్నిస్తున్నానని నిందితురాలు పేర్కొన్నట్లు పోలీసులు వెల్లడించారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన సుచనా సేథ్ 2010లో కేరళకు చెందిన వ్యక్తిని పెళ్లి చేసుకుంది. తొమ్మిదేళ్ల తర్వాత కుమారుడు జన్మించాడు. ఆ తర్వాత భార్యాభర్తల మధ్య గొడవలు మొదలయ్యాయి. 2020లో దంపతులిద్దరు కోర్టు నుంచి అనుమతి తీసుకొని దూరంగా ఉంటున్నారు. ప్రతి ఆదివారం కుమారునితో కాసేపు తండ్రి గడిపేవాడు. ఇది ఏమాత్రం ఇష్టంలేని కసాయి తల్లి.. కొడుకును చంపేయాలని, తద్వారా భర్తపై ప్రతీకారం తీర్చుకోవాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఆమె భర్త ప్రస్తుతం ఇండోనేషియాలో ఉన్నాడు. భార్య చేతిలో కుమారుడి మరణం గురించి అతడికి పోలీసులు సమాచారం అందించారు. ఇదిలా ఉండగా, బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం చిత్రదుర్గ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక కోసం పోలీసులు ఎదురు చూస్తున్నారు.

819కి జేఎన్.1 వేరియంట్ కేసులు

న్యూఢిల్లీ: దేశంలో కోవిడ్–19 సబ్ వేరియంట్ జేఎన్.1 కేసుల్లో పెరుగుదల నమోదవుతోంది. మొత్తం 12 రాష్ట్రాల్లో కలిపి 819 జేఎన్.1 వేరియంట్ కేసులు నమోదైనట్లు మంగళవారం కేంద్రం తెలిపింది. ఇందులో అత్యధికంగా మహారాష్ట్రలో 250 కేసులు, ఆ తర్వాత కర్ణాటకలో 199, కేరళలో 148 కేసులు వెలుగులోకి వచ్చినట్లు వివరించింది. అదే సమయంలో కొత్తగా 475 కోవిడ్ కేసులు నమోదైనట్లు పేర్కొంది. యాక్టివ్ కేసుల సంఖ్య 3,919కి చేరాయని తెలిపింది. 24 గంటల వ్యవధిలో కర్ణాటకలో ముగ్గురు, ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు, అస్సాంలో ఒక కోవిడ్ బాధితుడు చనిపోయినట్లు పేర్కొంది.

కర్ణాటక గవర్నర్‌కు కరోనా

బొమ్మనహళ్లి: కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్‌కు కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణయింది. ఆయన కోలుకునే వరకు అన్ని కార్యక్రమాలను రద్దు చేసినట్లు రాజ్‌భవన్ మంగళవారం తెలిపింది. ఆయన రాజ్‌భవన్‌లోనే క్వారంటైన్‌లో ఉన్నారని, చికిత్స అవసరం లేదని వైద్యులు సూచించినట్లు తెలిపారు.

అయోధ్య ఉత్సవాలు గిమ్మిక్కు: మమత

జోయ్‌నగర్: లోక్‌సభ ఎన్నికల వేళ అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవం పేరుతో బీజేపీ గిమ్మిక్కులకు పాల్పడుతోందని పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. అన్ని వర్గాలను కలుపుకుని పోకుండా చేపట్టే ఈ ఉత్సవాలను తాను సమర్థించడం లేదన్నారు. దక్షిణ 24 పరగణాల జిల్లా జోయ్‌నగర్‌లో మంగళవారం జరిగిన బహిరంగ సభలో మమత మాట్లాడారు. మత ప్రాతిపదికన సామాన్యులను విడదీయడం తనకు ఇష్టం ఉందని చెప్పారు. ఉత్సవాలంటే అన్ని వర్గాల ప్రజలను కలుపుకుంటూ ఐక్యతను ప్రతిబింబించేవిగా ఉండాలన్నారు. మతం వ్యక్తిగతం కానీ, పండుగలు అందరూ జరుపుకోవాల్సినవి అని సీఎం మమత చెప్పారు. మతాల మధ్య విభేదాలకు తాను వ్యతిరేకమని, బెంగాల్ శాంతికాముక ప్రదేశమని అన్నారు.

'ఐన్‌స్టీన్ ప్రోబ్'ను ప్రయోగించిన చైనా

బీజింగ్: అంతరిక్షంలో తరచుగా సంభవించే పేలుళ్ల వంటి సంఘటనల వెనుక ఉన్న రహస్యాన్ని ఛేదించడానికి చైనా అంతరిక్ష పరిశోధన సంస్థ ఐన్‌స్టీన్ ప్రోబ్(ఈపీ) అనే ఖగోళ ఉపగ్రహాన్ని ప్రయోగించింది. ఇది కమలం పువ్వు ఆకారంలో ఉండడం విశేషం. సిచువాన్ ప్రావిన్స్‌లోని షిచాంగ్ శాటిలైట్ లాంచ్ సెంటర్ నుంచి ఐన్‌స్టీన్ ప్రోబ్‌తో కూడిన లాంగ్‌మార్చ్–2సీ రాకెట్ మంగళవారం మధ్యాహ్నం 3.03 గంటలకు విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది. లాబ్‌స్టర్ అనే సముద్రపు జీవి కంటి నిర్మాణాన్ని స్ఫూర్తిగా తీసుకొని అభివృద్ధి చేసిన ఎక్స్–రే డిటెక్షన్ టెక్నాలజీతో ఈ ఉపగ్రహం పనిచేస్తుంది. ఇది పూర్తిగా విచ్చుకున్న కమలం ఆకృతిలో ఉంది. చైనా ఉపగ్రహ ప్రయోగంపై తప్పుడు అనువాదం తైవాన్‌లో తీవ్ర భయాందోళనకు దారితీసింది. చైనా భారీ క్షిపణిని ప్రయోగించిందంటూ రక్షణ శాఖ మెసేజీలు పంపడంతో జనం బెంబేలెత్తిపోయారు. తర్వాత అలాంటిదేమీ లేదంటూ స్పష్టత ఇవ్వడంతో అంతా హాయిగా ఊపిరి పీల్చుకున్నారు.

మహారాష్ట్ర, యూపీల్లో సీట్ల పంపకంపై 'ఇండియా' పార్టీలతో కాంగ్రెస్ చర్చలు

న్యూఢిల్లీ: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో సీట్ల పంపకంపై కాంగ్రెస్ పార్టీ ఇండియా కూటమి పార్టీలతో చర్చలు ప్రారంభించింది. మహారాష్ట్రలో సీట్ల పంపిణీకి సంబంధించి శివసేన(యూబీటీ), నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీలతోనూ, ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీలతోనూ సంప్రదింపులు సాగుతున్నాయి. ఢిల్లీలో కాంగ్రెస్ నేత ముకుల్ వాస్నిక్ నివాసంలో జరుగుతున్న చర్చల్లో సల్మాన్ ఖుర్షీద్, అశోక్ గహ్లోత్ పాల్గొంటున్నారు. శివసేన (యూబీటీ) నుంచి సంజయ్ రౌత్, వినాయక్ రౌత్, ఎన్‌సీపీ నుంచి జితేంద్ర అవ్హాద్ తదితరులు వీరిలో ఉన్నారు. చర్చలు నిర్మాణాత్మకంగా, ఊహించిన దానికంటే విజయవంతంగా సాగాయని అవ్హాద్ చెప్పారు. మహారాష్ట్రలోని 48 లోక్‌స్థానాకు గాను కాంగ్రెస్ 26, శివసేన 23 సీట్లు కోరుతున్నాయి. ఈ నెల 14, 15వ తేదీల్లో మూడు పార్టీల నేతలు సోనియా గాంధీతో భేటీ కానున్నట్లు సమాచారం. యూపీకి సంబంధించి ఎస్పీ నేతలు రామ్‌గోపాల్ యాదవ్, జావేద్ అలీ పాల్గొన్నారు. ఈ నెల 12న మరోసారి భేటీ అయి సీట్ల పంపిణీపై తుది నిర్ణయం తీసుకుంటామని యాదవ్ చెప్పారు.

డీఆర్‌డీవో తయారీ అస్సాల్ట్ రైఫిల్ 'ఉగ్రమ్'



పుణే: కేంద్ర ప్రభుత్వ రక్షణ, పరిశోధన అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీవో) సొంతంగా అభివృద్ధి చేసిన అస్సాల్ట్ రైఫిల్ ఉగ్రమ్‌ను సోమవారం పరీక్షించింది. డీఆర్‌డీవోకు చెందిన పుణేలోని ఆర్మమెంట్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్స్(ఏఆర్‌డీఈ)విభాగం భారత సైన్యం అవసరాలకు అనుగుణంగా దీనిని రూపొందించింది. అంతర్జాతీయ ప్రమాణాలతో 4 కిలోల కంటే తక్కువ బరువుండే ప్రొటోటైప్ అస్సాల్ట్ రైఫిల్‌ను సోమవారం పరీక్షించారు. ద్వీప ఆర్మర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థతో కలిసి గత మూడేళ్లుగా అస్సాల్ట్ రైఫిల్‌ను డిజైన్ చేసినట్లు ఏఆర్‌డీఈ డైరెక్టర్ ఎ.రాజు చెప్పారు. క్షేత్ర స్థాయిలో ప్రయోగాలు జరిపేందుకు ముందుగా స్వతంత్ర నిపుణుల కమిటీ పర్యవేక్షణలో ట్రయల్స్ ఉంటాయని చెప్పారు.

నేటి నుంచి 'వైబ్రంట్ గుజరాత్'

సదస్సును ప్రారంభించనున్న మోదీ

గాంధీనగర్/అహ్మదాబాద్: 10వ 'వైబ్రంట్ గుజరాత్ గ్లోబల్ సమ్మిట్'కు సర్వం సిద్ధమైంది. 133 దేశాల మంత్రులు, దౌత్యవేత్తలు, ప్రతినిధులు, ప్రముఖ కంపెనీల సీఈఓలో పాల్గొనే ఈ మూడు రోజుల సదస్సును ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ప్రారంభిస్తారు. యూఏఈ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్–నహ్యాన్, తూర్పు తిమోర్ అధ్యక్షుడు జోస్ రమోస్–హోర్టా, మొజాంబిక్ అధ్యక్షుడు ఫిలిప్ నుయిసీలతో ఆయన మంగళవారం వేర్వేరుగా సమావేశమయ్యారు. ఆయా దేశాలతో సంబంధాలపై చర్చించారు. అంతకుముందు యూఏఈ అధ్యక్షునికి విమానాశ్రయంలో మోదీ స్వయంగా స్వాగతం పలికారు. ఆయనతో కలిసి సదస్సు ప్రాంగణం దాకా మోదీ రోడ్ షో జరిపారు. ప్రపంచ ప్రఖ్యాత కంపెనీల సీఈఓలు, పరిశ్రమ వర్గాల ప్రతినిధులతోనూ మోదీ భేటీ అయ్యారు. భారతదేశంలో పెట్టుబడులకు అవకాశాలు, ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాల గురించి వివరించారు. డీపీ వరల్డ్ గ్రూప్ చైర్మన్, సీఈఓ సుల్తాన్ అహ్మద్ బిన్ సులేయమ్, మైక్రాన్ టెక్నాలజీ అధ్యక్షుడు, సీఈఓ సంజయ్ మెహ్రోత్రా, డియాకిన్ యూనివర్సిటీ వీసీ ఇయాన్ మార్టిన్, సుజుకీ మోటార్ కార్పొరేషన్ అధ్యక్షుడు తోషిహిరో సుజుకీ తదితరులు వీరిలో ఉన్నారు. గాంధీనగర్‌లో 'వైబ్రాంట్



యూఏఈ అధ్యక్షుడు నహ్యాన్‌ను స్వాగతిస్తున్న మోదీ

గుజరాత్ గ్లోబల్ ట్రేడ్ షో–2024'ను మోదీ ప్రారంభించారు. వైబ్రంట్ గుజరాత్ సదస్సు నేపథ్యంలో 2 లక్షల చదరపు మీటర్లలో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు.

సాక్షి హైదరాబాద్

బుధవారం । 10 । జనవరి । 2024



...గంజాయి వ్యాపారం

గాడిదల ఫామ్ ముసుగులో గంజాయి వ్యాపారం చేస్తున్న ముగ్గురు వ్యక్తుల ముఠాను సౌత్‌జోన్ టాస్క్ ఫోర్స్ టీమ్, బోయిన్‌పల్లి పోలీసులతో కలిసి అదుపులోకి తీసుకున్నారు. -8లో



ఆకతాయిలకు అరదండాలు

నెల రోజుల వ్యవధిలో 224 మంది ఆకతాయిలకు అరదండాలు పడ్డాయి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో మహిళలను వేధిస్తున్న పోకిరీలను సాక్ష్యాధారాలతో సహా పట్టుకుని న్యాయస్థానంలో హాజరు పరిచారు. -8లో

జోన్‌లలో 'ఎవాక్యుయేషన్ డ్రిల్స్'



అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు అత్యవసరంగా బయటపడే అంశంపై అవగాహన కల్పించేందుకు వారానికోమారు 'ఎవాక్యుయేషన్ డ్రిల్' నిర్వహించనున్నట్లు ఈవీడీఎం డైరెక్టర్ ఎన్.ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. -8లో

న్యూస్‌రీల్

నేడు పలు ప్రాంతాల్లో 'విద్యుత్' అంతరాయం

సాక్షి, సిటీబ్యూరో: సాంకేతిక కారణాల దృష్ట్యా ఈ నెల 10వ తేదీ బుధవారం పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జవహర్‌నగర్, ఎర్రమంజిల్, లుంబిని పార్కు, ఇందిరాపార్కు, హుస్సేన్‌సాగర్, జడ్పీ ఆఫీస్‌ల 11 కేవీ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నారు. ఎర్రమంజిల్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, హుస్సేన్‌సాగర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

సిటీ కూల్..కూల్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగరంలో మంగళవారం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. మేఘాలు కమ్ముకుపోయి చీకటితో పాటు చల్లదనం ఏర్పడింది. మధ్యాహ్నం వరకు కాస్త ఎండగా ఉన్న వాతావరణం అకస్మాత్తుగా చల్లబడింది. సాయంత్రం నాలుగు గంటలకే చీకటి వాతావరణం తలపించింది. కొన్ని ప్రాంతాల్లో చల్లటి ఈదురు గాలులు వీచాయి. గత కొద్దిరోజులుగా ఉదయం పూట ఎండ..రాత్రిపూట చల్లటి గాలులు వీస్తుండడతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఈ నెల 13 నుంచి పతంగుల పండుగ



సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ పతంగుల పండుగ వచ్చేసింది. వివిధ దేశాలకు చెందిన కైట్ ప్లేయర్స్ ఎగురవేసే రంగురంగుల, వైవిధ్యభరితమైన పతంగులు నగరవాసులకు కనువిందు చేయనున్నాయి.సంక్రాంతి పర్వదినం సందర్భంగా ప్రతి సంవత్సరం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ కైట్, స్వీట్ ఫెస్టివల్ ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు మూడు రోజుల పాటు సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో జరుగనుంది. ఈ వేడుకలలో 1000 స్టాళ్లలో వివిధ రాష్ట్రాలకు చెందిన మిఠాయిలను ప్రదర్శించనున్నారు.అలాగే ఇండోనేషియా, స్విట్జర్లాండ్, ఆస్ట్రేలియా, శ్రీలంక,కెనడా, కంబోడియా, థాయ్‌లాండ్, దక్షిణకొరియా, మలేసియా, వియత్నాం, ఇటలీ,తదితర 16 దేశాలకు చెందిన సుమారు 40 మంది కైట్ ప్లేయర్స్, అలాగే దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన మరో 50 మంది ఆటగాళ్లు ఈ వేడుకలలో పతంగులను ఎగురవేయనున్నారు. ఈ వేడుకల్లో భాగంగా పలు సాంస్కృతిక, కళా ప్రదర్శనలను కూడా ఏర్పాటు చేయనున్నారు.2016 నుంచి హైదరాబాద్ మహానగరం అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్‌కు ఆతిథ్యమిస్తోంది. పర్యాటక రంగాన్ని ఇతోధికంగా ప్రోత్సహించేందుకు నిర్వహించే ఈ వేడుకలకు అనూహ్యమైన స్పందన లభిస్తోంది. 2018లో సుమారు 8 లక్షల మంది వేడుకలను సందర్శించగా, ఆ తరువాత వరుసగా 2019లో 12 లక్షల మంది, 2020 లో సుమారు 13 లక్షల మందికి పైగా నగరవాసు లు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.ఈ ఏడాది కూడా ఈ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పర్యాటక శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది.

గంగిరెద్దుల సందడి..సంక్రాంతికి బీ రెడీ



మెదక్ జిల్లా నుంచి కూకట్‌పల్లికి వచ్చిన గంగిరెద్దులోళ్లు

సంక్రాంతి పండుగ సమీపిస్తోంది. నగరంలో గంగిరెద్దుల సందడి మొదలైంది. ప్రతిఏటా మాదిరిగానే ఇతర ప్రాంతాల నుంచి గంగిరెద్దుల్ని తీసుకుని పలువురు నగరానికి చేరుకుంటున్నారు. సంక్రాంతి సీజన్‌లో దాదాపు వారం రోజులపాటు గంగిరెద్దులు వీధుల్లో సందడి చేస్తాయి.



గాల్లో 'గ్యారంటీలు'!

నడిరోడ్డుపై 'ప్రజాపాలన' దరఖాస్తులు

- ప్రైవేట్ ఏజెన్సీకి తరలిస్తుండగా పడిపోయిన వైనం..
- సూపరింటెండెంట్ సస్పెన్షన్
- ఘటనపై మంత్రి పొన్నం ఆరా..



కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయం నుండి బైక్‌పై దరఖాస్తులు తీసుకు వెళ్తున్న యువకుడు

సాక్షి, సిటీబ్యూరో/కుత్బుల్లాపూర్: జీహెచ్‌ఎంసీలో కొందరు అధికారుల ఇష్టారాజ్యంతో ప్రభుత్వానికి తలవంపు వచ్చే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీల్లో భాగంగా అర్హమైన పథకాల కోసం గంటల తరబడి క్యూలో నిల్చొని ప్రజలందజేసిన అభయ హస్తం దరఖాస్తులు నడిరోడ్డుపై చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. దీనికి బాధ్యునిగా పేర్కొంటూ టీమ్‌లీడర్‌గా ఉన్న హయత్‌నగర్ సర్కిల్ ట్యాక్స్ సెక్షన్ సూపరింటెండెంట్ ఎం.మహేందర్‌ను సస్పెండ్ చేశారు. ఈమేరకు జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ ఉత్తర్వులు జారీ చేశారు. కుత్బుల్లాపూర్ సర్కిల్‌లోనూ అభయహస్తం దరఖాస్తు ఫారాలను బయటకు తరలిస్తుండగా గుర్తించారు. ప్రజల నుంచి అందిన దరఖాస్తులను ఎక్కడికక్కడే సంబంధిత సర్కిల్/జోన్ పరిధిలోని కార్యాలయాల్లో కాకుండా ఇతర ప్రాంతాలకు తరలిస్తుండటం ఈ ఘటనతో వెలుగు చూసింది. సోమవారం సాయంత్రం బాలానగర్ ఫ్లై ఓవర్‌పై ఓ బైక్‌పై నుంచి కొన్ని కాగితాలు చెల్లాచెదురుగా రోడ్డుపై పడిపోయాయి. వాటిని చూసిన వాహనదారులు ఆశ్చర్యపోయారు. అవి ప్రజాపాలనలోని దరఖాస్తులు కావడం.. అవి కూడా నగరానికి ఈ చివరన ఉన్న హయత్‌నగర్ సర్కిల్‌వి కావడంతో అవాక్కయ్యారు. ఈ దరఖాస్తులను ఆ చివరన ఉన్న కూకట్‌పల్లికి తరలిస్తున్నట్లు తెలిసింది. వాటిని కంప్యూటరీకరించేందుకు ప్రైవేట్ ఏజెన్సీకి తరలిస్తున్నట్లు తెలిసింది. హయత్‌నగర్ సర్కిల్ ఉన్నది ఎల్‌బీనగర్ జోన్‌లో కాగా.. వాటిని కూకట్‌పల్లికి ఎందుకు తరలించాల్సి వచ్చిందన్నది అంతుపట్టడం లేదు. అన్ని దరఖాస్తుల కంప్యూటరీకరణ ఒకే ఏజెన్సీకి ఇచ్చారా ? అన్నది అధికారులు వెల్లడించలేదు. కూకట్‌పల్లి, ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్లు గతంలో తమ బదిలీ ఉత్తర్వులను పరస్పరం మార్చుకోవడాన్ని ప్రజలు ఈ సందర్భంగా చర్చించుకుంటున్నారు.

తప్పెవరిది.. శిక్ష ఎవరికి ?

సంబంధిత జోన్‌కు చెందిన ఉన్నతాధికారులు దరఖాస్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాల్సి ఉండగా, వారి నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగినట్లు విమర్శలు వెలువడుతున్నాయి. సంబంధిత జోన్, సర్కిల్ కమిషనర్‌పై కాకుండా సూపరింటెండ్‌పై మాత్రమే చర్యలు తీసుకోవడం వెనుక కారణాలేమిటో అంతుపట్టడం లేదు. ఎంతోకాలంగా సదరు ఏజెన్సీతో కొనసాగుతున్న సంబంధం వల్లే దూరంగా ఉన్నప్పటికీ ఆ ఏజెన్సీకి దరఖాస్తుల కంప్యూటరీకరణ పనులు కాంట్రాక్టుకిచ్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాంట్రాక్టు ఇచ్చింది ఎవరు? అన్నది పట్టించుకోకుండా తూతూమంత్రంగా ఎవరో ఒకరిని బలి చేయడం సరికాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మారని జీహెచ్‌ఎంసీ తీరు..

గతంలోనూ ఎన్నికల సందర్భంగా తప్పులు జరిగినప్పుడు కింది స్థాయిలోని వారిని బలిపశువుల్ని చేయడాన్ని ఈ సందర్భంగా ప్రస్తావిస్తున్నారు. బాగా చేశారని పేరొస్తే మాత్రం 'కిరీటాలు' వాళ్లు పెట్టుకుంటూ, తప్పులు జరిగినప్పుడు మాత్రం చాకిరీ చేసిన ఉద్యోగులను బలి చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

వికేంద్రీకరణ ప్రభావం..

జీహెచ్‌ఎంసీలో జోన్లకు సర్వాధికారాలు కట్టబెట్టినప్పటి నుంచే జోనల్ స్థాయిలో అవకతవకలు పెరిగిపోయాయనే ఆరోపణలున్నాయి. అరుదుగా ఎప్పుడో మాత్రమే ఇలాంటి ఘటనలు బయటపడుతున్నాయని చెబుతున్నారు. ఎక్కడైనా వికేంద్రీకరణ సత్ఫలితాలిస్తుండగా జీహెచ్‌ఎంసీలో అది పూర్తిగా రివర్స్ అయింది. పేదల జీవితాలతో ముడిపడి ఉన్న దరఖాస్తులను అద్దె బైక్‌పై పంపించడం ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దరఖాస్తుల కంప్యూటరీకరణ అధికారుల పర్యవేక్షణలో జరగాల్సి ఉండగా, ఎక్కడికిపడితే అక్కడికి, జీహెచ్‌ఎంసీ నుంచి కనీసం ఒక ఉద్యోగి కూడా వెంట లేకుండా పంపించడం, ఇళ్లకు కూడా పంపించడం, తదితరమైన వాటికి సమాధానాల్లేవు. కుత్బుల్లాపూర్ సర్కిల్‌లోనూ దరఖాస్తులు బయటకు తరలిస్తుండటం వెలుగు చూడటంతో అక్కడ కూడా ఒక ఉద్యోగిని సస్పెండ్ చేసినట్లు వినిపిస్తున్నప్పటికీ, అధికారికంగా వెల్లడి కాలేదు.

మంత్రి పొన్నం ఆరా..

◆ దరఖాస్తుల తరలింపు ఘటనపై జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్‌ను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులకు సంబంధించి ఎలాంటి పొరపాట్లు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

◆ కూకట్‌పల్లి జోనల్ పరిధిలోని కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తులను ఇష్టానుసారంగా ప్రైవేటు సిబ్బంది చేతుల్లో పెట్టి ఇళ్లకు తీసుకువెళ్లి అప్‌లోడ్ చేయాల్సిందిగా సూచించడం విమర్శలకు తావిస్తోంది.

◆ మంగళవారం పలువురు దరఖాస్తులను ద్విచక్ర వాహనంపై పెట్టుకుని తీసుకువెళ్లడం కనిపించింది. ఈ దరఖాస్తులు ఎవరు ఇచ్చారు అనే ప్రశ్నకు వారి వద్ద సమాధానం లేదు. ఎక్కడికి తీసుకు వెళుతున్నారు అని అడిగితే ఇళ్లకు తీసుకువెళ్లి అప్లోడ్ చేయమన్నారు అనే సమాధానం చెప్పడం విశేషం. ఏఎంసీ భార్గవ్ నారాయణ సూచన మేరకు వార్డు కార్యాలయంలో అప్‌లోడ్ చేసేందుకు వెళుతున్నట్లు తెలిసింది. ఈ విషయంపై కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నరసింహాను 'సాక్షి'వివరణ కోరగా వార్డు కార్యాలయంలో అప్‌లోడ్ చేసేందుకు తీసుకు వెళుతున్నారని, ఇంటికి తీసుకు వెళ్లడం లేదని చెప్పుకొచ్చారు.

అత్యంత జాగ్రత్తగా 'దరఖాస్తుల' నిర్వహణ

జీహెచ్‌ఎంసీ కమిషనర్

సాక్షి, సిటీబ్యూరో: డిసెంబర్ 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు నిర్వహించిన ప్రజాపాలనలో అందిన అన్ని దరఖాస్తులను సక్రమంగా నిర్వహిస్తున్నట్లు జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ ఒక ప్రకటనలో తెలిపారు. తగిన జాగ్రత్తలతో డేటా ఎంట్రీ జరుగుతోందని, దరఖాస్తులను అత్యంత జాగ్రత్తలతో భద్రపరచినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే నాలుగున్నర లక్షల దరఖాస్తుల డేటా ఎంట్రీ పూర్తయిందని, మిగతావి కూడా త్వరలోనే పూర్తిచేస్తామని పేర్కొన్నారు. స్పెషల్ ఆఫీసర్లు, టీమ్ లీడర్లు డేటా ఎంట్రీని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, దరఖాస్తుల భద్రత కోసం వారికి కచ్చితమైన సూచనలిచ్చినట్లు పేర్కొన్నారు.

రాచకొండలో కారుణ్య నియామకం

- కానిస్టేబుల్ భార్యకు నియామక పత్రాన్ని అందజేసిన సీపీ సుధీర్ బాబు

సాక్షి, సిటీబ్యూరో: రాచకొండ పోలీసు కమిషనరేట్ అంబర్‌పేట పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో సొంగా శేఖర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూ 2021 సెప్టెంబర్ 30న రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఆయన భార్య సత్యలతకు కొన్ని కారణాలు చూపి గత ప్రభుత్వం కారుణ్య నియామకం కింద ఆమెకు ఉద్యోగం ఇవ్వడానికి నిరాకరించింది. తాజాగా ఆమె కుటుంబ సభ్యులతో కలిసి ప్రజావాణి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసింది. కుటుంబ దీనస్థితిని సీఎంకు వివరించగా..వెంటనే ఆయన స్పందించారు. మానవతా దృక్పథంతో నిబంధనలు సడలించి ఉద్యోగం ఇవ్వాలని రాష్ట్ర డీజీపీ, రాచకొండ కమిషనర్‌లను ఆదేశించారు. దీంతో రాచకొండ కమిషనరేట్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇవ్వాలని డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు రాచకొండ సీపీ సుధీర్‌బాబు పోలీసు కమిషనర్ కార్యాలయములో సత్యలతకు జూనియర్ అసిస్టెంట్‌గా నియమిస్తూ మంగళవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కానిస్టేబుల్ శేఖర్ కుటుంబ సభ్యులు మరోసారి ముఖ్యమంత్రి, డీజీపీ, సీపీలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు భద్రారెడ్డి, శేఖర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



లేడీస్ స్పెషల్

నుమాయిష్‌లో మంగళవారం 'లేడీస్ డే' వేడుకలు ఘనంగా జరిగాయి. కేవలం మహిళలకు మాత్రమే అనుమతివ్వడంతో వారు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీంతో ఎగ్జిబిషన్ కిక్కిరిసిపోయింది. ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు వనం సత్యేందర్, కార్యదర్శి హన్మంతరావు, సంయుక్త కార్యదర్శి చంద్రజిత్ సింగ్, కోశాధికారి ఏనుగుల రాజేందర్‌కుమార్‌లు పాల్గొని వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. – అబిడ్స్





తూకం.. మోసం!

గ్రేటర్‌తో సహా శివారు మార్కెట్లు, మాల్స్‌లో చీటింగ్


- కిలోకు 50 నుంచి వంద గ్రాములు తక్కువ తూకం
- పండ్లు ,కూరగాయలు, చేపల మార్కెట్లలోనూ చేతివాటం
- దుకాణాలు, సూపర్ మార్కెట్లలోనూ అంతే...

సాక్షి,మేడ్చల్ జిల్లా:

☛ మలక్‌పేట్‌లో రాణి అనే గృహిణి 500 గ్రాములు ఆలుగడ్డలు కొనుగోలు చేశారు. వాటిని ఎలక్ట్రానిక్ తూకం వేయిస్తే 460 గ్రాములు మాత్రమే ఉంది.

☛ ఉప్పల్‌లో కిరణ్‌రెడ్డి కిలో టమాలను కొనుగోలు చేయగా, విక్రయదారుడు వాటిని మామూలు త్రాసులో తూకం వేసి ఇచ్చాడు. వాటిని ఎలక్ట్రానిక్ తూకం వేస్తే 900 గ్రాములు మాత్రమే ఉన్నట్లు చూపిస్తోంది.

☛ బియ్యం బస్తా 25 కిలోలకు ధర చెల్లిస్తుండగా.. తూకం వేస్తే 24.5 కిలోలు మాత్రమే ఉంటోంది. దీనిపై షాపుల నిర్వాహకులు సరైన సమాధానం ఇవ్వడంలేదు



...ఇలా నగరంలోని మార్కెట్లలో తూకం మోసాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. మాంసం, చేపలు, ఇతర సరుకులు ఒక్కటేమిటి...ప్రతిదీ మళ్లీ తూకం వేస్తే తేడా కనిపిస్తోంది. దీంతో ఇందులో ఏది నమ్మాలో తెలియక వినియోగదారులు అయోమయానికి గురవుతున్నారు. భారీగా నష్టపోతున్నారు. వినియోగదారుల అవసరాలను ఆసరాగా చేసుకుంటున్న వ్యాపారులు పలు రకాలుగా మోసాలకు పాల్పడుతున్నారు. అయితే..తూకాలు, కొలతల్లో తేడాలు ఉంటున్నా.. పట్టించుకునే వారు కరవయ్యారు. ఇంతా జరుగుతున్నా...సంబంధిత అధికారులు మాత్రం నామమాత్రపు తనిఖీలతో కాలం వెళ్లదీస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సూపర్ మార్కెట్లలో....

నగరంతో సహా శివార్లలోని పలు కిరాణం దుకాణాలు, సూపర్ మార్కెట్లలో ప్యాకెట్ల రూపంలో విక్రయించే వాటిపై తయారీ, నాణ్యతా ప్రమాణాలు, ఇతర వివరాలు ఉండటం లేదు. ఇష్టం వచ్చినట్లు విక్రయిస్తున్నారు. ఏదైనా వస్తువు, ఆహార పదార్థాలకు సంబంధించిన ప్యాకింగ్‌పై ఆఫర్లు వున్నా ఇవ్వడం లేదు. చిప్స్, కారా, మిఠాయిలు, బిస్కెట్లు, బ్రెడ్లు, కేకులు తదితర ప్యాకెట్లపై ఎలాంటి వివరాలు ఉండటం లేదు. గడువు తీరినా, కల్తీ జరిగినా ఎవరికి ఫోన్ చేయాలో తెలియడం లేదు. కస్టమర్ కేర్ వివరాలు, ఫోన్ నెంబర్ లాంటివి ఉండటం లేదు. చేపల మార్కెట్లలో వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. లావుపాటి కవర్లలో చేపలు తూకం వేయడం, ఎలక్ట్రానిక్ మెషిన్లు కాకుండా పాత రకపు త్రాసులు వాడుతుండటం కనిపిస్తోంది. బయట ఎలక్ట్రానిక్ యంత్రంపై తూకం వేయిస్తే కిలోకు 100 నుంచి 200 గ్రాముల వరకు తేడా వస్తున్నట్లు వినియోగదారులు చెబుతున్నారు. మరికొందరు ఎలక్ట్రానిక్ యంత్రాన్ని లీటర్ మోడ్లో పెట్టి తూకం వేస్తున్నారు. అందులో వెయ్యి గ్రాములు కాకుండా వెయ్యి అని మాత్రమే చూపిస్తోంది. లీటర్ మోడ్లో ఉంటే పాలు తీసుకుంటే 1000 (లీటరు) ఎంఎల్ చూపిస్తోంది. ఘన పదార్థం తీసుకుంటే (ఉదా: కిలో చేపలు తీసుకుంటే) 900 అని వస్తోంది.

వినియోగదారులు జాగ్రత్తగా ఉండాలి

ప్రతి వస్తువు కొనుగోలు చేసేటప్పుడు వినియోగదారులు జాగరూకతో ఉండాలి. ఘన, ద్రవ ఆహార పదార్థాలు ప్యాక్ చేసి విక్రయించే వారికి అనుమతి ఉందా లేదా తెలుసుకోవాలి. ప్యాకింగ్ పూర్తి వివరాలను పరిశీలించాలి. బిల్లులు ఖచ్చితంగా అడిగి తీసుకోవాలి. పెట్రోల్, డీజిల్ పోయించుకునేప్పుడు జీరో రీడింగ్ చూసుకోవాలి. తక్కువ వస్తే అధికారులకు ఫిర్యాదు చేయాలి. ఎలక్ట్రానిక్ తూకంపై ప్రతి ఏటా ముద్ర వేస్తారు. ఉందా..లేదా..పరిశీలించాలి.

– సత్యనారాయణ, తూనికలు–కొలతల అధికారి

పండక్కి ముందే 'ప్రైవేట్' దోపిడీ!

సాధారణ బస్సు చార్జీలపై రెట్టింపు వసూళ్లు

- బుకింగ్‌లు లేవంటూనే అధిక చార్జీలు
- మొదలైన సొంత ఊరు ప్రయాణాలు
- పిల్లలకు సంక్రాంతి సెలవులు కావడంతో టూర్లు
- ప్రైవేట్ బస్సుల అక్రమ రవాణాపై ఆర్టీఏ దాడులు
- ఆర్టీసీ నుంచి 4,484 సంక్రాంతి ప్రత్యేక బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: సంక్రాంతికి సొంత ఊరు ప్రయాణాలు మొదలయ్యాయి. పిల్లలకు సెలవులు ప్రకటించడంతో నగరవాసులు సొంత ఊళ్లకు వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే అన్ని రెగ్యులర్ రైళ్లు, ప్రత్యేక రైళ్లు ఈ నెల చివరి వరకు పూర్తిగా బుక్ అయిపోవడంతో ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులను ఆశ్రయిస్తున్నారు. దీంతో పండుగ రద్దీ కంటే ముందే ప్రైవేట్ బస్సులు దారి దోపిడీకి తెరలేశాయి. హైదరాబాద్ నుంచి ఏపీలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ఆర్టీసీ రెగ్యులర్ సర్వీసుల్లో ఇప్పటికే ముందస్తు రిజర్వేషన్లు పూర్తయ్యాయి. దీంతో ప్రత్యేక బస్సుల్లో ప్రయాణికులు రిజర్వేషన్లు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో నగరం నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రైవేట్ బస్సులకు సైతం డిమాండ్ నెలకొంది. ప్రయాణికుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రైవేట్ బస్సులు ఇప్పటికే సాధారణ చార్జీలను రెట్టింపు చేశాయి. కాంట్రాక్ట్ క్యారేజీలుగా నమోదైన వందలాది బస్సులు స్టేజీ క్యారేజీలుగా రోడ్డెక్కి ప్రయాణికుల జేబులు లూటీ చేస్తున్నాయి.



ప్రైవేట్ బస్సుల పర్మిషన్లను తనిఖీ చేస్తున్న ఆర్టీఏ అధికారులు

చార్జీల దోపిడీ ఇలా..

హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే మ్యాక్సీ క్యాబ్‌లు, మినీ బస్సులు సైతం సంక్రాంతి దోపిడీకి తెరలేపాయి.

◆ హైదరాబాద్ నుంచి విజయవాడకు సాధారణ రోజుల్లో రూ.450 వరకు చార్జీ ఉంటే ప్రస్తుతం రూ.600 నుంచి రూ.700 కు పెంచారు.

◆ అలాగే హైదరాబాద్ నుంచి విశాఖకు రూ.1800 వరకు వసూలు చేస్తున్నట్లు ప్రయాణికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

◆ హైదరాబాద్ నుంచి విజయవాడ, విశాఖ, కాకినాడ, అమలాపురం, ఏలూరు తదితర రూట్లలో ప్రయాణికుల డిమాండ్ భారీగా ఉంది. హైదరాబాద్ నుంచి ఏపీ వైపు వెళ్లే అన్ని రైళ్ల భర్తీ అయ్యాయి. ఇటీవల ప్రకటించిన ప్రత్యేక రైళ్లలోనూ వెయిటింగ్ జాబితా 250 నుంచి 350 వరకు నమోదైంది.

◆ ప్రయాణికులు మరో గత్యంతరం లేక ప్రైవేట్ బస్సులను ఆశ్రయించవలసి వస్తోంది. రైళ్లు, ఆర్టీసీ బస్సుల తరహాలో ప్రైవేట్ బస్సుల్లోనూ ముందస్తు బుకింగ్‌లకు డిమాండ్ పెరిగింది.

◆ ప్రయాణికుల రద్దీ, డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని చార్జీలను అడ్డగోలుగా పెంచారు. 'హైదరాబాద్ నుంచి వైజాగ్‌కు నలుగురు కుటుంబ సభ్యులు కలిసి వెళ్లాలంటే రూ.10 వేలు దాటుతోంది. సంక్రాంతి చాలా పెద్ద పండుగ. ఎట్టి పరిస్థితుల్లోనూ ఊరెళ్లాలని ఉంది. కానీ నలుగురం వెళ్లి, తిరిగి రావడమే భారంగా అనిపిస్తోంది' అని కూకట్‌పల్లికి చెందిన వేణుగోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు.

ఆర్టీసీ 4,484 సంక్రాంతి ప్రత్యేక బస్సులు....

సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఆర్టీసీ ఈ ఏడాది 4,484 ప్రత్యేక బస్సులను నడిపేందుకు ఏర్పాట్లు చేసింది.రెగ్యులర్ బస్సులకు ఇప్పటికే రిజర్వేషన్లు పూర్తికావడంతో ప్రయాణికులు ప్రత్యేక బస్సుల్లో రిజర్వేషన్‌లు చేసుకుంటున్నారు. రెండు రోజులుగా ప్రత్యేక బస్సులకు కూడా డిమాండ్ పెరిగిందని, ప్రయాణికుల రద్దీకనుగుణంగా మరిన్ని అదనపు బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.ఈ ప్రత్యేక బస్సుల్లో ప్రస్తుతం 626 సర్వీస్‌లకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించారు.ఈ నెల 15 వ తేదీ వరకు ఈ ప్రత్యేక బస్సులు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయి. మరోవైపు ఆర్టీసీ నడిపే ప్రత్యేక బస్సుల్లో ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత సదుపాయాన్ని కల్పించనున్నారు.అలాగే సంక్రాంతి ప్రత్యేక బస్సుల్లో ఎలాంటి అదనపు చార్జీలు ఉండవని, సాధారణ చార్జీలతోనే ప్రయాణికులు రాకపోకలు సాగించవచ్చునని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు.ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ క్రాస్ రోడ్స్, ఆరాంఘర్, ఎల్బీనగర్ క్రాస్ రోడ్స్, కేపీహెచ్‌బీ, బోయిన్‌పల్లి, గచ్చిబౌలి, తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచారు.

ప్రైవేట్ బస్సులపై ఆర్టీఏ దాడులు....

మరోవైపు నిబంధనలకు విరుద్ధంగా అక్రమ రవాణాకు పాల్పడుతున్న ప్రైవేట్ బస్సులపైన ఆర్టీఏ అధికారులు పలు చోట్ల దాడులు చేపట్టారు. నిబంధనలు ఉల్లంఘించి తిరిగే బస్సులపైన కేసులు నమోదు చేశారు.చాలా వరకు కాంట్రాక్ట్ బస్సులుగా నమోదై స్టేజీ క్యారేజీలుగా తిరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. మరోవైపు కొన్ని బస్సుల్లో అదనపు సీట్లు ఏర్పాటు చేయడం, పరిమితికి మించి ప్రయాణికులను తరలించడం వంటి ఉల్లంఘనలను అధికారులు గుర్తించారు.

హైబిజ్ ఆధ్వర్యంలో ‘రియాల్టీ అవార్డ్స్ 2024’

- 18 వరకు నామినేషన్ల స్వీకరణ..
- 3 విభాగాల్లో 50కి పైగా అవార్డులు..



సాక్షి, సిటీబ్యూరో: రియల్ ఎస్టేట్ రంగంలో దశాబ్దాలుగా ఉత్తమమైన సేవలను అందిస్తూ, ఈ రంగంలో రాణిస్తున్న ప్రముఖులకు హైబిజ్ టీవీ ఆధ్వర్యంలో ‘రియాల్టీ అవార్డ్స్ 2024’ ప్రదానం చేయనున్నట్లు సంస్థ ఫౌండర్–మేనేజింగ్ డైరెక్టర్ ఎం.రాజగోపాల్ తెలిపారు. మంగళవారం గోల్కొండ హోటల్‌లో అవార్డులకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ వి.రాజశేఖర్ రెడ్డి, వీర ఆర్ఎంసీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ పి.నర్సింహా రెడ్డి, ఫార్చ్యున్ ఆర్ట్ ఎల్ ఈడీ లైటింగ్ డైరెక్టర్ అధితి శ్రీమాల్, ప్రకాష్ రాగి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ., రియల్ ఎస్టేట్ రంగంలో విభిన్న విభాగాల్లో అత్యుత్తమ సేవలతో పాటు వినూత్న విధానాలతో దేశాభివృద్ధికి సహకరిస్తున్న సంస్థలు, వ్యక్తులకు 3 విభాగాల్లో 50కి పైగా అవార్డులను అందించనున్నట్లు తెలిపారు. ఈ నెల 18 వరకు నామినేషన్లను స్వీకరిస్తున్నామని, 25న హెచ్ఐసీసీ నోవోటెల్‌లో అవార్డులను ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు ఎం.రాజగోపాల్ పేర్కొన్నారు. రియాల్టీ అవార్డ్స్ జ్యూరీ కమిటీలో రియాల్టీ రంగంతో పాటు విభిన్న రంగాల్లోని జాతీయ స్థాయి ప్రముఖులు, నిపుణుల ఆధ్వర్యంలో అవార్డుల ఎంపిక జరుగుతుందని, ఇందులో పరిశ్రమ అనుభవం, ప్రాజెక్ట్ కౌంట్, ప్రాజెక్టు వ్యయ ప్రమాణాల ఆధారంగా వివిధ విభాగాల్లో అవార్డులను జ్యూరీ కమిటీ నామినేట్ చేయనుందని ఆయన వివరించారు.

కలెక్టర్‌ను కలిసిన ట్రైనీ ఐఏఎస్‌లు



సాక్షి,సిటీబ్యూరో: భారత దర్శన్ లో భాగంగా 14 మంది ట్రైనీ ఐఏఎస్ అధికారులు మంగళవారం హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విధి నిర్వహణలో వచ్చే సవాళ్లను సమర్థవంతంగా ఎలా ఎదుర్కోవాలో వారికి వివరించారు. ప్రతి ఒక్కరూ సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహిస్తారని ఆకాంక్షిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

11న ఆర్‌బీవీఆర్‌ఆర్‌కు నాక్ టీమ్

నల్లకుంట: బర్కత్‌పురలోని రాజా బహదూర్ వెంకట్రామా రెడ్డి(ఆర్‌బీవీఆర్‌ఆర్) మహిళా కళాశాల పరిశీలనకు ఈ నెల 11న హైదరాబాద్ నాక్ పీర్ టీమ్‌ను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అచ్యుత దేవి తెలిపారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల గౌరవ కార్యదర్శి ప్రొఫెసర్ ముత్యం రెడ్డి, కళాశాల కరస్పాండెంట్ సుదర్శన్ రెడ్డితో కలిసి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా కళాశాల 5వ సైకిల్ పీర్ టీమ్ ఇన్‌స్పెక్షన్ జరుగుతుందన్నారు. తమ కళాశాలలో ఉత్తమ విద్యా ప్రమాణాలు పాటిస్తున్నందున ఉత్తమ గ్రేడ్ ఆశిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.



విద్యుత్‌రంగ ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

సుల్తాన్‌బజార్: విద్యుత్ రంగ ప్రైవేటీకరణను అడ్డుకుంటామని ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నేతలు పేర్కొన్నారు. మంగళవారం కోఠిలోని ఐఎంఏ ఆడిటోరియంలో (ఈఈఎఫ్ఐ) ఆల్ ఇండియా వర్కింగ్ కమిటీ సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన అఖిల భారత ప్రధాన కార్యదర్శి పీఎన్ చౌదరి, ఉపాధ్యక్షులు సుభాష్ లంబ మాట్లాడుతూ... కార్మికులు, రైతుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గాలికి వదిలేశాయన్నారు. మత తత్వాన్ని రెచ్చగొట్టి మళ్లీ అధికారంలోకి రావడానికి ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఒకే దేశం, ఒకే ఎన్నికల పేరుతో దేశాన్ని తమ ఆధీనంలోకి తీసుకోవాలని చూస్తున్నారన్నారు. కొన్ని రాష్ట్రాల్లో సెంట్రల్ పే కమిషన్‌ను అమలు చేస్తూ పెన్షన్ హక్కులను కాలరాస్తున్నారన్నారు. విద్యుత్, ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. ప్రపంచంలో భారత్ 5వ స్థానంలో ఉందని చెబుతున్న ప్రధాని ప్రజల ఆర్థిక ఎదుగుదలను గమనించాలన్నారు. కార్మిక కర్షక ప్రజల ఎదుగుదలే దేశ ప్రజల ఎదుగుదల అని గుర్తించాలన్నారు. విద్యుత్ సంస్థ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దేశవ్యాప్త నిరసనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం కోశాధికారి రాజేంద్రన్, కార్యదర్శి దీపా, సురేష్ రాతి, సూరిబాబు, ఈశ్వర్‌రావు, గోవర్ధన్‌లతో పాటు వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గాడిదల ఫామ్ ముసుగులో
గంజాయి వ్యాపారం

- ముగ్గురు నిందితుల అరెస్ట్
- 130 కిలోల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ డీసీపీ మధుసూదన రావు



పోలీసులు అదుపులో నిందితులు

కంటోన్మెంట్: గాడిదల ఫామ్ ముసుగులో గంజాయి వ్యాపారం చేస్తున్న ముగ్గురు వ్యక్తుల ముఠాను సౌత్‌జోన్ టాస్క్ ఫోర్స్ టీమ్, బోయిన్‌పల్లి పోలీసులతో కలిసి అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 130 కిలోల గంజాయి, రెండు కార్లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నార్త్‌జోన్ అడిషనల్ డీసీపీ మధుసూదన్ రావు, బేగంపేట ఏసీపీ రామలింగరాజుతో కలిసి మంగళవారం బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. రాజస్థాన్‌కు చెందిన జైసింగ్ భాటీ, రూప్ చంద్ కచావా, ప్రేమ్‌కుమార్ నగరానికి వలస వచ్చి జీడిమెట్ల ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. జైసింగ్ భాటీ, జీడిమెట్ల సమీపంలోని సుభాష్ నగర్‌లో ఫుడ్‌కోర్టు, మెదక్ జిల్లా కుచారంలో డాంకీ ఫామ్ నిర్వహిస్తున్నాడు. ప్రేమ్ కుమార్ అతడి వద్ద పని చేసేవాడు. తక్కువ సమయంలో డబ్బులు సంపాదించాలని భావించిన జైసింగ్, రూప్‌చంద్, ప్రేమ్‌కుమార్‌లతో కలిసి గంజాయి దందాకు తెరలేపాడు. తనకు పరిచయస్తుడైన మంగీలాల్, ధర్మేంద్రల ద్వారా గంజాయి కొనుగోలు చేసి విద్యార్థులకు విక్రయించేవాడు. జీడిమెట్లలోని నూడుల్స్ సెంటర్‌తో పాటు కుచారంలోని డంకీ ఫామ్ కేంద్రంగా విక్రయాలు కొనసాగేవి. ఎక్కువ మొత్తంలో గంజాయి కావాలని మంగీలాల్, ధర్మేంద్రలను కోరగా వారు రాజమండ్రికి చెందిన రాజన్‌ను సంప్రదించాలని సూచించారు. అక్కడికి వెళ్లిన వారు బొలేరో, స్విఫ్ట్ కారులో పెద్ద మొత్తంలో గంజాయి తీసుకుని నగరానికి వస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు సోమవారం రాత్రి డైమండ్ పాయింట్ వద్ద వాహనాలను అడ్డుకుని గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు. నిందితులు ఇచ్చిన సమాచారం ఆధారంగా మరికొందరిని అదుపులోకి తీసుకునేందుకు చర్యలు చేపట్టారు.

9 కేజీల గంజాయి పట్టివేత

చైతన్యపురి: అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను చైతన్యపురి పోలీసులు అరెస్ట్ చేసి వారి నుంచి 9 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ నాగార్జున కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.వనపర్తి జిల్లా, రాయనిపల్లి గ్రామానికి చెందిన కొంకాల బ్రహ్మయ్య నాయుడు, జోగులాంబ గద్వాల జిల్లా, రాజోలికి చెందిన తెలుగు రమేష్ ఆరునెలల క్రితం నగరానికి వలస వచ్చారు. చైతన్యపురిలో ఉంటూ రాపిడో, జొమాటోలలో పనిచేశారు. ఆదాయం సరిపోకపోవడంతో సులువుగా డబ్బు సంపాదించేందుకు గంజాయి వ్యాపారం చేయాలని పథకం పన్నారు. అరకు ప్రాంతానికి చెందిన నారాయణ అనే వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసి నగరంలో అవసరమైన వారికి విక్రయిస్తున్నారు. గత శనివారం అరకు వెళ్లిన వీరు 9 కేజీల గంజాయి తీసుకుని ప్రైవేట్ బస్సులో నగరానికి తీసుకొచ్చారు. సోమవారం గంజాయి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐలు రవి, పాండు బ్రహ్మం నాయుడు, రమేష్‌లను అరెస్ట్ చేసి వారి నుంచి 9 కేజీల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

అపోలోలో విజయవంతంగా మినిమల్లీ ఇన్వాసివ్

15 ఏళ్ల క్రితం ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగిన పదహారేళ్ల బాలుడికి చికిత్స



సాక్షి, సిటీబ్యూరో: ఛాతీ నొప్పితో, శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతున్న 16 ఏళ్ల బాలుడికి అపోలో మెడికల్ కాలేజీకి చెందిన కార్డియాలజిస్టులు అత్యంత క్లిష్టమైన ‘మినిమల్లీ ఇన్వాసివ్’ ప్రక్రియతో విజయవంతంగా చికిత్స చేశారు. పుట్టుకతో వచ్చే గుండె జబ్బు కారణంగా బాలుడికి 15 ఏళ్ల క్రితం (2007) ఓపెన్ హార్ట్ సర్జరీ చేశారు. ఇప్పుడు మళ్లీ సమస్య రావడంతో ఈ చికిత్స చేశారు. మంగళవారం అపోలో మెడికల్ కాలేజీలో సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ మనోజ్ అగర్వాల్ వివరాలు వెల్లడించారు. అపోలో మెడికల్ కాలేజీలో అత్యంత క్లిష్టమైన ఇన్వాసివ్ ప్రక్రియతో చికిత్స చేశాం. సమస్య సంక్లిష్టంగా ఉన్నప్పటికీ కార్డియాలజిస్టులు ఓపెన్ హార్ట్ సర్జరీని ఎంచుకోకూడదని అనుకుంటారు. రెండో సర్జరీ ఎప్పుడూ కష్టంగానే ఉండటంతో పాటు చాలా సమస్యలు ఉంటాయి. రికవరీ కోసం ఐసీయూలో ఎక్కువ కాలం (7 నుంచి10 రోజులు) ఉండాల్సి ఉంటుంది. 35ఎంఎం మైవల్ అనే కృత్రిమ బయోప్రోస్టెటిక్ వాల్వ్‌ను ఉపయోగించి ట్రాన్స్‌కాథెటర్ పల్మనరీ వాల్వ్ ఇంప్లాంటేషన్, ఫ్లోరోస్కోపీ, యాంజియోగ్రఫీ మార్గదర్శకాలను అనుసరించి అత్యంత సామర్థ్యంతో క్యాథ్‌లాబ్‌లోని కుడి జఠరికలో కచ్చితంగా అమర్చాము. ఈ ప్రక్రియ విజయవంతం కావడంతో బాలుడు కోలుకున్నాడు, రెండు రోజులలో డిశ్చార్జి కూడా చేయనున్నామని తెలిపారు. పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డాక్టర్ అమోల్ గుప్తా మాట్లాడుతూ., ఇటువంటి క్లిష్టమైన స్థితిలో ఉన్న రోగికి సరైన ఎంపిక ఓపెన్ హార్ట్ సర్జరీ.. అయితే బాలుడి గత చరిత్ర, వయస్సును పరిగణనలోకి తీసుకుని శస్త్రచికిత్సను నివారించాలనుకున్నాం. అందుకే ఈ విధానాన్ని ఎంచుకున్నామని, ఈ చికిత్స విజయవంతంగా పూర్తైందని తెలిపారు. ప్రస్తుతం అందరిలానే సాధారణ జీవితాన్ని గడపగలడని వివరించారు. కార్యక్రమంలో అపోలో వైద్యులు, బాలుడితో పాటు అతడి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రతి జోన్‌లో ‘ఎవాక్యుయేషన్ డ్రిల్స్’



సాక్షి,సిటీబ్యూరో: అగ్నిప్రమాదాల వంటివి సంభవించినప్పుడు అత్యవసరంగా భవనాల నుంచి ఎలా బయట పడాలనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వారానికోమారు ‘ఎవాక్యుయేషన్ డ్రిల్’ నిర్వహించనున్నట్లు జీహెచ్ఎంసీ ఈవీడీఎం డైరెక్టర్ ఎస్.ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. ఈ డ్రిల్‌ను అన్ని జోన్లలోనూ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇలాంటి డ్రిల్స్ మంగళవారం టోలిచౌకి పోడియం మాల్, సంతోష్‌నగర్ సాయి డిగ్రీ కాలేజ్, సరూర్‌నగర్ శ్రీత్రివేణి స్కూల్, కూకట్‌పల్లి పాయ్ ఇంటర్నేషనల్ స్కూల్, బేగంపేట ఐడీఎఫ్‌సీ బ్యాంక్ భవనాల్లో నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఇలాంటి డ్రిల్స్ వల్ల అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తక్షణం ఎలా స్పందించాలి.. భవనంలో అత్యవసరంగా బయటకు వెళ్లే మార్గాలు ఎక్కడెక్కడ ఉన్నాయి.. తదితరమైనవి తెలుస్తాయన్నారు. ఈవీడీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలకు ఆయా సంస్థల యాజమాన్యాలు సహకరించాలని కోరారు. తమ భవనంలో డ్రిల్ నిర్వహించాల్సిందిగా నిర్వాహకులు కోరితే నిర్వహిస్తామన్నారు. పాఠశాలలు, ఆస్పత్రులు, షాపింగ్‌మాల్స్ నిర్వాహకులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు. అందుకుగాను 040–29555500 లేదా 9000113667 నెంబర్‌కు ఫోన్ చేయవచ్చునని తెలిపారు.

వెయ్యి రోబోటిక్ సర్జరీలతో ఏఐఎన్‌యూ ఘనత

- యూరాలజీ, యూరో–ఆంకాలజీ, నెఫ్రాలజీ విభాగాల్లో సర్జరీలు
- అసాధారణ ఘనతగా నిలిచిపోతుందన్న ఏఐఎన్‌యూ మేనేజింగ్ డైరెక్టర్



సాక్షి, సిటీబ్యూరో: యూరాలజీ, నెఫ్రాలజీ విభాగాల్లో దేశంలోనే అత్యుత్తమ సేవలందిస్తున్న ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్‌యూ) ఆధ్వర్యంలో వెయ్యి రోబోటిక్ సర్జరీలను విజయవంతంగా పూర్తి చేసిందని ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ సి.మల్లికార్జున తెలిపారు. రోగులకు మెరుగైన ఫలితాలు అందించేందుకు అధునాతన సాంకేతిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ యూరాలజీ, యూరో–ఆంకాలజీ, నెఫ్రాలజీ విభాగాల్లో వెయ్యి రోబోటిక్ సర్జరీలను పూర్తి చేయడం అసాధారణ ఘనతగా నిలిచిపోతుందన్నారు. మంగళవారం ఎర్రమంజిల్‌లోని ఓ హోటల్ జరిగిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ అత్యాధునిక రోబోటిక్ అసిస్టెడ్ సర్జికల్ విధానంతో శస్త్రచికిత్సల సమయంలో మరింత కచ్చితత్వం, నైపుణ్యం, విజువలైజేషన్ వస్తుందన్నారు. కిడ్నీ కేన్సర్, ప్రోస్టేట్ కేన్సర్, బ్లాడర్ కేన్సర్, మూత్రనాళ పునర్నిర్మాణం, మరమ్మతులు (రీకన్‌స్ట్రక్టివ్ యూరాలజీ) తదితర చికిత్సల్లో రోబోటిక్ సర్జరీలు చేశామన్నారు. తద్వారా మెరుగైన క్లినికల్ ఫలితాలు, రోగులకు శస్త్రచికిత్స తర్వాత ఇబ్బందులు తగ్గడం, తక్కువ రక్త నష్టం, వేగంగా కోలుకోవడానికి వీలు కల్పిస్తాయన్నారు. ఆపరేషన్ తర్వాత రోగి కోలుకునే తీరులో సంప్రదాయ శస్త్రచికిత్స, రోబోటిక్ శస్త్రచికిత్సల మధ్య తేడా స్పష్టంగా కనిపిస్తుందన్నారు. పూర్తి ప్రోస్టేక్టమీ చేసిన తర్వాత చాలామంది రోగులకు మూత్ర విసర్జనకు సంబంధించిన సమస్యలు ఉంటాయని, ముఖ్యంగా వారికి మూత్ర విసర్జనలో నియంత్రణ ఉండదన్నారు. రోబోటిక్ శస్త్రచికిత్సలో ఈ సమస్య పూర్తిగా పరిష్కారం అవుతుందన్నారు. అదే సాధారణ శస్త్రచికిత్సలో కొన్ని సున్నితమైన నరాలు దెబ్బతినడంతో భవిష్యత్‌లో పలు సమస్యలు ఎదురవుతాయని, రోబోటిక్ శస్త్రచికిత్సలో నరాలను జాగ్రత్తగా కాపాడటంతో వారికి ఈ సమస్య ఉండదని వివరించారు. రోబోటిక్ సర్జరీలో కిడ్నీ క్యాన్సర్ ప్రారంభ దశలో ఉన్నప్పుడు కణితిని మాత్రమే తొలగించి, కిడ్నీని కాపాడేందుకు అవకాశం ఉంటుందన్నారు. దేశంలో యూరలాజికల్ కేన్సర్లు., ముఖ్యంగా ప్రోస్టేట్ కేన్సర్ కేసులు పెరుగుతున్నాయని, మూత్ర పునరుత్పాదక వ్యవస్థలో కణితులు కూడా తరచూ వస్తున్నాయన్నారు. అత్యాధునిక ఇమేజింగ్ పద్ధతులతో ఈ కేన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించవచ్చన్నారు. అల్ట్రాసౌండ్ సదుపాయం పెరగడంతో కిడ్నీ కేన్సర్ గుర్తింపు కూడా సులభతరమైందన్నారు. రోబోటిక్ సర్జరీల ప్రాముఖ్యతపై ఏఐఎన్‌యూ ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీనియర్ యూరాలజిస్టు డాక్టర్ పీ సీ రెడ్డి వివరించారు. సంక్లిష్టమైన కేసుల్లో రోబోటిక్ సర్జరీలు చాలా కీలకమయ్యాయని, చేతి కదలికల్లానే ఉండటం, అతిసూక్ష్మమైన ప్రాంతాలకూ వెళ్లగలగడం, రక్తనష్టం ఎక్కువ లేకపోవడం ఇందులోని సానుకూలతలన్నారు. సర్జికల్ రోబోలకు త్వరలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ జతకావడంతో వాటి సామర్థ్యం మరింత పెరుగుతుందని ఆయన వివరించారు.

‘మధ్యాహ్న భోజనం’ కాంట్రాక్టు ఇప్పిస్తానని...

- రూ. 4 కోట్లు వసూలు
- ఫోర్జరీ జీఓతో టోకరా
- నిందితుడు అరవింద్ అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: మధ్యాహ్న భోజన పథకం (మిడ్ డే మిల్స్)కి సంబంధించిన కాంట్రాక్టు ఇప్పిస్తానని నమ్మించి, ఫోర్జరీ జీవోలు తయారు చేసి రూ. 4 కోట్లు మోసం చేసిన వ్యక్తిని హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. జగిత్యాలకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు అరవింద్ అలిశెట్టి సోషల్‌మీడియా యాక్టివిస్ట్‌గా పనిచేస్తున్నాడు. బీఆర్ఎస్‌కు చెందిన ప్రముఖ నాయకులతో ఫొటోలు దిగి వాటితో ప్రచారం చేసుకుంటూ ఉంటాడు. ఈ క్రమంలోనే బంజారాహిల్స్‌కు చెందిన వ్యాపారి బొల్లినేని ధనుష్‌తో పరిచయం ఏర్పడింది. మిడ్ డే మిల్స్ పథకానికి సంబంధించిన కాంట్రాక్టు ఇప్పిస్తానంటూ ధనుష్ ను నమ్మించాడు. కాంట్రాక్టు ఇప్పించినట్లు ప్రభుత్వం నుంచే జీవో తెస్తానంటూ మాయమాటలు చెప్పాడు. పాత జీవో కాపీలను ఫోర్జరీ చేసి, ధనుష్‌కు కాంట్రాక్టు వచ్చినట్టు చెప్పాడు. అతడి మాటలు నమ్మిన ధనుష్ రూ. 4 కోట్లు ఇచ్చాడు. ఈ క్రమంలోనే తెలిసిన వారి ద్వారా ఇటీవల ఇలాంటి జీఓలు రాలేదన్న విషయం తెలుసుకున్న ధనుష్ అరవింద్‌ను నిలదీశాడు. ప్రభుత్వం జీవో ఇచ్చిందని, నీకు వర్క్ ఆర్డర్ ఇవ్వకుంటే నేనేమి చేయాలంటూ దబాయింపులకు దిగాడు. దీంతో బాధితుడు సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు బాధితుడికిచ్చిన జీవో నిజమైందా? కాదా? అనే విషయాన్ని నిర్ధారించేందుకు ప్రాథమిక దర్యాప్తులో భాగంగా విద్యాశాఖ అధికారుల వివరణ కోరారు. అయితే ఇది నకిలీ జీవో అని అలాంటి జీవోలు ప్రభుత్వం విడుదల చేయలేదంటూ విద్యాశాఖ అధికారులు స్పష్టం చేయడంతో దీంతో కేసు నమోదు చేసిన సీసీఎస్ పోలీసులు మంగళవారం నిందితుడు అరవింద్‌ను అరెస్ట్ చేశారు. పోలీసుల విచారణలో తానే ఫేక్ జీఓ తయారు చేసినట్లు నిందితుడు అంగీకరించినట్లు తెలిసింది. నగర జాయింట్ సీపీ (క్రైమ్స్) రంగనాథ్ నేతృత్వంలోని బృందం ఈ కేసు దర్యాప్తు చేస్తుంది.

నేడు ‘ఈ-కామర్స్ ఎక్స్‌పోర్ట్స్’పై సదస్సు

బాలానగర్: బాలానగర్‌లోని ఎంఎస్ఎంఈ కార్యాలయంలో ఈ కామర్స్ ఎక్స్‌పోర్ట్స్‌పై బుధవారం ఒక్క రోజు సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ ఎంవీ సుధీర్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంఎస్ఎంఈ, ఎఫ్ఐసీసీఐ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సును ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఎంఎస్ఎంఈ బాలానగర్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

224 మంది ఆకతాయిలకు అరదండాలు

సాక్షి, సిటీబ్యూరో: నెల రోజుల వ్యవధిలో 224 మంది ఆకతాయిలకు అరదండాలు పడ్డాయి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో మహిళలను వేధిస్తున్న పోకిరీలను సాక్ష్యాధారాలతో సహా పట్టుకుని న్యాయస్థానంలో హాజరు పరిచారు. వారి తల్లిదండ్రుల సమక్షంలో ఎల్బీనగర్‌లోని సీపీ కార్యాలయంలో మంగళవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. డిసెంబర్ నెలలో ఫోన్ల ద్వారా వేధించినవి 60, వాట్సాప్ కాల్స్, మెసేజ్‌లతో 120, సామాజిక మాధ్యమాల ద్వారా 60, నేరుగా 50 ఫిర్యాదులు అందాయన్నారు. వీటిలో 12 క్రిమినల్ కేసులు, 131 ఈ–పెట్టీ కేసులు నమోదు చేశామని, 84 మందికి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. పట్టుబడిన వారిలో 140 మంది మేజర్లు, 84 మంది మైనర్లు ఉన్నారన్నారు. మీర్‌పేట్‌లో బాల్య వివాహం జరుగుతున్నట్లు సమాచారం అందడంతో వనస్థలిపురం షీ టీమ్, జిల్లా బాలబాలికల సంరక్షణ విభాగం అధికారులతో కలిసి అడ్డుకున్నట్లు తెలిపారు. మెట్రో రైళ్లలో డెకాయ్ ఆపరేషన్స్ నిర్వహించి, మహిళల కంపార్ట్‌మెంట్‌లోకి ఎక్కిన 8 మందిని పట్టుకున్నామని, మెట్రో స్టేషన్ అధికారులకు జరిమానా విధించామన్నారు. కార్యక్రమంలో ఏసీపీ వెంకటేశం, ఇన్‌స్పెక్టర్ పీ పరశురాం, అడ్మిన్ ఎస్ఐ రాజు, షీ టీమ్స్ సిబ్బంది, కౌన్సిలర్లు శాంతిప్రియ, రమ్య, శ్యామల గౌరి తదితరులు పాల్గొన్నారు.

మేకులు మింగిన ఖైదీ

తొలగించిన ఉస్మానియా వైద్యులు



కడుపులో నుంచి తొలగించిన మేకులు

అఫ్జల్‌గంజ్: మేకులు మింగిన ఖైదీ కడుపులో నుంచి మేకులు తొలగించిన ఉస్మానియా వైద్యుల బృందం అతడిని ప్రాణాపాయం నుంచి కాపాడారు. కడుపు నొప్పితో బాధపడుతున్న ఖైదీ ఎండీ సోహైల్ (21)ను ఎస్కార్టు పోలీసులు ఈ నెల 8న చికిత్స నిమిత్తం ఉస్మానియాలో ఆస్పత్రిలో చేర్పించారు. జనరల్ సర్జరీ యూనిట్–7 వైద్యులు ఇన్ పేషెంట్‌గా చేర్చుకొని ఎక్స్‌రే, పలు రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్యులు రమేష్ కుమార్, జనరల్ సర్జరీ వైద్యులతో కలిసి ఎండోస్కోపి వైద్య పరికరం ద్వారా ఖైదీ కడుపులోని మేకులను తొలగించారు. ప్రస్తుతం ఖైదీ ఆరోగ్యం నిలకడగా ఉందని, త్వరలోనే డిశ్చార్జి చేస్తామని డాక్టర్ నాగేందర్ పేర్కొన్నారు.

నిరంతరం కొత్త విషయాలు తెలుసుకోవాలి



ల్యాప్‌ట్యాప్‌లు తీసుకున్న విద్యార్థులతో గవర్నర్ తమిళిసై ..

పంజగుట్ట: ఒక పేద విద్యార్థికి సాధికారత కల్పించడం ద్వారా మూడు తరాల ఆలోచనలను సానుకూలంగా మార్చవచ్చునని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. మంగళవారం రాజ్‌భవన్‌లో అక్షయ విద్యా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబాలకు చెందిన 100 మంది విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ .. విద్యార్థులు జీవితాంతం కొత్త విషయాలు నేర్చుకునేందుకు ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు. ఇప్పటికే రాజ్‌భవన్ ఆధ్వర్యంలో వెయ్యి మంది నిరుపేద విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేసినట్లు తెలిపారు. అక్షయ విద్యా ఫౌండేషన్ లాంటి సంస్థలు పేద విద్యార్థులను ఆదుకునేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎస్.జనార్దన్, అకడమిక్ అడ్వైజర్, సభ్యులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో ట్రాఫిక్ కానిస్టేబుల్

రూ.5వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత



వికాస్ కుమార్ యాదవ్ (ఫైల్)

హిమాయత్‌నగర్: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో సీజ్ చేసిన బైక్‌ను విడుదల చేసేందుకు లంచం తీసుకుంటున్న ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ ఏసీబీకి పట్టుబడ్డాడు. ఏసీబీ అధికారుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. టోలీ చౌకీ ప్రాంతానికి చెందిన ఖాజా హబీబుద్దీన్ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పోలీసులకు చిక్కాడు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశారు. సీజ్ చేసిన బైక్‌ను విడుదల చేసేందుకు నారాయణగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న వికాస్ కుమార్ రూ.5వేలు లంచం డిమాండ్ చేశాడు. బాధితుడి నుంచి మంగళవారం నగదు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

భర్త మరణాన్ని జీర్ణించుకోలేక..

భార్య ఆత్మహత్య



అస్మిత సింగ్ (ఫైల్)

అబిడ్స్: భర్త మరణాన్ని తట్టుకోలేక ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ధూల్‌పేట ఆరంఘర్‌కాలనీలో మంగళవారం చోటుచేసుకుంది. మంగళ్‌హాట్ ఎస్ఐ.సాయికృష్ణ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రహీంపురాకు చెందిన అమన్‌కుమార్ సింగ్, ఆరంఘర్ కాలనీకి చెందిన అస్మితసింగ్ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. అమన్‌కుమార్ సింగ్ గత నెల 26న బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందాడు. భర్త మరణాన్ని జీర్ణించుకోలేక అస్మిత డిప్రెషన్‌కు లోనైంది. మంగళవారం మధ్యాహ్నం గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుంది. దీనిని గుర్తించిన కుటుంబసభ్యులు ఆమెను కిందకు దించి ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మంగళ్‌హాట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జ్యోతిర్లింగ సహిత దివ్యదక్షిణ యాత్రకు భారత్ గౌరవ్ రైలు

సాక్షి, సిటీబ్యూరో: ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో జ్యోతిర్లింగ సహిత దివ్య దక్షిణ యాత్రకు మరో భారత్‌గౌరవ్ రైలు అందుబాటులోకి రానుంది. ఈ రైలు నెల 23న సికింద్రాబాద్ నుంచి బయలుదేరి 31న తిరిగి చేరుకోనుంది. ఈ పర్యటనలో తమిళనాడు, కేరళలోని పలు ప్రాంతాలను సందర్శించవచ్చు. 9 రోజుల పాటు సాగే ఈ యాత్రలో తెలుగు రాష్ట్రాలకు చెందిన యాత్రికులకు జ్యోతిర్లింగ (రామేశ్వరం)ప్రత్యేక దర్శనం లభించనుంది. పర్యాటక ప్రదేశాలైన తిరువణ్ణామలై, మధురై, కన్యాకుమారి, త్రివేంద్రం, తిరుచ్చి, తంజావూరు, తదితర ప్రాంతాలను సందర్శించవచ్చు. సికింద్రాబాద్, కాజీపేట, వరంగల్, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్లలో ప్రయాణికులకు హాల్టింగ్ సదుపాయం ఉంది.ఈ పర్యటనలో ప్రయాణికులకు భోజనం, వసతి, తదితర అన్ని సదుపాయాలు లభిస్తాయి. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్...భారత్ గౌరవ్ టూరిస్ట్ సర్క్యూట్ రైళ్లు తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రయాణికులను విశేషంగా ఆకట్టుకున్నాయన్నారు. ఈ రైళ్లు మనదేశ గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని, అద్భుతమైన చారిత్రక ప్రదేశాలను సందర్శించే అవకాశాన్ని కల్పిస్తాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకుని రామేశ్వరంలోని జ్యోతిర్లింగ దర్శనం చేసుకోవాలని కోరారు. ఆసక్తిగల ప్రయాణికులు ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్: http://www.irctctourism.com ను సందర్శించవచ్చు. లేదా ఫోన్: 040–27702407, 9701360701 నంబర్లను సంప్రదించవచ్చు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: శ్రీరామ్‌నగర్, సూర్యోదయ కాంప్లెక్స్ 11కేవీ ఫీడర్ల కళ్యాణ్‌నగర్, హెచ్‌పీఎస్ సబ్‌స్టేషన్ల పరిధిలో జరుగుతున్న మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు రాజీవ్‌నగర్, శ్రీరామ్‌నగర్, సూర్యోదయ కాంప్లెక్స్, నల్లీశిల్క్ శారీస్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు గ్రీన్ లాండ్స్ సీబీడీ ఏడీఈ కిశోర్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాజీవ్‌నగర్, సెలబ్రిటీ క్లబ్, వరుణ్ టవర్స్, మినిస్టర్ రోడ్డు 11కేవీ ఫీడర్ల మోతీనగర్, ప్రకాష్‌నగర్, హెచ్‌పీఎ, సంజీవయ్యపార్కు సబ్‌స్టేషన్ల పరిధిలో జరుగుతున్న మరమ్మతుల కారణంగా కళ్యాణ్‌నగర్, రాజీవ్‌నగర్, బీఎస్‌పురి, సెరివెల్ కో- ఆపరేటివ్ ఏరియా, జయంతీనగర్, శ్రీరామ్‌నగర్, చికోటీ గార్డెన్, వరుణ్ టవర్స్, సొనాటా, కట్టమైసమ్మ దేవాలయం, ఉమెన్స్ డిగ్రీ కాలేజీ, సూర్యోదయ బిల్డింగ్స్, జీ.ఈ.బిల్డింగ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

- స్టార్ హాస్పిటల్, సవేరా 11కేవీ ఫీడర్లు, రోడ్-13, ఎల్లారెడ్డిగూడ సబ్‌స్టేషన్ల పరిధిల్లో జరుగుతున్న మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కార్వీ బిల్డింగ్, స్టార్ ఆసుపత్రి, శ్రీకంచి, ఎస్‌కేనగర్, యూసుఫ్‌గూడ బస్తీ, జీహెచ్‌ఎంసీ ఆఫీస్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని బంజారాహిల్స్ సీబీడీ ఏడీఈ శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.
- నందారీ, సీ-బ్లాక్ 11కేవీ ఫీడర్లు, రోడ్డు-13, యూసుఫ్‌గూడ సబ్‌స్టేషన్ల పరిధిల్లో జరుగుతున్న మరమ్మతుల కారణంగా నందారి టెంట్‌హౌస్, అజారుద్దీన్ ఇల్లు, శ్రీకంచి బిల్డింగ్, పెద్ద మసీదు, సి-బ్లాక్ ఏరియాల్లో మధ్యాహ్నం 12.30 నుంచి 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు.
- తాతారావు, కమాండెంట్ 11కేవీ ఫీడర్లు, నిమ్స్, శ్రీకృష్ణానగర్ సబ్‌స్టేషన్ల పరిధిల్లో జరుగుతున్న మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోస్టాఫీస్ ఎదురు, రోడ్డు-14, హనుమాన్ టెంపుల్, చీఫ్ జస్టిస్ ఇల్లు, పోలీస్‌లైన్, గాయత్రీహిల్స్, మసీదులైన్, ట్రాఫిక్ పీఎస్ జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

టూరిజం నూతన సీఎండీకి శుభాకాంక్షలు



హిమాయత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు నూతనంగా సీఎండీగా నియమితులైన ఐపీఎస్ కె.రమేష్ నాయుడికి ఆ శాఖ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. హిమాయత్‌నగర్‌లోని టూరిజం కార్యాలయంలో యూనియన్ అధ్యక్షుడు వి.ఎస్.బోస్, ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జ్యోతి, రమేష్‌బాబు, శ్రీను, నాసర్ అలీ, హైమా, రచన, మధురారెడ్డి, నేత్ర, రాజలక్ష్మి, మోజిద్, ఖలీల్, రవి, విజయ్‌కుమార్ తదితరులున్నారు.

పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించండి



ఉదయ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో ఇలా..

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-11లోని ఉదయ్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో గత కొద్ది రోజులుగా పారిశుద్ధ్య సమస్య వేధిస్తోంది. పలుసార్లు పాఠశాల సిబ్బంది ఇక్కడి సమస్యపై సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించినా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. చెత్త కుప్పల నడుమ విద్యార్థులు పాఠాలు చదువుకోవడంతో పాటు మధ్యాహ్నం భోజనాన్ని చేయాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాఠశాలలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

నియామకం



పునీత్‌కుమార్

ఖైరతాబాద్: ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఎస్సీసెల్ చైర్మన్‌గా ఎస్.పునీత్‌కుమార్ నియమితులయ్యారు. తెలంగాణప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీసెల్ చైర్మన్ ప్రీతం ఈ మేరకు నియామకపత్రాన్ని ఆయనకు అందజేశారు. కాంగ్రెస్‌లో 2004 నుంచి విద్యార్థి విభాగం, యువజన కాంగ్రెస్, సిటీ కాంగ్రెస్, స్టేట్ యూత్ కాంగ్రెస్‌లో పనిచేసిన తనకు మరోసారి బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషిచేస్తూ.. ప్రభుత్వ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు చేరేలా చూస్తానని వివరించారు.

అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించాలి



లిబర్టీ: అన్ని వర్గాల ఉన్నతాధికారులను ప్రభుత్వ పాలన అవసరాల కోసం నియమించాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణస్వరూప్ విజ్ఞప్తి చేశారు. వివిధ ప్రభుత్వ శాఖలు ముఖ్య అధికారులను జిల్లా కలెక్టర్లను వివిధ కార్పొరేషన్ల అధికారులను అన్ని సామాజిక వర్గాలను నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. అధికారుల నియామకం సందర్భంగా ఒకే సామాజికవర్గానికి చెందిన అధికారులను నియమించకూడదని, ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ ఇలా అన్ని వర్గాలకు అధికారులను సముచిత స్థానం కల్పించాలని విన్నవించారు.

సినీనటిపై దాడి..తీవ్ర గాయాలు

బంజారాహిల్స్: పెళ్లి చేసుకుంటానని నమ్మించి తన గదికి పిలిపించి సినీనటిపై దాడి చేసిన ఘటనలో నిందితులపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..మూసాపేట ఆంజనేయనగర్‌లో నివసించే సినీనటి (23) కొన్నేళ్లుగా శ్రీనగర్‌కాలనీ గణపతి కాంప్లెక్స్‌లో నివసించే గంగినేని గణేష్‌ను ప్రేమిస్తోంది. ఇటీవల వీరి మధ్య విబేధాలు రాగా ఎవరికి వారుగా ఉంటున్నారు. ఈ నెల 7న గణేష్ ఆమెకు ఫోన్ చేసి చిల్కూరు బాలాజీ టెంపుల్‌లో పెళ్లి చేసుకుంటానని నమ్మించి తన ఇంటికి రమ్మన్నాడు. ఆమె అక్కడికి రాగానే అప్పటికే అక్కడ సిద్ధంగా ఉన్న గణేష్ తన సోదరులు శ్రీను, వంశీ, శ్రీకాంత్, అక్షయ్‌తో కలిసి ఆమె బైక్‌పై మైత్రీవనం ప్రాంతానికి తీసుకెళ్లి ఫోన్‌ను ధ్వంసం చేయడమేగాక ఆమెను తీవ్రంగా కొట్టారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు గణేష్‌తో పాటు శ్రీను, వంశీ, శ్రీకాంత్, అక్షయ్‌లపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ప్రధాన నిందితుడు గణేష్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

హిమాయత్‌నగర్: అనారోగ్యంతో వ్యక్తి మృతి చెందిన ఘటన నారాయణగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై శిరీష తెలిపిన వివరాల ప్రకారం.. శివాజీనగర్‌లో ఫుట్‌పాత్‌పై ఉంటున్న శ్యామ్ (40) దినసరి కూలీగా పనిచేస్తూ.. జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం నారాయణగూడ ఫ్లై ఓవర్ కింద ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా.. అతడు అప్పటికే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇప్పటికే మృతి చెందారని, అప్పటి నుంచి ఫుట్‌పాత్‌పైనే జీవనం సాగిస్తున్నట్లు వివరించారు. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఓటరు నమోదుకు మరో ఛాన్స్

- ముసాయిదా అభ్యంతరాలపై ఈనెల 21న ఆఖరు గడువు
- ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితా



ఓటరు జాబితాను పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ సర్కిల్-18 డీఎంసీ ప్రశాంతి

బంజారాహిల్స్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఖైరతాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన ఓటరు ముసాయిదా జాబితాను మూడ్రోజుల క్రితం ప్రకటించారు. ఓటరు ముసాయిదా జాబితాను పరిశీలన నిమిత్తం అన్ని కార్యాలయాల్లో అందుబాటులో ఉంచారు. ఖైరతాబాద్‌లో మొత్తం 2,97,666 మంది ఓటర్లు కాగా.. వీరిలో పురుషులు 1,54,772, మహిళలు 1,42,858, ఇతరులు 36 మంది ఉన్నారు. ఓటరు జాబితాలో తప్పులు సరిచేసుకునేందుకు గడువు విధించారు. 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఫారం-6 ద్వారా నూతన ఓటరుగా నమోదు చేసుకోవచ్చని వివరించారు. అభ్యంతరాలుంటే ఫారం-7 ద్వారా తెలపాలని అధికారులు సూచించారు.

- ఓటరు స్థానచలనం తదితర మార్పుల కోసం ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఓటరు తుదిజాబితాను ఫిబ్రవరి 8న ప్రచురిస్తామని, వాటి ఆధారంగానే పార్లమెంట్ ఎన్నికలు నిర్వహిస్తామని జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేష్ దోత్రే తెలిపారు.

మార్పులు చేర్పులకు అవకాశం..

- ఓటరు ముసాయిదా జాబితా ప్రకటించిన తర్వాత మరోసారి కొత్తగా ఓటు నమోదు చేసుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండినవారు కొత్త ఓటరుగా జాబితాలో పేరు నమోదుతో పాటు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం కల్పించారు.
- పేర్లలో తప్పులు, చిరునామా మార్పు, తొలగింపు, ఇతర పొరపాట్లపను సరిదిద్దుకునేందుకు ఈనెల 21వ తేదీ వరకు అవకాశం కల్పించారు. ప్రకటించిన ముసాయిదా జాబితాపై ఏవైనా అభ్యంతరాలుంటే ఈనెల 21 తర్వాత వారం రోజుల్లో పరిష్కరిస్తారు.

20, 21 తేదీల్లో ప్రత్యేక నమోదు..

- ఈ నెల 20, 21 తేదీల్లో రెండ్రోజుల పాటు ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని 245 పోలింగ్‌బూత్‌ల వారీగా ప్రత్యేక ఓటరు నమోదుకు అవకాశం కల్పించారు. బూత్‌లెవల్ ఆఫీసర్లు ఈ రెండ్రోజుల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలింగ్‌బూత్‌లలో అందుబాటులో ఉంటారు.

సద్వినియోగం చేసుకోవాలి

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కొత్త ఓటరు నమోదుకు ఎన్నికల సంఘం అవకాశం ఇచ్చింది. దీనిని అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలి. 2024 జనవరి 1వ తేదీ వరకు 18 ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా నమోదు చేసుకోవాలి. ఆన్‌లైన్‌లోనూ ఓటు నమోదుకు అవకాశం కల్పించారు. ముసాయిదా ఓటరుజాబితాలో అభ్యంతరాలు ఉంటే జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో అందించవచ్చు. ఈ నెల 21వ తేదీ వరకు అవకాశం ఉంది. అభ్యంతరాలను ఈ నెలాఖరు వరకు పరిష్కరించి ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితాను ప్రకటించడం జరుగుతుంది.

– ప్రశాంతి, ఉప కమిషనర్, జీహెచ్‌ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్-18

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఆటో సంఘాల ప్రతినిధులు

హిమాయత్‌నగర్/పంజగుట్ట: ఆటో డ్రైవర్లను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని అఖిల భారత అసంఘటిత కార్మికులు, ఉద్యోగుల కాంగ్రెస్ (కేకేసీ) చైర్మన్ కౌషల్ సమీర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కేకేసీ చైర్మన్ కౌషల్ సమీర్ ఆధ్వర్యంలో ఐఎన్టీయూసీ నాయకులు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. ఎన్నికల హామీలో భాగంగా రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామన్నారు. దీంతో కొన్ని ప్రతిపక్ష ఆటో సంఘాలు కావాలనే రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలు ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం మానుకోవాలని, ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టవద్దని సూచించారు. పండుగ అనంతరం అన్ని సంఘాలతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారని చైర్మన్ తెలిపారు. కేకేసీ వైస్ చైర్మన్ వేణు, ప్రధాన కార్యదర్శి పింగిలి సంపత్‌రెడ్డి, ఆటో విభాగం ప్రధాన కార్యదర్శి రుద్రాక్ష మల్లేష్, ఐఎన్టీయూసీ నాయకులు నర్సింహ్మారెడ్డి, గోదా మల్లేష్‌గౌడ్ తదితరులున్నారు.

కల్తీ ఆహారాల తయారీపై చర్యలు తీసుకోవాలి

స్వాభిమాన్ పరిషత్ డిమాండ్

హిమాయత్‌నగర్: రాష్ట్రాన్ని కల్తీరహితంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని స్వాభిమాన్ పరిషత్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వినయ్‌కిషోర్‌యాదవ్ డిమాండ్ చేశారు. కల్తీలేని ఆహారపదార్థాల నిషేధం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛంద సంస్థలతో కమిటీని ఏర్పాటు చేసి కల్తీ నిరోధానికి కృషి చేయాలని కోరారు. మంగళవారం బషీర్‌బాగ్‌లో ఆయన మాట్లాడుతూ.. నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో (ఎన్సీఆర్‌బీ) లెక్కల ప్రకారం దేశంలోని 19 ముఖ్య నగరాల్లో కల్తీ ఆహార పదార్థాలపై 291 కేసులు నమోదు కాగా.. వీటిలో 246 కేసులు హైదరాబాద్‌లోనే నమోదయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. సాంకేతిక రంగంలో దూసుకుపోతున్న నగరంలో అన్ని కల్తీతో కూడిన ఆహార పదార్థాలు తయారుచేయడం దారుణమన్నారు. కల్తీ ఆహారపదార్థాల తయారీకి పాల్పడుతున్న నిర్వాహకులపై ప్రభుత్వాలు ఉక్కుపాదం మోపి కఠినంగా శిక్షించాలని, రాష్ట్ర వ్యాప్తంగా స్వచ్ఛ నిర్ధారణ కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రజలకు కల్తీపై పూర్తిగా అవగాహన కల్పించాలని డిమాండ్ చేశారు. పరిషత్ ప్రతినిధులు, న్యాయవాదులు సిరిగిరి ప్రభాకర్, ప్రమోద్, రాజేష్, వెంకటేష్, అనుప్ తదితరులున్నారు.

కేంద్ర సెన్సార్ బోర్డు సలహా ఫ్యానల్ సభ్యుడిగా కౌశిక్‌రామ్



శ్రీనగర్‌కాలనీ: కేంద్ర చలనచిత్ర సెన్సార్ బోర్డు సలహా ఫ్యానల్ సభ్యుడిగా నగరానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త మద్దాలి కౌశిక్‌రామ్ నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపత్రాలను అందుకున్నారు. రెండేళ్లపాటు ఈ పదవిలో ఆయన కొనసాగనున్నారు. టెంపుల్ బెల్ సంస్థ ఆధ్వర్యంలో ఎన్నో విభిన్న సంగీత కార్యక్రమాలను కౌశిక్‌రామ్ నిర్వహించారు. కేంద్ర సెన్సార్‌బోర్డుకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

టీటీడీ అడ్వైజరీ కమిటీ వైస్‌చైర్మన్‌గా రాఘవేంద్ర



శ్రీనగర్‌కాలనీ: తిరుమల తిరుపతి దేవస్థానం అడ్వైజరీ కమిటీ వైస్‌చైర్మన్‌గా గోషామహల్‌కు చెందిన మెట్టు రాఘవేంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపత్రాన్ని చైర్మన్ రవిప్రసాద్‌కు అందజేశారు. పలువురు నేతలు మెట్టు రాఘవేంద్రకు అభినందనలు తెలిపారు. ఏఈఓ రమేష్, కొమిటిరెడ్డి లక్ష్మి, మెట్టు ప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు సన్మానం



లిబర్టీ: కాంగ్రెస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గడ్డం వినోద్‌ను ఆర్‌పీఐ జాతీయ కార్యదర్శి చొప్పరి బాలకృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. దళితుల అభ్యున్నతి, సంక్షేమం కోసం గడ్డం వినోద్ కృషి చేస్తారని బాలకృష్ణ ఆశాభావం వ్యక్తం చేశారు.

దళితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

హిమాయత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు దళితులకు ఇచ్చిన వాగ్దానాలను చిత్తశుద్ధితో అమలు చేయాలని, దళితుల జీవితాల్లో సమూల మార్పులు తీసుకొచ్చేలా దళితుల ఆకాంక్షలు నెరవేర్చాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం హిమాయత్‌నగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం దళితులకు ఇచ్చిన వాగ్దానాలను గాలికి వదిలేసిందని ఆరోపించారు. యేసురత్నం, రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షుడు లక్ష్మణ్, రాజ్‌కుమార్, కుమార్, లక్ష్మీపతి, శ్రీనివాస్, రత్నకుమారి, సుగుణ, ఉషశ్రీ, సహదేవ్, వెంకటస్వామి,రాజరత్నం తదితరులు పాల్గొన్నారు.

రామా శ్రీనివాస్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు

పంజగుట్ట: మోక్షరామా ఫౌండేషన్, అమ్మఒడి పేరుతో ఎన్నో సేవా కార్యక్రమాలు చేసిన వరంగల్‌కు చెందిన రామా శ్రీనివాస్ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి వార్త తెలియగానే తెలంగాణభవన్ నుంచి మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావులు హుటాహుటిన సోమాజిగూడలోని ఆయన నివాసానికి చేరుకుని నివాళులర్పించారు. అమ్మఒడి పేరుతో ఎంతోమంది అనాథలు, వృద్ధులకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారని ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు.

ఎన్‌డీఏ, 'ఇండియా'కు ప్రత్యామ్నాయంగా థర్డ్ ఫ్రంట్

పంజగుట్ట: నూతన రాజకీయ, ఆర్థిక విధానాలతో యూనియన్ స్టేట్స్ ఆఫ్ సోషలిస్టు అలయన్స్ థర్డ్ ఫ్రంట్ పనిచేస్తుందని ఫ్రంట్ అధ్యక్షుడు దేవరపల్లి మహేష్ అన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఇండియన్ ప్రజా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు కే.బి. శ్రీధర్, సామాజిక తెలంగాణ రాష్ట్ర సమితి అధ్యక్షుడు పోకల కిరణ్‌కుమార్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లుతో కలిసి మాట్లాడారు. జాతీయ స్థాయిలో ప్రస్తుతం ఉన్న ఎన్‌డీఏ, ఇండియా కూటమికి ప్రజల అవసరాలు తీర్చే ఏ అంశమూ చెప్పకుండా కేవలం ఓట్లకోసం రాజకీయం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరికి ప్రత్యామ్నాయంగా తమ మూడో ఫ్రంట్ ఉంటుందన్నారు. నూతన ఆర్థిక విధానంతో పేదరికం లేని సమాజాన్ని రూపొందిస్తామన్నారు. ఈనెల 25వ తేదీ వరకు పూర్తి స్పష్టత వస్తుందని 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా అన్ని రాష్ట్రాలకు అనుకూలంగా ఉండే ఓ ప్రణాళిక ప్రకటిస్తామన్నారు.

అభయహస్తం ఆన్‌లైన్ నమోదు పరిశీలన



పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్



ఉదయ్‌నగర్ సరస్వతీస్కూల్‌లో ఆన్‌లైన్ దరఖాస్తుల నమోదు

జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్

బంజారాహిల్స్: ప్రజాపాలన దరఖాస్తుల డేటా ఎంట్రీని తప్పులు లేకుండా చూడాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ ఖైరతాబాద్ జోన్ కార్యాలయంలో డేటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. డేటా ఎంట్రీలో తప్పులు లేకుండా పారదర్శకంగా ఎంట్రీ చేయాలని సూచించారు. ఒక్కొక్క దరఖాస్తుకు పట్టే సమయాన్ని ఆపరేటర్ను అడిగి తెలుసుకున్నారు. రోజుకు కేటాయించిన కంటే ఎక్కువగా డేటా ఎంట్రీ చేయాలని కమిషనర్ ఆదేశించారు. డేటా ఎంట్రీ చేసిన అప్లికేషన్ తానే స్వయంగా పరిశీలించారు. అడిషనల్ కమిషనర్ ఐటీ స్నేహ శబరిష్, జోనల్ కమిషనర్ వెంకటేష్, దోత్రే తదితరులున్నారు.

- కమిషనర్ అంతకు ముందు ప్రజాభవన్‌కు వెళ్లి ప్రజావాణి నోడల్ అధికారి మున్సిపల్శాఖ సీ.ఎం.డీ.ఏ దివ్యతో కలిసి ప్రజావాణి ఏర్పాట్లను పరిశీలించారు.

పాఠశాలల కంప్యూటర్ ల్యాబ్‌లలో..

బంజారాహిల్స్: నిర్ణీత గడువులోగా అభయహస్తం దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ అధికారులు మరింత వేగవంతం చేశారు. దీనిలో భాగంగా మంగళవారం నుంచి పాఠశాలల్లోని కంప్యూటర్ ల్యాబ్‌లను అభయహస్తం ఆన్‌లైన్ నమోదు కోసం వినియోగంలోకి తీసుకొచ్చారు. ఖైరతాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, కళాశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌లను తీసుకుని రాత్రి, పగలూ.. తేడా లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. మంగళవారం జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేష్ దోత్రే, జూబ్లీహిల్స్ సర్కిల్ ఉప కమిషనర్ ప్రశాంతిలు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. పారదర్శకంగా ప్రణాళిక ప్రకారం నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఆన్‌లైన్ నమోదుకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా సంబంధిత సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

రేషన్‌షాపుల ఎదుట పడిగాపులు



బంజారాహిల్స్ రోడ్డునెంబర్-10 ఉదయ్‌నగర్‌లో ఇలా..



రోడ్డునెంబర్-12లో ఎన్‌బీటీనగర్ రేషన్‌షాపు ముందు..

బంజారాహిల్స్: ఎన్నికల నేపథ్యంలో ఈసారి రేషన్ పంపిణీ ఆలస్యమవడంతో మంగళవారం ఆయా రేషన్ షాపుల వద్ద వినియోగదారులు క్యూ కట్టారు. వారం రోజులుగా రేషన్ పంపిణీ లేకపోవడంతో ఒక్కసారిగా కార్డుదారులు రావడంతో రేషన్ దుకాణ పరిసరాలు కిటకిటలాడాయి. సంక్రాంతి పండుగ సమీపిస్తుండటంతో బియ్యం కోసం తెల్ల రేషన్‌కార్డుదారులు భారీగా వచ్చి షాపుల ముందు బారులు తీరారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో షాపులన్నీ కిటకిటలాడాయి. ఖైరతాబాద్ రేషనింగ్ సర్కిల్-7 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వేంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, యూసుఫ్‌గూడ, రహ్మత్‌నగర్, ఎర్రగడ్డ, వెంగళరావు, బోరబండ, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్‌ల పరిధిలో ఉన్న 85 రేషన్ దుకాణాల వద్ద ఇదే పరిస్థితి కనిపించింది. మరో రెండ్రోజులు బియ్యం కోసం కార్డుదారులు పెద్దఎత్తున వచ్చే అవకాశం ఉండటంతో దుకాణదారులు తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

అజ్మీర్ దర్గాకు చాదర్ సమర్పణ



చాదర్‌ను పంపుతున్న అజహరుద్దీన్, కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి

బంజారాహిల్స్/రహమత్‌నగర్: అజ్మీర్ దర్గాకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ మహ్మద్ అజహరుద్దిన్ చాదర్ సమర్పించారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆయన రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షితో కలిసి నిర్వహించారు. ప్రతి ఏటా అజ్మీర్‌కు తాను చాదర్‌ను సమర్పించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో తాను మొక్కు చెల్లించుకున్నట్లు తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సోనియా కేంద్రంలో అధికారంలోకి రావడంతో పాటు రాహుల్ గాంధీ ప్రధాని కావాలని కోరుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ యూత్ లీడర్ మహ్మద్ అసదుద్దీన్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ సయ్యద్ అబ్దుల్ ఫహీమ్, అనిల్‌యాదవ్, రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి, మైనారిటీ నాయకులు సయిద్, ఇంతేయాజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

యాడ్ ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న న్యాయవాది రాపోలు భాస్కర్

పంజగుట్ట: జీహెచ్‌ఎంసీ పరిధిలో యాడ్ ఏజెన్సీ పేరుతో పెద్ద మాఫియా నడుస్తుందని దీనివల్ల ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి పెద్దఎత్తున గండి పడుతుందని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ అన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో యాడ్‌లవల్ల సంవత్సరానికి రెండు నుంచి మూడు కోట్ల ఆదాయం ప్రభుత్వానికి వచ్చే అవకాశం ఉన్నప్పటికీ కొంత మంది అధికారులు, బడా యాడ్ ఏజెన్సీ సంస్థలు కుమ్మక్కై కేవలం 150 కోట్లకే పరిమితం చేశారని ఆయన ఆరోపించారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ .. జంటనగరాల్లో యాడ్‌లపై ప్రభుత్వం జీవో 68 తీసుకొచ్చిందని, ఈ జీవో ఆధారంగా ఇష్టానుసారంగా యాడ్స్ వేసుకోవడం కుదరదన్నారు. 15 అడుగులలోపు మాత్రమే యాడ్స్ వేసుకునే అవకాశం ఉంటుందన్నారు. కొంత మంది అధికారులు, కొన్ని యాడ్ కంపెనీలతో చేతులు కలిపి జీవో 68కి తూట్లు పొడుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని కంపెనీలు టెండర్‌లో పాల్గొనేలా తగిన చర్యలు తీసుకోవాలని, అన్ని కంపెనీలు టెండర్లలో పాల్గొంటే ప్రభుత్వానికే ఆదాయం పెరుగుతుందన్నారు. శోభారెడ్డి,: గణేష్ పాల్గొన్నారు.

రెడ్‌మీ నోట్ 13 సిరీస్ ఫోన్ ఆవిష్కరణ



ఆవిష్కరణలో పాల్గొన్న సినీనటి అనన్య నాగళ్ల, సంస్థ ప్రతినిధులు

బంజారాహిల్స్: షావోమీ గ్లోబల్ సంస్థ సరికొత్త 5జీ హ్యాండెడ్ రెడ్ మీ నోట్ 13 సిరీస్ ఫోన్‌ను మంగళవారం సినీనటి అనన్య నాగళ్ల బంజారాహిల్స్‌లోని హ్యాపీ మొబైల్ స్టోర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తనకు మార్కెట్లోకి వచ్చే కొత్త గాడ్జెట్స్ అంటే ఎంతో ఇష్టమని వాటి గురించి, వాటి ఫీచర్ల గురించి ఎక్కువగా తెలుసుకునేందుకు ప్రయత్నిస్తానన్నారు. హ్యాపీ మొబైల్స్ సంస్థ సీఎంఓ పవన్, కోట సంతోష్, శరణ్, జోనల్ హెడ్ సయ్యద్ అన్వర్, మహ్మద్ ఇష్తికార్‌లు పాల్గొన్నారు.

బల్క్ ఫిర్యాదులు చంద్రబాబు కుట్రే

సీఈసీకి విజయసాయిరెడ్డి ఫిర్యాదు



సాక్షి, అమరావతి: విపక్ష నేత చంద్రబాబునాయుడి జీవితమంతా మోసం, కుట్ర, కుతంత్రాలతో నిండి పోయిందని వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వేణుంబాక విజయసాయిరెడ్డి దుయ్యబట్టారు. లక్షల ఓట్లను తొలగించాలంటూ కోనేరు సురేష్ ద్వారా ఎన్నికల కమిషన్‌కు బల్క్ ఫిర్యాదు చేయించారని ఆరోపించారు. కోనేరు సురేష్ ఇచ్చిన అబద్ధపు బల్క్ ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలని తాము డిమాండ్ చేశామన్నారు. టీడీపీ ఉద్దేశపూర్వకంగానే వైఎస్సార్‌సీపీ ఓట్లను టార్గెట్ చేసిందన్నారు. మరోవైపు దొంగ ఓట్ల చేర్పునకూ టీడీపీ పాల్పడుతోందన్నారు. 'మై పార్టీ డ్యాష్‌బోర్డ్ డాట్‌కామ్' పేరుతో చంద్రబాబు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతున్నారని ఆరోపించారు. అక్రమంగా అర్హుల ఓట్లు తొలగించేందుకు, దొంగ ఓట్ల చేర్పుకు చంద్రబాబు భారీ కుట్ర చేశారని చెప్పారు. ఓటరు కులం, రాజకీయ ప్రాధాన్యత అడిగే హక్కు బాబుకెవరిచ్చారు? అని నిలదీశారు. 'వన్ సిటిజన్.. వన్ ఓట్' అనేది తమ పార్టీ సిద్ధాంతం అని తెలిపారు. ఓటర్ ప్రొఫైల్ సర్వే పేరిట అభ్యంతరకర ప్రశ్నలపై సీఈసీకి ఫిర్యాదు చేశాం అని చెప్పారు. 6అంశాలపై సీఈసీని కలిశామన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ సభ్యులను కలిసిన అనంతరం మంగళవారం విజయవాడలో ఆయన ఎంపీ మార్గాని భరత్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు.

'కోర్టు ద్వారా లోకేశ్‌కు నోటీసులు ఇవ్వండి'


సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో కుంభకోణాలపై నమోదైన కేసుల దర్యాప్తును ప్రభావితం చేసేలా, కీలక సాక్షులను బెదిరించేలా వ్యాఖ్యలు చేసిన కేసులో నారా లోకేశ్‌కు నోటీసులు అందించాలని విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానం మంగళవారం కోర్టు అధికారులను ఆదేశించింది. నోటీసులు తీసుకునేందుకు నిరాకరించిన లోకేశ్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. రెడ్ డైరీ పేరుతో కీలక సాక్షులను బెదిరిస్తున్న లోకేశ్‌ను అరెస్ట్ చేసేందుకు అనుమతించాలన్న సీఐడీ పిటిషన్ విచారణ సందర్భంగా కీలక ఆదేశాలు జారీ చేసింది. గతంలో 41ఏ నోటీస్ కింద సీఐడీ విచారణకు హాజరైన సందర్భంగా విధించిన ఆంక్షలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించడం, ఈ కేసుల్లో కీలక సాక్షులుగా ఉన్న అధికారులు, న్యాయస్థానంలో వాంగ్మూలాలు ఇచ్చిన అధికారుల పేర్లను రెడ్‌బుక్‌లో రాశానని.. వారి సంగతి తేలుస్తానని లోకేశ్ పలు మీడియా సంస్థలకు ఇచ్చిన ఇంటర్వ్యూలలో బెదిరించడం కలకలం రేపింది.

బ్రో.. ఇది దొంగ ఓటు!


జనసేన కార్యాలయం చిరునామాతో పవన్ కల్యాణ్ ఓటు నమోదు

గత ఎన్నికల సమయంలో విజయవాడ తూర్పు పరిధిలో ఓటు

- ఆరు నెలల క్రితం చిరునామా మార్పు
- ఓటు నమోదులో పార్టీ కార్యాలయం చిరునామా చెల్లుబాటుపై అనేక రకాల అనుమానాలు



డోర్ నంబర్ 11-1903ను అడ్రస్‌గా చూపించి జనసేన నేత పవన్‌కళ్యాణ్ నమోదు చేసుకున్న ఓటు



డోర్ నంబర్ 11-1903 మీద ఉన్న మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయం చిరునామా

లక్ష పుస్తకాలు చదివానన్న స్వయం ప్రకటిత మేధావి ఆయన.. విలువల గురించి, అనుబంధాల గురించి ఊగిపోతూ ప్రసంగించడం ఆయనకు అలవాటు.. అందరూ తనలాగే ఆలోచించాలని, తన మార్గంలోనే నడవాలని ప్రవచన పలుకులు పలకడం కూడా ఆయనకే సొంతం. 'చంద్రబాబు చేత.. చంద్రబాబు కొరకు.. చంద్రబాబు యొక్క..' అంటూ అందరూ ఆ బాబు బాగు కోసమే పరితపించాలని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేసిన నేత. ఎన్నెన్నో నీతులు చెప్పే ఈ నేత నిబంధనలకు విరుద్ధంగా పార్టీ కార్యాలయం చిరునామాతో ఓటు పొందడం ఇప్పుడు చర్చనీయాంశం. దయ్యాలు వేదాలు వల్లించడం అంటే ఇదేమరి.

సాక్షి, అమరావతి: ఓటు దొంగలే.. దొంగా దొంగా అని అరుస్తున్నారు. మంగళవారం రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్‌కు 'రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గంలో దొంగ ఓట్లు నమోదవుతున్నాయి' అని స్వయంగా ఫిర్యాదు చేసిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్.. రాష్ట్రంలో నమోదు చేసుకున్న ఓటుపై 'అదీ దొంగ ఓటే' అన్న చర్చ ఉంది. జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయాన్నే తన నివాసంగా పేర్కొంటూ ఆయన ఓటు పొందారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఆయన ఓటు ఏజీజడ్ 3083045 గుర్తింపు కార్డు నంబరుతో గుంటూరు జిల్లా మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని 197వ నంబరు పోలింగ్ బూత్ పరిధిలో ఉంది. ఓటర్ లిస్టులో ఆ ఓటు ఇంటి నంబరు 11-1903గా పేర్కొన్నారు. అయితే మంగళగిరి పట్టణ పరిధిలో ఆ ఇంటి అడ్రసు గురించి ఆరా తీస్తే అది జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయం అడ్రసేనని స్పష్టమైంది. కొత్తగా ఒక ఇంటి చిరునామాతో ఓటు నమోదు చేసుకోవడానికి కొన్ని నియమ నిబంధనలు స్పష్టంగా ఉన్నాయని, ఈ లెక్కన ఒక పార్టీ కార్యాలయం అడ్రసుతో ఓటు నమోదు దొంగ ఓటు కిందకే వస్తుందని అధికారులు చెబుతున్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారుల అవగాహన కోసం కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేకంగా రూపొందించి, జారీ చేసిన వివిధ రకాల నిబంధనావళిలో ఒకటైన.. 'మ్యాన్యువల్ ఆన్ ఎలక్ట్రోల్ రోల్స్' ప్రకారం కొత్తగా వేరొక అడ్రసుతో ఓటరు నమోదుకు ఇంటి అడ్రసును 'ఆర్డనరీ రెసిడెన్స్' పేరుతో ప్రత్యేకంగా విశదీకరించారు. ఈ అంశంపై గౌహతి హైకోర్టు వెలువరించిన ఒక తీర్పు ప్రకారం ఇంట్రి అడ్రసు అంటే.. శాశ్వతంగా నివాసం ఉండేది అని కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల పుస్తకంలో స్పష్టంగా పేర్కొంది. టెంపరరీ (తాత్కాలిక) లేదా క్యాజువల్ నివాసంగా అది ఉండకూడదని ఆ నిబంధనలో స్పష్టంగా ఉంది. 'రెగ్యులర్‌గా రాత్రివేళ నిద్రించే ప్రాంతాన్నే' ఆ వ్యక్తి ఆర్డనరీ రెసిడెన్స్‌గా గుర్తించాలని స్పష్టం చేసింది. కానీ జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అప్పుడప్పుడు హైదరాబాద్ నుంచి రాష్ట్రానికి వచ్చినప్పుడు ప్రైవేట్ హోటల్‌లో బస చేస్తుంటారు. పార్టీ విధుల్లో భాగంగా హైదరాబాద్ నుంచి మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయానికి వచ్చి వెళ్తుంటారు. అలాంటప్పుడు పార్టీ కార్యాలయం ఆయన శాశ్వత నివాసం ఎలా అవుతుందన్న విమర్శలున్నాయి. ఈ లెక్కన మంగళగిరి పార్టీ కార్యాలయం అడ్రసుతో ఆయన ఆరు నెలల ముందు నమోదు చేసుకున్న ఓటు.. దొంగ ఓటు కిందకే వస్తుందని అధికారుల స్థాయిలో చర్చ సాగుతోంది.

ఆ చిరునామాలో పవన్ ఓటు మాత్రమే..

2019 ఎన్నికల్లో రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేసిన పవన్ కల్యాణ్.. తన ఎన్నికల అఫడవిట్‌లో తన కుటుంబ సభ్యుల వివరాలలో భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయం అడ్రసు 11-1903తో ఇప్పుడు పవన్ తన ఒక్కరి ఓటు మాత్రమే నమోదు చేసుకోవడం విశేషం. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2019 ఎన్నికల సమయంలో విజయవాడ తూర్పు నియోజకవర్గ పరిధిలోని 91వ పోలింగ్ బూత్‌లో పవన్ తన ఓటు నమోదు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆరు నెలల క్రితం మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయ అడ్రసుకు ఓటును మార్చుకున్నారని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

తమ్ముడి బాటలోనే అన్న నాగబాబు

రాష్ట్రంలో పవన్‌కల్యాణ్ నమోదు చేసుకున్న ఓటు దొంగ ఓటు.. అని అని చర్చ సాగుతున్న తరుణంలో.. అతని సోదరుడు నాగబాబు కూడా దొడ్డిదారిన రాష్ట్రంలో దొంగ ఓట్ల నమోదుకు పూనుకున్నారు. హైదరాబాద్‌లో నివాసం ఉండే నాగబాబు మొన్నటి తెలంగాణ ఎన్నికల పోలింగ్ ముగిసిన మరుసటి రోజు అంటే 2023 డిసెంబరు 4 తేదీన మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని తాడేపల్లి పట్టణ పరిధిలో వడ్డేశ్వరం – రాధా రంగ నగర్‌లోని 5-263 ఇంటి అడ్రసు పేరుతో ఆన్‌లైన్‌లో ఓటుకు దరఖాస్తు చేశారు. నాగబాబు, ఆయన భార్య, కూతురు నిహారిక, కుమారుడు వరుణ్‌తేజ్ (సినీ నటుడు), కోడలు లావణ్య త్రిపాఠి (సినీ నటి) కలిపి మొత్తం ఆరుగురు ఆ ఇంటి అడ్రసులో నివాసం ఉంటున్నట్లు పేర్కొంటూ ఓట్లు నమోదు ఫారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అయితే ప్రాథమిక స్థాయిలో బూత్ లెవల్ అధికారి (బీఎల్‌వో) పరిశీలనలో నాగబాబు గానీ, వారి కుటుంబం గానీ ఆ అడ్రసులో నివాసం ఉండడం లేదని తేలింది. ఈ ఇల్లు జనసేన పార్టీ అభిమానిదని స్థానికులు పేర్కొన్నారు. ఆ తర్వాత కూడ మంగళగిరి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఓటు నమోదు ప్రక్రియలో భాగంగా నాగబాబు, ఆయన కుటుంబ సభ్యులు తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలంటూ ఆ ఇంటి తలుపులకు నోటీసులు అంటించి వెళ్లారు. అయితే నాగబాబు, ఆయన కుటుంబ సభ్యులందరి తరుపున సంబంధిత అడ్రసులో పేర్కొన్న ఇంటి యజమానే అధికారుల ముందు హాజరైనట్లు అధికార వర్గాలు తెలిపాయి.

ఇక్కడ నివాసం.. అక్కడ వ్యాపారమట!

అధికారుల విచారణ సమయంలో నాగబాబు తాను తాడేపల్లిలో నివాసం ఉంటున్నానని, అయితే ప్రస్తుతం వ్యాపార నిమిత్తం హైదరాబాద్‌లో ఉన్నందున స్వయంగా విచారణకు రాలేకపోయినట్టు తాను సంతకం చేసిన ఒక పేపరు ఆ ఇంటి యజమాని ద్వారా పంపారు. మరో ఇద్దరు ఇలాగే పేపర్‌పై రాసి.. దానిని ఫొటో తీసి ఆ ఇంటి యజమాని ద్వారా పంపారు. మిగిలిన మరో ముగ్గురి నుంచి ఎలాంటి అఫిడవిట్ లేదని తెలిసింది. మొత్తంగా ఆ అడ్రసులో పేర్కొన్న ఇంటి యజమానే నాగబాబు కుటుంబ సభ్యులు ఆరుగురి తరఫున విచారణకు హాజరయ్యారు. ఆ ఇంటి అడ్రసులో నాగబాబు కుటుంబం నివాసం ఉండటం లేదని అధికారులు నిర్ధారించుకుని, ఆ ఆరుగురి ఓట్లను తిరస్కరించారు. సినీ నటుడిగా, పార్టీ అధ్యక్షుడి హోదా లేదా కీలక బాధ్యతల్లో ఉన్న పవన్‌కల్యాణ్, నాగబాబు లాంటి వారే తమ సొంత ఓట్ల నమోదు ప్రక్రియలో ఇలా అడ్డదారులు తొక్కడం అధికార వర్గాల్లో చర్చనీయాంశమైంది.

పిటిషనర్‌కు పిటిషన్ వేసే అర్హత లేదు

- తెలంగాణ హైకోర్టులో 'వ్యూహం' నిర్మాత-దర్శకుల వాదనలు
- కోర్టులు.. సమాంతర సెన్సార్ బోర్డులు కాదు: సీబీఎఫ్‌సీ
- తదుపరి వాదనల విచారణ నేటికి వాయిదా

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ దర్శకుడు రాంగోపాల్ వర్మ దర్శకత్వం వహించిన వ్యూహం చిత్ర విడుదలకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) ఇచ్చిన సర్టిఫికెట్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌లో..అసలు పిటిషన్ దాఖలు చేసే అర్హతే పిటిషనర్‌కు లేదని నిర్మాత, దర్శకులు వాదనలు వినిపించారు. పరువునష్టం వాటిల్లుతున్న చంద్రబాబు కుమారుడిగా అని పిటిషన్‌లో పేర్కొన్నారని.. అంటే అది ఆయన వ్యక్తిగత వ్యవహారమని, రిట్ పిటిషన్ మెయింటెనబుల్ కాదని పేర్కొన్నారు. అనంతరం వాదనలను తెలంగాణ హైకోర్టు బుధవారానికి వాయిదా వేసింది. దీనిపై జస్టిస్ సూరేపల్లి నందా మంగళవారం మరోసారి విచారణ చేపట్టారు. 10.30 విచారణ సందర్భంగా..సర్టిఫికెట్ జారీకి సంబంధించి ఓ కమిటీ ఏర్పాటు చేస్తామని, అందులో ఎవరు ఉండాలనేది వాది, ప్రతివాదులు నిర్ణయం తీసుకొని 12 గంటలకు రావాలని సూచించారు. అయితే కమిటీ నిర్ణయంపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో వాదనలు ప్రారంభించారు. పార్టీ జెండాలు, నేతల పేర్లతో చిత్రం తీశారని, ఇది పలు పార్టీల నేతల పరువుకు నష్టం కలిగించేదిగా ఉందని పిటిషనర్ తరఫున న్యాయవాది మురళీధర్‌రావు వాదించారు.

'సీబీఎఫ్‌సీ'లో కోర్టులు జోక్యం చేసుకోలేవు..

అనంతరం సీబీఎఫ్‌సీ తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్(ఏఎస్‌జీ) నరసింహశర్మ వాదనలు వినిపిస్తూ.. 'సినిమాటోగ్రాఫ్ చట్టం, ఫిల్మ్ సర్టిఫికేషన్ మార్గదర్శకాలు, ఆర్టికల్ 19(1)(ఏ) ప్రకారం భావ ప్రకటన హక్కును పరిగణనలోకి తీసుకుని రివైజింగ్ కమిటీ ఏకగ్రీవంగా 'యు' సర్టిఫికెట్ మంజూరు చేసింది. చట్టప్రకారం ఆ నివేదికను రహస్యంగా ఉంచాల్సిన అవసరం ఉంది. సీబీఎఫ్‌సీ ఒకసారి సర్టిఫికెట్ ఇచ్చిన తర్వాత కోర్టులు జోక్యం చేసుకోవడానికి వీలులేదు. ఇదే జరిగితే ప్రతి సినిమాకు ఏదో కారణం చూపించి ఇక అంతా కోర్టులను ఆశ్రయిస్తారు. ఇది చిత్రాల విడుదలకు ఆటంకంగా మారుతుంది. కోర్టులు సమాంతరంగా సెన్సార్ బోర్డు పాత్ర పోషించలేవు. రివిజన్ కమిటీ చట్టప్రకారమే సర్టిఫికెట్ జారీ చేసింది. ఇది సహజ న్యాయ సూత్రాల ఉల్లంఘన ఎక్కడా జరగలేదు' అని వాదించారు.

పిటిషనర్‌కు అర్హత లేదు...

నిర్మాత-దర్శకుడి తరఫున సీనియర్ న్యాయవాది వెంకటేశ్ వాదనలు వినిపిస్తూ.. 'తండ్రికి పరువు నష్టం జరిగినప్పుడు కుమారుడు కోర్టుకు రావడం చట్టప్రకారం చెల్లదు. టీజర్‌కు సంబంధించిన వీడియో చూశామని పిటిషన్‌లో పేర్కొన్నారు.. దాన్ని సినిమా మొత్తానికి ఎలా ఆపాదిస్తారు. చిత్రం చూశాక అవమానం జరిగిందని భావిస్తే అప్పుడు పరువునష్టం దావా వేసుకోవచ్చు. ఇదే కోర్టు చిత్రానికి సర్టిఫికెట్ జారీ కోసం రివిజన్ కమిటీ వేయాలని సీబీఎఫ్‌సీని ఆదేశించింది. తొమ్మిది మందితో ఏర్పాటైన రివిజన్ కమిటీ అన్ని అంశాలను పరిశీలించి ఏకగ్రీవంగా సర్టిఫికెట్ జారీ చేసింది. ఇప్పుడు మళ్లీ ఇదే కోర్టు సర్టిఫికెట్ ఇవ్వడాన్ని తప్పుబట్టడం సరికాదు. గతంలో సైరా నరసింహారెడ్డి చిత్రంపై కొందరు ఇదే హైకోర్టును ఆశ్రయించగా, చిత్రం చూడకుండానే ఆరోపణలు చేయడం సరికాదంటూ పిటిషన్‌ను ద్విసభ్య ధర్మాసనం కొట్టివేసింది. చిత్రం చూడకుండానే పరువుకు నష్టం వాటిల్లుతుందని.. ఊహించి పిటిషన్ వేయడం ఆక్షేపణీయం. చట్టపరమైన చర్యలకు ఊహలు ప్రాతిపదిక కాదు. సీబీఎఫ్‌సీ ఇచ్చిన నివేదికను కోర్టు రహస్యంగానే ఉంచాలి. వివరాలు బహిర్గతమైతే మీడియా, సోషల్ మీడియాకు చేరే అవకాశం ఉంటుంది' అని పేర్కొన్నారు. న్యాయమూర్తి.. విచారణ బుధవారానికి వాయిదా వేశారు.

ప్రతి హైకోర్టులో సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి

పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి హెచ్‌సీఏఏ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: ప్రతి హైకోర్టులో సుప్రీంకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయాలని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీని హైకోర్టు అడ్వొకేట్ అసోసియేషన్ (హెచ్‌సీఏఏ) విజ్ఞప్తి చేసింది. హైకోర్టుల్లో వసతుల కల్పన తదితర వివరాల సేకరణ, చర్చ కోసం సుశీల్‌కుమార్ మోదీ ఆధ్వర్యంలోని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ మంగళవారం హెచ్‌సీఏఏలో న్యాయవాదులతో భేటీ అయ్యింది. అన్ని న్యాయస్థానాల్లో ఆన్‌లైన్ సేవలు అందించేలా ఏర్పాటు చేయాలని అసోసియేషన్ కోరింది. ఇది జూనియర్లకు వినియోగపడుతుందని పేర్కొంది. ఈ కార్యక్రమంలో హెచ్‌సీఏఏ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడు కల్యాణ్‌రావు, కార్యదర్శులు దేవేందర్, ప్రదీప్, నాగులూరి కృష్ణకుమార్‌గౌడ్, బైరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు తరలింపును ఆపాలి..

హైకోర్టు తరలింపును ఆపాలంటూ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ముందు పలువురు న్యాయవాదులు ఆందోళన చేశారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ భేటీని అడ్డుకున్నారు. హైకోర్టు తరలింపును ఆపాలని, తమ సమస్యలు వినాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. అసోసియేషన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో కమిటీ భేటీ అర్ధాంతరంగా ముగిసింది. అనంతరం కమిటీ.. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, ఇతర న్యాయమూర్తులతో సమావేశమయ్యింది.

నగర వార్తలు

సెల్ బేలో హిమజ సందడి



గచ్చిబౌలి: బిగ్‌బాస్ ఫేమ్ హిమజ 'సెల్ బే'లో సందడి చేశారు. గచ్చిబౌలిలోని సెల్ బే స్టోర్‌లో షావోమీ గ్లోబల్ 5జీ హ్యాండ్ సెట్ అయిన సరికొత్త రెడ్ మీ నోట్-13 సిరీస్‌ను మంగళవారం మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో సంస్థ ఎండీ సోమ నాగరాజు, షావోమీ ఇండియా జోనల్ హెడ్ సయ్యద్ అన్వర్, నేషనల్ రిటైల్ మార్కెటింగ్ మేనేజర్ మహ్మద్ ఇఫ్తాకర్, డైరెక్టర్లు సుహాస్ నల్లచెరు, సందీప్ నల్లచెరు పాల్గొన్నారు.

సమస్యలపై సీఎంకు వినతి



బంజారాహిల్స్: జలమండలి ఇంజినీర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం సీఎంకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సమస్యలు విన్న సీఎం సానుకూలంగా స్పందించినట్లు ప్రతినిధులు పేర్కొన్నారు. వినతి ఇచ్చిన వారిలో అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, జనరల్ సెక్రటరీ హరిశంకర్, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ రవీందర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ నారాయణ, మేనేజర్ శ్రీహరి ఉన్నారు.

ఎవరూ విద్యకు దూరం కాకూడదన్నదే 'ఖుషి' ఉద్దేశం

మాజీ క్రికెటర్ కపిల్‌దేవ్



పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించిన కపిల్‌దేవ్

శంషాబాద్ రూరల్: నేటి చిన్నారులే దేశ భవిష్యత్ అని మాజీ క్రికెటర్, ఖుషి స్వచ్ఛంద సంస్థ చైర్మన్, ఫౌండర్ కపిల్‌దేవ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని ముచ్చింతల్‌లో మైహోం గ్రూపు ఆధ్వర్యంలో నిర్మించిన ప్రభుత్వ పాఠశాల నూతన భవనాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఏ ఒక్క చిన్నారి విద్యకు దూరం కాకూడన్నదే ఖుషి ఆర్గనైజేషన్ ఉద్దేశం అన్నారు. మన కోసం కాకుండా తోటి వారికి సహాయం చేయాలనే ఆలోచన కలిగి ఉండడం సంతోషకరమన్నారు.

మైహోం సంస్థతో కలిసి ఇక్కడ విద్యాభివృద్ధిలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. దేశం ప్రజలను నాపై చూపిస్తున్న ప్రేమ, అభిమానానికి తన వద్ద పదాలు లేవన్నారు. ప్రజలకు ఎలా కృతజ్ఞతలు చెప్పాలో ఏ డిక్షనరీలో కూడా లేవన్నారు. నా ఒక్కడినే కాదు.. పిల్లలపై కూడా ప్రేమ చూపాలన్నారు. ఇక్కడున్న వారిలో రేపటి రోజు దేశంలోని ఉన్నత పదవులను పొందినా ఆశ్చర్య పోనవసరం లేదని ఇదంతా విద్యతోనే సాధ్యమన్నారు. ఈ గ్రామాన్ని నా సొంతూరిలా భావిస్తున్నట్లు తెలిపారు.

పుట్టిన రోజు లడ్డూలు పంచుతాం..

కపిల్ దేవ్ పుట్టిన రోజు పురస్కరించుకుని విద్యార్థులు కేక్ తీసుకురాగా.. ప్రతి రోజు నా పుట్టిన రోజు లాంటిదేనని.. ప్రత్యేకంగా చేసుకునేది కాదని కపిల్ అన్నారు. అనంతరం చిన్నారులతో కలిసి కపిల్‌దేవ్ తన పుట్టిన రోజు కేక్ కట్ చేశారు. మా దగ్గర కేక్ కట్ చేయకుండా లడ్డూలు పంచి పెడతామన్నారు. కపిల్‌దేవ్‌తో కలిసి ఈ భవనాన్ని ప్రారంభించడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నానని మైహోం గ్రూపు వైస్ చైర్మన్ జూపల్లి జగపతిరావు అన్నారు. కపిల్‌దేవ్‌లాగా ఇక్కడి విద్యార్థులు కూడా గొప్ప వ్యక్తులు కావాలని ఆకాంక్షించారు. సమాజంలో వైద్యం, విద్య చాలా అవసరమని ఇందుకోసం మైహోం ఆధ్వర్యంలో సమాజానికి సేవలందిస్తున్నట్లు తెలిపారు. సమాజ సేవకు అందరూ ముందుకు రావాలన్నారు. విద్య, వైద్య రంగాలకు సీఎం రేవంత్‌రెడ్డి అధిక ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఖుషి ఆర్గనైజేషన్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ పార్వతిరెడ్డి మాట్లాడుతూ.. 20 ఏళ్ల కిందట స్థాపించిన ఖుషి ఆధ్వర్యంలో దేశంలో రెండు లక్షల మందికి విద్యను అందించడానికి చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు సుజాత, మాజీ సర్పంచు పెంటయ్య, మాజీ ఎంపీటీసీ చంద్రయ్య, ఉపసర్పంచు రాజు, ఎంఈఓ రాంరెడ్డి పాల్గొన్నారు.

'గాంధీ డైట్ కిచెన్'లో అధునాతన రోటీ మేకర్



గాంధీ డైట్ కిచెన్‌లో రోటీ మేకర్ మెషిన్ ప్రారంభిస్తున్న దృశ్యం

గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో వైద్యులు, రోగులకు ఆహారపదార్థాలు అందించే డైట్ కిచెన్‌లో అధునాతన రోటీ మేకర్ మెషిన్ అందుబాటులోకి వచ్చింది. సుమారు రూ.4 లక్షలతో కొనుగోలు చేసిన మేకర్‌ను చీఫ్ డైటీషియన్ రమేష్, ఆర్ఎంఓ-1 జయకృష్ణతో కలిసి సూపరింటెండెంట్ రాజారావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అత్యాధునిక సౌకర్యాలతో డైట్ భవనం అందుబాటులోకి రావడంతో చికిత్స పొందుతున్న రోగులు, వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లకు మరింత పరిశుభ్రం, ఆరోగ్యకరమైన పౌష్టికాహారం అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల డైట్ కిచెన్‌లలో ఇలాంటి రోటీ మేకర్ మెషిన్ ఏర్పాటు చేయడం ఇదే ప్రథమమని గాంధీ డైట్ కిచెన్ నిర్వహణ కాంట్రాక్టర్ శ్రీ వేంకటేశ్వర అసోసియేట్స్ అధినేత రవికుమార్ తెలిపారు. పిండి కలపడం మొదలుకొని రోటీ తయారయ్యే వరకు మెషినే చేస్తుందన్నారు. గంట వ్యవధిలో వెయ్యి రోటీలు తయారు చేస్తుందని వివరించారు.

గౌడకంఠమ్ కేలండర్ ఆవిష్కరణ



సాక్షి, సిటీబ్యూరో: సోమాజిగూడలోని మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో మంగళవారం గౌడకంఠమ్ జాతీయ మాస పత్రిక ప్రత్యేక సంచిక, నూతన కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గౌడ సామాజిక చైతన్యంలో గౌడ కంఠమ్ పాత్ర అభినందనీయమన్నారు. ప్రపంచంలోని గౌడ్‌ల ప్రేమాభిమానాన్ని గౌడ కంఠమ్ చూరగొన్నదన్నారు. గౌడ కంఠమ్ అభివృద్ధిలో ఎడిటర్ సిద్దుగౌడ్ కృషి ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నేమూరి సాయిరామ్ గౌడ్, రవిగౌడ్, నోముల మనోజ్ గౌడ్, నోముల సాయికిరణ్ గౌడ్, సుధీర్ గౌడ్ పాల్గొన్నారు.

గత నిర్ణయాలపై పునఃసమీక్షించాలి



భట్టి విక్రమార్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తాజ్‌మోహన్‌రెడ్డి

రాంగోపాల్‌పేట్: నాటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ హయాంలో ఈ శాఖలో జరిగిన పాలన నిర్ణయాలపై పునఃసమీక్షించే వరకు ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ ఎల్ తాజ్‌మోహన్‌రెడ్డి కోరారు. మంగళవారం ఆయన అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి సమస్యలు విన్నవించారు. గతంలో కేవలం కొన్ని ఉద్యోగ సంఘల నాయకుల మాటలు విని ఇతర ఉద్యోగ సంఘాల నాయకులపై వివక్ష చూపించి అణచివేశారని ఆరోపించారు. కొంత మందికి ఇష్టారాజ్యంగా పదోన్నతులు కల్పించి ఇతరులకు అన్యాయం చేశారని ఈ శాఖలో జరిగే కార్యాకలాపాలు, అన్యాయాలపై నాటి మంత్రి కేటీఆర్‌కు వివరించేందుకు యత్నిస్తే ఒక్కసారి కూడా కలిసే అవకాశం ఇవ్వలేదన్నారు. ఈ పాలనాపరమైన విధానాలపై త్వరలోనే హైకోర్టును కూడా ఆశ్రయిస్తామన్నారు. సీనియర్, నిష్పక్షపాత ఐఏఎస్ అధికారితో గత నిర్ణయాలపై సమీక్ష నిర్వహించి నాటి కేటీఆర్ ఓఎస్డీ మహేందర్ అనేక అక్రమాలకు పాల్పడ్డారని ఇతనిపై దర్యాప్తు జరిపించాలన్నారు.

రెండు డీఏలు విడుదల చేయండి..

గత కొద్ది కాలంగా ఉద్యోగులకు 4 డీఏలు ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టారని ఈ సంక్రాంతి పండుగకు కొత్త ప్రభుత్వం, కొత్త సంవత్సరంలో కనీసం రెండు డీఏలు విడుదల చేయాలని కోరారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు శాంతికుమార్, తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ తైలవర్ణచిత్రం బహూకరణ



ప్రముఖ చిత్రకారుడు పి. నరేందర్ రెడ్డి రూపొందించిన మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీ తైలవర్ణ చిత్రాన్ని మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహూకరించారు. చిరుదరహాసంతో సజీవ కళ ఉట్టిపడేలా ఉన్న రాజీవ్‌గాంధీ చిత్రాన్ని రూపొందించిన నరేందర్‌రెడ్డిని సీఎం అభినందించారు.

–సాక్షి, సిటీబ్యూరో

బీసీ గణన చేస్తామన్న పార్టీకే మద్దతు

- లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి కృషి చేస్తాం
- ఈ నెల 13న రాహుల్ గాంధీని కలుస్తాం
- మోదీ పాలనతో బీసీలు విసిగిపోయారు
- బీసీ నేతలు జస్టిస్ వి.ఈశ్వరయ్య, జాజుల శ్రీనివాస్ గౌడ్



సమావేశంలో అభివాదం చేస్తున్న జస్టిస్ ఈశ్వరయ్య, జాజుల శ్రీనివాస్ గౌడ్ తదితరులు

హిమాయత్‌నగర్: దేశవ్యాప్తంగా బీసీ గణన చేస్తామన్న రాజకీయ పార్టీకే రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మద్దతిస్తామని ఆల్ ఇండియా బ్యాక్‌వర్డ్ క్లాసెస్ ఫెడరేషన్ (ఏఐబీసీఎఫ్) జాతీయ అధ్యక్షుడు జస్టిస్ వి.ఈశ్వరయ్య స్పష్టం చేశారు. ప్రధాని మోదీ పాలనతో దేశంలోని బీసీ ప్రజలంతా విసిగిపోయారని, ఈ నెల 13వ తేదీన దేశవ్యాప్తంగా ఉన్న 30 బీసీ సంఘాల నాయకులతో కలిసి ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీని కలిసి కుల గణనపై చర్చిస్తామని చెప్పారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో మంగళవారం బీసీ సంఘం నాయకులు జాజుల శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రాహుల్ గాంధీ ఆధ్వర్యంలోని ఇండియా కూటమిలో బీసీ ప్రముఖులు అఖిలేష్ యాదవ్, స్టాలిన్ ఉండటంతో బీసీలకు న్యాయం జరుతుందని విశ్వసిస్తున్నామన్నారు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ విజయం కోసం పనిచేస్తామని ఈశ్వరయ్య ప్రకటించారు.

ఆ పోస్టుల్లో బీసీలకు వాటా ఇస్తేనే తెలంగాణలోని అన్ని స్థానాల్లో మద్దతిస్తాం

◆ తెలంగాణ రాష్ట్రంలో కూడా నూతన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే జనగణన చేపట్టి, సమగ్ర సర్వేను బహిర్గతం చేయాలని, దాని తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. న్యాయ వ్యవస్థలో, నామినేటెడ్ పోస్టులలో బీసీలకు వాటా ఇస్తేనే రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో అన్ని పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పనిచేస్తామన్నారు. జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బీసీగా చెప్పుకుని ప్రధాని అయిన మోదీ దేశంలో ఉన్న బీసీలకు తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు. పదేళ్లలో బీసీల కోసం మోదీ ఏమి చేయలేదని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ పెట్టలేదని, చట్టసభల్లో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించడంలో విఫలమయ్యారన్నారు. సమావేశంలో ఏఐబీసీఎఫ్ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ విజయ్ భాస్కర్ గౌడ్, బీసీ నాయకులు నాగుల శ్రీనివాస్ యాదవ్, ప్రొఫెసర్ తిరుమళి, ప్రొఫెసర్ మురళీ మనోహర్, న్యాయవాది సునీల్ గౌడ్, ప్రవీణ్ పాల్గొన్నారు.



అల్లదిగో సంక్రాంతి

బస్సెక్కి వెళ్లాలా?
కారెక్కి వెళ్లాలా?
ఏ రోజు వెళ్లాలి..
ఎప్పుడు రావాలి...
సెలవు అడగాలా వద్దా?
డబ్బులు సమకూరాయా లేదా?
సంక్రాంతి వచ్చేసింది.
కొందరు మాత్రం చివరి వరకూ
ఏ విషయం తేల్చకుండా
హడావిడిగా ప్రయాణం పెట్టుకుని
ట్రబుల్స్‌లో పడతారు.
వద్దు. సంక్రాంతికి ఊరెళ్లేందుకు
హాయిగా ప్లాన్ చేసుకోండి.
సంతోషంగా పండక్కు పదండి.

టికెట్లు తీశారా? లగేజ్ సర్దారా?

పండగని తెలుసు. వెళ్లాలనీ తెలుసు. కాని ఏదీ తెమల్దు. నెలా రెండు నెలల ముందు భార్యాభర్తలు కూచుని మాట్లాడుకుని కచ్చితంగా ఫలానా డేట్‌కు బయలుదేరి వెళ్దాం అనుకుని ఉంటే ట్రైన్ టికెట్లు ఉంటాయి. తత్కాల్‌లో చూసుకోవచ్చులే అనుకుంటారు. బస్సులు దొరుకుతాయిలే అనుకుంటారు. అంతగాకుంటే కారుంది కదా పోదాం అనుకుంటారు. అనుకోవడం ఎందుకు? ఖరారు చేసుకోకపోవడం ఎందుకు? చివరి నిమిషంలో హైరానా పడటం ఎందుకు?

■ ఎప్పుడు? ఎక్కడకు?

సంక్రాంతి తెలుగువారి ముఖ్యమైన పండుగ. అయినవారితో కలిసి చేసుకుంటే సంతోషాన్ని పెంచే పండగ. అయితే ఈ అయిన వారు ఎవరు అనేది ఒక్కోసారి స్పష్టత రాదు. భార్యకు పుట్టింటికి వెళ్లాలని ఉండొచ్చు. భర్తకు తన సొంతూరికి వెళ్లాలని ఉండొచ్చు. ఈ పండక్కు ఈ ఊరు... మరో పండక్కి ఆ ఊరు అని టక్కున నిశ్చయించుకుంటే సగం చింత ఉండదు. కాని తేల్చరు. మరికొన్ని కారణాలు ఉంటాయి.

■ భర్త గమనించాల్సినవి

- భార్య పుట్టింటికి వెళితే ఎవరికో ఏవో కానుకలు ఇచ్చుకోవాలనుకోవచ్చు. తల్లిదండ్రులకు బట్టలు తీసుకెళ్లాలనుకోవచ్చు. మేనకోడలికి పట్టీలు తీసుకెళ్లాలనుకోవచ్చు. వీటికి బడ్జెట్ కేటాయించబడిందా? అవి లేక ఆమె ఏ విషయం తేల్చకుండా ఉందా?
- భార్య అత్తింటికి వెళితే అక్కడ పనులన్నీ నెత్తిన పడే ప్రమాదం ఉందా? మరో కోడలి ఎదుట ఆర్థిక స్థితిగతుల విషయంలో ఏమైనా చిన్నబుచ్చుకునే ప్రమాదం ఉందా? ఈ సంవత్సరం నేను ఈ నగ చేయించుకున్నాను అనంటే నేను ఏమీ చేయించుకోలేదు వంటి జవాబు చెప్పాలనుకోవడం లేదా? అందుకే అత్తారింటికి వెళ్లడం గురించి ఆమె ఏ విషయం మాట్లాడటం లేదా?

■ భార్య గమనించాల్సినవి

పుట్టింటి నుంచి అల్లుడికి సరైన పిలుపు అందిందా? అక్కడకు వచ్చాక మంచి మర్యాదే దొరుకుతుందనే నమ్మకం ఉందా? తోడల్లుడు, బావమరిది... వీళ్లు ఆదరంగా చూసే వీలుందా? పండక్కు వస్తే భర్త ఏదైనా కానుక ఆశిస్తాడా? మంచి బట్టలైనా పెట్టాలని కోరుకుంటాడా? అలా కోరుకుంటున్నట్టయితే ఆ కోరిక నెరవేర్చే స్థితిలో తల్లిదండ్రులు ఉన్నారా? తీరా వచ్చాక అలకలు ఏర్పడతాయా? అందుకే అతను అత్తగారిల్లు అనే మాట ఎత్తడం లేదా?

■ టికెట్లు.. పాట్లు

- తాత్కాల్‌ను ఇలాంటి టైమ్‌లో నమ్ముకోలేము.
- ఆర్టీసి బస్సులు ఎన్ని స్పెషల్స్ వేసినా సీటు దొరుకుతుందన్న గ్యారంటీ లేదు.
- ప్రయివేటు ట్రావెల్స్ డబుల్ రేట్ చెప్తాయి. ఇంకా ఎక్కువే చెప్పొచ్చు.
- సొంత కారు ఉన్నా పండగ ముందు రోజు బయలుదేరితే టోల్‌గేట్ల దగ్గరే సమయం సరిపోతుంది.
- ముందే టికెట్లు బుక్ చేసుకోకపోవడం వల్ల తత్కాల్ చార్జీలు, ప్రయివేట్ బస్సుల చార్జీలు భరించలేక భార్యాభర్తలు టికెట్లు తీసుకుని పిల్లలకు తీసుకోకుండా ఫైన్లు కట్టి లేదా ఒళ్లు కూచోబెట్టుకుని ప్రయాణం చేస్తూ ఒకరినొకరు తిట్టుకుంటూ ఉండటం అవసరమా?
- మరో విషయం ఎలాగోలా చేరుకుంటే ఎలాగోలా వెనక్కు రావచ్చు అనుకుంటారు. కాని తిరుగు ప్రయాణానికి అసలు టికెట్లు దొరకవు. దాంతో సెలవు పొడిగించుకుని, సద్ది బంధువుగా మారి ఇబ్బంది పడటం అవసరమా?

■ ఇప్పుడైనా ప్లాన్ చేయండి

ఆదివారం భోగి, సోమవారం సంక్రాంతి, మంగళవారం కనుమ. శనివారం ప్రయాణం అనుకోకండి. గురువారం ఉదయం నుంచి రైళ్లు, బస్సులు, కారు ప్రయాణం ప్లాన్ చేసుకుంటే చాలా సమస్యలు తీరుతాయి. పోనీ శుక్రవారం తెల్లవారు జాము నుంచి బయల్దేరండి. డబ్బు ఈ ఒక్కసారికే దుబారా అనుకుంటే కారు, ప్రయివేటు బస్సుల్లో ప్రయాణం ఎంజాయ్ చేసేలా వెళ్లండి. పండగ మూడ్‌తో వెళ్లండి.

వెళ్లే ముందు భార్య తరఫు ఇంటికి వెళ్లినా, భర్త తరఫు ఇంటికి వెళ్లినా మన ఆర్థిక స్థితి మనది... మన ఆనంద స్థితి మనది... వేరొకరితో పోటీ వద్దు... తల్లిదండ్రులను అత్తామామలను ఇబ్బంది పెట్టకుండా సంతోషంగా గడిపి వద్దాం అనుకుని బయలు దేరండి.

భావోద్వేగాల కుదుపులో తనను తాను కోల్పోయింది.
అయితేనేం... తన సమస్య ఏంటో తాను గుర్తించడమే కాదు...
దాని నుంచి బయటపడి తనకు తానుగా నిలబడి
సర్టిఫైడ్ ఎమోషనల్ క్లారిటీ కోచ్‌గా, పబ్లిక్ స్పీకర్ గా మారి
కెరీర్, రిలేషన్ షిప్ సమస్యల నుంచి యువతకు పరిష్కారాలు సూచిస్తోంది.
కార్పొరేట్ కంపెనీలతో కలిసి ఉద్యోగులకు కౌన్సెలింగ్ ఇస్తోంది.
చదువుకు మానవసంబంధాలలో సమతుల్యతకు ఏవిధమైన సంబంధం లేదని,
తన జీవితం నేర్పిన పాఠం ద్వారా ఎంతోమంది జీవితాల్లో
వెలుగులు నింపుతోంది.
భావోద్వేగాల బ్యాలెన్స్ నేటి సమాజంలో ఎంత అవసరమో
యువతకు తెలియజేయడానికి ఢిల్లీ నుంచి గల్లీ వరకు
అవేర్‌నెస్ క్లాసులు నిర్వహించడానికి దేశమంతా తిరుగుతోంది.
తన జీవితమే ఒక పాఠంలా నాలుగు పదుల వయసు దాటిన
నిధి సైని ఇలా మనముందుంచుతోంది.

అవేర్‌నెస్ టీచర్



నిధి సైని

"నా జీవితంలోని 21 ఏళ్ల విభిన్నరంగాలకు చెందిన వ్యక్తులతో కలిసి పనిచేశాను. నాలో ఆత్మబలాన్ని పెంచుకోవడానికే కాదు నాతో కలిసి నడిచే వారి కోసం దేశమంతటా ప్రయాణిస్తున్నాను. అత్యంత క్లిష్ట సమయాల్లో కూడా నా జీవన సారాన్ని కోల్పోని స్త్రీగా నన్ను నేను మలుచుకున్నాను. మీరూ మీలో ఉన్న ఆ ప్రత్యేక సారాన్ని కనుగొనే ప్రయాణం చేయండి. నేను మీకు తోడుగా ఉన్నాను. నేను అందించే వివిధ ప్రోగ్రామ్‌ల ద్వారా నాతో కలిసి ప్రయాణించే వ్యక్తుల జీవితాల్లో దీర్ఘకాలికమైన మార్పును సృష్టించాలనుకుంటున్నాను.

పెద్ద తప్పు..

నేను పుట్టి పెరిగింది ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో. డిగ్రీ చదువుకు ఢిల్లీకి వెళ్లాను. చదువు పూర్తయ్యాక ఇంట్లో నా పెళ్లి గురించి చర్చలు మొదలయ్యాయి. కానీ, పెళ్లి వద్దని పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో చేరాను. అక్కడ ఓ అబ్బాయిని ప్రేమించడం నా జీవితంలో అతి పెద్ద తప్పుగా మారింది. మా అమ్మనాన్నలు మా ప్రేమను అంగీకరించలేదు. అయినా, వారిని ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేసి పెళ్లికి ఒప్పించాను. కానీ, పెళ్లికి రెండు రోజుల ముందు ఆ బంధం నుంచి తప్పుకోవాలనుకున్నాను. నేను ఇష్టపడినప్పటికీ పెళ్లి చేసుకోకపోవడమే మంచిదనపించింది. కానీ, ఇంట్లో అందరిలోనూ అలజడి. సమాజం ఏమనుకుంటుందో అనే ఆందోళన. దీంతో ఏమీ తేల్చుకోలేకపోయాను. పెళ్లయిపోయింది.

ఎగిరిపోయిన ప్రేమ

పెళ్లయిన ఏడాదిలోపే ఈ బంధం ఎక్కువ కాలం ఉండదని అర్థమైంది. ఒకనాడు ఎవరూ ఒప్పుకోకపోయినా పారిపోయి పెళ్లి చేసుకోవాలనుకున్న నేనే, ఇలా మారిపోవడం ఆశ్చర్యమేసింది. నచ్చిన అబ్బాయిని పెళ్లి చేసుకున్నందుకు నా బంధంలో ఉన్న ఇబ్బందుల గురించి మా తల్లిదండ్రులకు కూడా చెప్పలేకపోయాను. అప్పటికే తమ్ముడి జీవితంలో జరుగుతున్న అల్లకల్లోలం వల్ల అమ్మనాన్నలు బాధపడుతున్నారు. అందుకే, కొంత కాలం మౌనంగా ఉండిపోయాను.



వర్క్‌షాప్‌లో

అందమైన బహుమతి..

పిల్లలు కావాలని నా భర్త కోరుకోవడంతో మా వివాహ బంధం బలంగా మారడానికే అనుకున్నాను. ఇక అతన్ని ఇబ్బంది పెట్టకూడదనుకున్నాను. రోజులు గడుస్తున్నా పరిస్థితి మెరుగుపడలేదు. కానీ, ఈ సమయంలో జీవితం నాకు కొడుకు రూపంలో అందమైన బహుమతిని ఇచ్చింది. అప్పటి వరకు సాదాసీదాగా ఉన్న నా ప్రపంచం నా కొడుకు చుట్టూ అల్లుకుపోయింది. అయితే, మా భార్యభర్తల మధ్య భావోద్వేగ బంధం లేకుండా పోయింది.

చావే మేలు అనుకున్నాను

ఒకరోజు నా భర్త, కొడుకుతో కలిసి బయటకు వెళ్లాం. నేను డ్రైవింగ్ చేస్తున్నాను. నా భర్త నాతో గొడవపడుతూనే ఉన్నాడు. కొడుకు వెనకసీట్లో కూర్చొని ఇదంతా చూస్తున్నాడు. రెడ్‌లైట్ దగ్గర కారు ఆగగానే వెనక్కి తిరిగి ఆ పిల్లవాడి వైపు చూశాను. వాడి మొహం చూసి నా గుండెల్లో గుబులు పుట్టింది. ఇలాంటి పరిస్థితుల్లో నా కొడుక్కి మంచి జీవితాన్ని ఇవ్వలేనని నిర్ణయించుకున్నాను. విడిపోవడమే మంచి నిర్ణయం అనుకున్నాను. సమాజం వెక్కిరింపులు, ప్రశ్నల మధ్య నా సమాధానం ఒక్కటే. ఈ బిడ్డ కోసమే ఈ పెళ్లిలో ఉండకూడదనుకున్నాను అని చెప్పేదాన్ని. కానీ, మా తల్లిదండ్రులు 'మా కూతురు విడాకులు తీసుకుందని' సమాజంలో చెప్పుకోవడానికి సిగ్గుపడేవారు. ఈ విషయం నన్ను ఎంతగానో బాధించింది. నా ఆత్మవిశ్వాసం ప్రతిరోజూ దెబ్బతింటూనే ఉంది. ఓ రోజు ఆవేదనతో రాత్రంతా నిద్రపోలేదు. ఫ్యాన్ వైపు చూస్తూ ఉండిపోయాను. ఉరివేసుకోవాలనుకున్నాను. అప్పుడు నా చూపు నిద్రపోతున్న నా కొడుకు ముఖం మీదకు వెళ్లింది. అమాయకమైన వాడి ముఖం చూసి, తిరిగి జీవించాలనుకున్నాను. ప్రపంచంలో ఉన్నదంతా నా బిడ్డకు ఇస్తాను అని బలంగా అనుకున్నాను.

సున్నా నుంచి ..

మొదట ఏం చేయాలో తెలియలేదు. నేనున్న ఇంటి సెల్లార్‌లో ఇంటీరియర్ డెకరేషన్ బిజినెస్ ప్రారంభించాను. ఆ వ్యాపారం విజయవంతం కావడానికి చాలా కష్టపడ్డాను. అదృష్టవశాత్తూ వ్యాపారం ఊపందుకుంది. కానీ, సంతోషంగా లేను. దీంతో ఆ వ్యాపారాన్ని మూసేయాలనుకున్నాను. నా నిర్ణయం విని అంతా ఆశ్చర్యపోయారు.

మళ్లీ ప్రేమలో..

ఏం చేయాలో తెలియకపోతే టీచర్ జాబ్ చేయమని మా నాన్న సలహా ఇచ్చారు. అలా విద్యా రంగంలోకి ప్రవేశించాను. నాకు తెలియకుండానే చాలా సంతోషంగా మారిపోయాను. వీటన్నింటి మధ్య మళ్లీ ప్రేమలో పడ్డాను. మా బంధం పదేళ్లపాటు సంతృప్తికరంగా.. సంతోషంగా కొనసాగింది. కానీ, ఆ తర్వాత అతను నన్ను వదిలేసి కెరీర్‌ను ఎంచుకున్నాడు. నా జీవితంలో మళ్లీ చీకటి కాలం. ఈ సంబంధం నన్ను చాలా అయోమయ స్థితికి చేర్చింది. ఆ ప్రభావం నుంచి బయటపడటం కష్టంగా మారింది. ఏమీ అర్థం కాలేదు. సైకియాట్రిస్ట్‌ను కలిసి, మందులు తీసుకుంటూ రోజులు గడిపాను.

ఎందుకు నవ్వడం లేదు...

ఒకరోజు నా కొడుకు 'అమ్మా, ఎందుకు నువ్వు నవ్వడం లేదు?' అడిగాడు. ఆ మాట నాపైన చాలా ప్రభావాన్ని చూపింది. నేను చాలా నిస్సహాయ తల్లిగా మారిపోయానా అనిపించింది. నేను బలహీనంగా మారితే నా బిడ్డ కూడా బలహీనం అవుతాడు. అందుకే, నన్ను నేను మార్చుకోవాలనుకున్నాను. మళ్లీ నన్ను నేను సంసిద్ధం చేసుకోవడం మొదలుపెట్టాను. ఈ ప్రయాణంలో నాకు నేను ఏవిధమైన ప్రాముఖ్యతనూ ఇచ్చుకోవడం లేదని అర్థమైంది. నా జీవితంలో చాలా సాధించాను. కానీ, నా సొంత విజయాలను నేను తక్కువ అంచనా వేస్తున్నాను. ఇలాంటి ఆలోచనలు నాపై పనిచేస్తున్నప్పుడు పోయిన వెలుగు నా జీవితంలోకి తిరిగి వచ్చింది. ఇప్పుడు నేను నిధిని. ఒక యువకుడికి గర్వకారణమైన తల్లిని. నాదైన జీవితంలో మైండ్‌సెట్ ట్రాన్స్‌ఫార్మేషన్ కోచ్‌గా నా నిజమైన జీవిత లక్ష్యాన్ని కనుగొన్నాను' అని చెబుతుంది నిధి సైని.

యూత్ పల్స్

టెక్నాలజీ ప్రేమికులైన
యువతరం తాజా ఆసక్తి... వెబ్3
విశాలమైన వెబ్ 3 స్పేస్‌లో స్టార్టప్‌ల నుంచి ఉద్యోగాల వరకు
ఎన్నో అవకాశాలు ఉన్నాయి.
బ్లాక్ చెయిన్ సాంకేతికత ఆధారిత వెబ్3 యువత కోసం
ఎన్నో ద్వారాలను తెరవనుంది. స్వయంప్రతిపత్తిని అందించనుంది...

వెల్‌కమ్ టు వెబ్3 వరల్డ్



ఒకప్పుడు... 'మాకు వెబ్‌సైట్‌తో పనిలేదు. ప్రింట్ మీడియా టీవీ చాలు' 'ఇ-కామర్స్‌తో పనిలేదు. ఇన్-స్టోర్ చాలు' 'మొబైల్ వెబ్‌సైట్, యాప్‌లతో పనిలేదు' 'వెబ్3 స్ట్రాటజీ మాకు అవసరం లేదు' అన్నట్లుగా ఉండేది.

90ల నుంచి 2020 వరకు సాంకేతికతకు సంబంధించిన అభిరుచులు, అభిప్రాయాలలో ఎంతో మార్పు వచ్చింది. 'మాకు అవసరం లేదు' అన్నచోటే 'మాకు తప్పనిసరిగా అవసరం' అనే మాట వినిపిస్తోంది. వెబ్3 సాంకేతిక విషయంలోనూ ఇదే మార్పు చోటు చేసుకుంది. 'ఇలా వచ్చి అలా వెళ్లి పోయే ట్రెండ్ ఇది' అనుకున్న కంపెనీలు కూడా వెబ్3 సాంకేతికతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. యూత్‌తో కనెక్ట్ కావడానికి 'వెబ్3' అనేది బలమైన సాధనం అని నమ్ముతున్నాయి. వెబ్3 మార్కెటింగ్‌పై రకరకాల కోణాలలో ఆలోచిస్తున్నాయి. వెబ్3 బ్రాండ్స్ జెన్ జెడ్ మార్కెట్‌ను చేజిక్కించుకోవడానికి సంప్రదాయ విధానాలకు భిన్నంగా కొత్తదారిలో పయనిస్తున్నాయి.

బ్లాక్‌చెయిన్-బేస్డ్ గేమింగ్ ప్లాట్‌ఫామ్స్, వర్చువల్ వరల్డ్స్ అభివృద్ధి వల్ల డిజిటల్ స్పేస్‌లో ఎక్కువ సమయం గడుపుతోంది యువతరం. వెబ్-3 బేస్డ్ గేమ్స్, వర్చువల్ వరల్డ్స్ యువ ప్లేయర్స్‌కు అటానమస్, ఓనర్‌షిప్, మానిటైజేషన్ అవకాశాలు కల్పిస్తున్నాయి. ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్‌లాంటి సెంట్రలైజ్‌డ్ ప్లాట్‌ఫామ్స్ మీద ఆధారపడకుండా కంటెంట్ క్రియేట్ చేయడానికి, షేర్ చేయడానికి, కంటెంట్‌ను మానిటైజ్ చేయడానికి వెబ్3 టెక్నాలజీ ఉపయోగపడుతుంది.

'వెబ్3 విశ్వరూపాన్ని మనం ఇంకా చూడనప్పటికీ కొత్తరకం అవకాశాలతో క్రియేటర్‌లను ఆకట్టుకుంటోంది. మధ్యవర్తుల అవసరం లేకుండానే డైరెక్ట్-కన్స్యూమర్ ఇంటరాక్షన్స్‌కు వీలు కల్పిస్తుంది. సంప్రదాయ పద్ధతుల కంటే భిన్నంగా ఆదాయ మార్గాలను విస్తరించుకో వచ్చు. స్థూలంగా చెప్పాలంటే వెబ్3 అనేది సంప్రదాయ మోడల్స్‌ను సవాలు చేసేలా ఉంటుంది. క్రియేటర్‌లు ఒక అడుగు ముందుకు వేసేలా చేస్తుంది' అంటున్నాడు ఏఐ పవర్డ్ క్రియేటర్ టెక్ కంపెనీ 'యానిమెటా' సీయివో దేవ దత్తా.

'వెబ్3 జెన్-జెడ్, మిలీనియల్స్‌ను ఆకట్టుకుంటుంది. వెబ్3 నుంచి మరిన్ని ప్రయోజనాలను ఆశిస్తున్నారు. వెబ్3 యాప్ ఫౌండర్‌లు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని తగిన కసరత్తు చేస్తే, ఆసక్తికరమైన ఐడియాలతో ముందుకు వస్తే గేమ్‌లో ముందు ఉంటారు' అంటున్నాడు సాఫ్ట్‌వేర్ కంపెనీ 'యాప్‌టోపియా' ఫౌండర్, సీయివో జోనాథన్ కె.

వెబ్ 3 రంగంలో భారత్ వేదికగా ఎన్నో కంపెనీలు పని చేస్తున్నాయి. వీటిద్వారా యువతకు ఎన్నో ఉద్యోగావకాశాలు దొరుకుతాయి. సాలిడిటీ డెవలపర్, మార్కెటింగ్ ఆఫీసర్, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్, బ్లాక్ చెయిన్ ఆఫీసర్, కమ్యూనిటీ మేనేజర్, యూనిటీ డిజైనర్, ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్, ఈవెంట్స్ మేనేజర్, ఎనలిస్ట్, బీటా టెస్టర్, టెక్నికల్ రైటర్, డెవలపర్, డిజైనర్, ఇన్‌ఫ్లూయెన్సర్ మేనేజర్... ఇలా ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి.

నయా ఇంటర్‌నెట్

వరల్డ్ వైడ్ వెబ్(డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ)కు సంబంధించి వెబ్ 1 నుంచి వెబ్ 2 వరకు జరిగిన ప్రస్థానాన్ని గమనిస్తే ఎంతో మార్పు కనిపిస్తుంది. వెబ్ 1 దశలోని వెబ్‌సైట్‌ల నుంచి వెబ్2 దశలోని సోషల్ మీడియా విస్తృతి వరకు ఆ మార్పును ప్రతిబింబిస్తాయి. అయితే 'అభివృద్ధి'గా చూపుతున్న మార్పు బడా కంపెనీలకే మేలు చేసిందనే విమర్శ ఉంది. ఈ నేపథ్యంలోనే పెద్ద కంపెనీల ఆధిపత్యానికి, నియంత్రణకు వీలు లేని వెబ్3 టెక్నాలజీపై యువతరం ఆసక్తి ప్రదర్శిస్తోంది. వెబ్3 స్టార్టప్‌లు భారతీయ మార్కెట్‌లో ఊపందుకోవడం ఈ మార్పును సూచిస్తోంది. వెబ్ 3లో డీసెంట్రలైజ్‌డ్ విధానంలో డేటా ఒకదానితో ఒకటి అనుసంధానం అవుతుంది. వెబ్ 3 అనేది ఒక తరం మార్పునకు ప్రతిబింబం. 'వెబ్ 3కి కొలమానం ఏమిటి?' అనే విషయానికి వస్తే ఒక యాప్‌లో డాటా, ఐడెంటిటీ, ప్రైవసీ, ప్లే-టు-ఎర్న్‌లాంటి ఎలిమెంట్స్ తప్పకుండా ఉండాలి. స్వెట్‌కాయిన్ (ఫిట్‌నెస్), ట్విగ్(ఫైనాన్స్)లాంటి వెబ్3 రైజింగ్ స్టార్స్ ఆచరణ స్థాయిలో వెబ్3 ఎలిమెంట్స్‌ను అర్థం చేసుకోవడానికి ఉపకరిస్తాయి

మైరాతో అంతర్జాతీయ స్థాయికి...



వెబ్ 3 వరల్డ్ ఇనోవేషన్‌కు సంబంధించి ఘనంగా చెప్పుకునే వారిలో శిల్పా కర్కెరా ఒకరు. నాగ్‌పూర్‌కు చెందిన శిల్ప ఏఐ అండ్ బ్లాక్‌చెయిన్ సొల్యూషన్స్, ప్రాడక్ట్ కంపెనీ 'మైరా టెక్నాలజీకి' ఫౌండర్, సీయివో. ప్రస్తుతం ఈ కంపెనీ ఆరు దేశాల్లో పని చేస్తోంది. 'మైరా బ్లాక్స్' అనే బ్లాక్ చెయిన్ టెక్నాలజీ అవేర్‌నెస్ ప్రోగ్రామ్స్‌తో పరిశ్రమలు, ఆర్థిక సంస్థలు, కమ్యూనిటీలతో కలిసి పనిచేస్తోంది. ఎన్నో కొత్త కంపెనీలకు టెక్నాలజీ అడ్వైజర్‌గా పని చేసింది. 'మీకు సాంకేతిక విషయాలపై ఆసక్తి ఉంటే మీలాగే ఆసక్తి ఉన్నవారితో స్నేహం చేయండి. నిపుణులతో మాట్లాడండి' అంటుంది శిల్ప

ముగ్గు ముచ్చట



గిద్దిగాని సరళ
ఎలగందల్,
కరీంనగర్ జిల్లా



9 చుక్కలు
5 వచ్చేవరకు
మధ్య చుక్క





లక్ష్మీ కుమారి
నందలూరు, అన్నమయ్య జిల్లా

15 చుక్కలు
7 వచ్చేవరకు, సందు చుక్క





బి. యమునా రాణి
న్యూ మిర్జాలగూడ
మల్కాజిగిరి, హైదరాబాద్

17 చుక్కలు,
8 వచ్చే వరకు
మధ్య చుక్క



22 చుక్కలు,
22 వరుసలు



దామరాజు లక్ష్మి,
ఆర్.ఆర్.పేట, ఏలూరు



అంకిత రైనా శుభారంభం

ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ క్వాలిఫయింగ్ టోర్నీలో భారత స్టార్ అంకిత రైనా శుభారంభం చేసింది. మెల్‌బోర్న్‌లో మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 221వ ర్యాంకర్ అంకిత 6-4, 5-7, 7-6 (10/7)తో ప్రపంచ 158వ ర్యాంకర్ జెస్సికా బుజస్ మనెరో (స్పెయిన్)పై గెలిచింది. 2 గంటల 49 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఇద్దరూ తమ సర్వీస్‌లను ఎనిమిదిసార్లు కోల్పోయారు. నిర్ణాయక మూడో సెట్ టైబ్రేక్‌లో అంకిత పైచేయి సాధించి విజేతగా నిలిచింది. రెండో రౌండ్‌లో ప్రపంచ 132వ ర్యాంకర్ సారా బెజ్‌లెక్ (చెక్ రిపబ్లిక్)తో అంకిత తలపడుతుంది.

కేప్‌టౌన్ పిచ్‌పై 'అసంతృప్తి'



భారత్, దక్షిణాఫ్రికా మధ్య రెండో టెస్టు జరిగిన కేప్‌టౌన్‌లోని న్యూలాండ్స్ పిచ్‌పై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) అసంతృప్తి వ్యక్తం చేసింది. ఐదు సెషన్లలోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో వాడిన పిచ్ సంతృప్తికరంగా లేదని అభిప్రాయ పడింది. ఈ టెస్టుకు రిఫరీగా వ్యవహరించిన క్రిస్ బ్రాడ్ తన నివేదికను ఐసీసీకి అందించారు. దీని ప్రకారం న్యూలాండ్స్ పిచ్‌కు ఒక డీ మెరిట్ రేటింగ్ ఇచ్చారు.

శ్రీకాంత్ సంచలనం

ఐదో ర్యాంకర్ జొనాథన్ క్రిస్టీపై గెలుపు



కౌలాలంపూర్: మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్, ప్రపంచ మాజీ నంబర్‌వన్ కిడాంబి శ్రీకాంత్ సంచలన విజయంతో శుభారంభం చేశాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 24వ ర్యాంకర్ శ్రీకాంత్ 12-21, 21-18, 21-16తో ప్రపంచ ఐదో ర్యాంకర్ జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా)పై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. తదుపరి రౌండ్‌లో ఎన్జీ కా లాంగ్ అంగుస్ (హాంకాంగ్)తో శ్రీకాంత్ తలపడతాడు. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో అశ్విని పొన్నప్ప-తనీషా (భారత్) జోడీ 21-13, 21-16తో ఫ్రాన్సెస్కా కోర్బి-అలీసన్ లీ (అమెరికా) జంటపై నెగ్గి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది.

'ఆసియా' టోర్నీతో సింధు పునరాగమనం



న్యూఢిల్లీ: మోకాలి గాయం నుంచి కోలుకుంటున్న భారత మహిళా స్టార్ షట్లర్ పీవీ సింధు వచ్చే నెలలో జరిగే ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌తో పునరాగమనం చేయనుంది. ఫిబ్రవరి 13 నుంచి 19 వరకు మలేసియాలోని షా ఆలమ్‌లో జరిగే ఈ టోర్నీలో పాల్గొనే భారత మహిళల, పురుషుల జట్లను మంగళవారం ప్రకటించారు. గత ఏడాది అక్టోబర్‌లో ఫ్రెంచ్ ఓపెన్‌లో పాల్గొన్నాక సింధు మోకాలి గాయంతో ఆటకు దూరమైంది. ప్రస్తుతం బెంగళూరులోని ప్రకాశ్ పదుకొనే అకాడమీలో ఇండోనేసియా కోచ్ అగుస్ ద్వి సాంతోసో పర్యవేక్షణలో సింధు శిక్షణ తీసుకుంటోంది.

భారత మహిళల జట్టు: సింధు, అన్‌మోల్, తన్వీ శర్మ, అష్మిత, ట్రెసా జాలీ, గాయత్రి గోపీచంద్, అశ్విని పొన్నప్ప, తనీషా క్రాస్టో, ప్రియా దేవి, శ్రుతి మిశ్రా. **భారత పురుషుల జట్టు:** ప్రణయ్, లక్ష్య సేన్, కిడాంబి శ్రీకాంత్, చిరాగ్ సేన్, సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి, ధ్రువ్ కపిల, అర్జున్, సూరజ్ గోలా, పృథ్వీ రాయ్.

టి20 సిరీస్ కూడా చేజారె...

- మూడో మ్యాచ్‌లోనూ ఓడిన భారత మహిళల జట్టు
- 7 వికెట్లతో ఆస్ట్రేలియా విజయం
- సిరీస్ 2-1తో కైవసం



హర్మన్‌ప్రీత్

ముంబై: స్ఫూర్తిదాయక ప్రదర్శనతో ఆస్ట్రేలియా మహిళలపై ఏకైక టెస్టు మ్యాచ్‌లో నెగ్గి సత్తా చాటిన భారత్ పరిమిత ఓవర్ల సమరాల్లో మాత్రం పేలవమైన ఆటతీరును చూపించింది. వన్డే సిరీస్‌లో 0-3తో చిత్తుగా ఓడిన మన మహిళలు ఇప్పుడు టి20 సిరీస్‌ను కూడా చేజార్చుకున్నారు. మంగళవారం జరిగిన చివరిదైన మూడో టి20లో ఆస్ట్రేలియా 7 వికెట్ల తేడాతో భారత్‌పై విజయం సాధించింది. ఫలితంగా 2-1తో సిరీస్‌ను సొంతం చేసుకుంది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 147 పరుగులు చేసింది. రిచా ఘోష్ (28 బంతుల్లో 34; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలవగా...స్మృతి మంధాన (28 బంతుల్లో 29; 2 ఫోర్లు, 1 సిక్స్), షఫాలీ వర్మ (17 బంతుల్లో 26; 6 ఫోర్లు) రాణించారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (3) మళ్లీ విఫలమైంది. ఆసీస్ బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అనాబెల్ సదర్లాండ్, జార్జ్ వేర్‌హమ్ చెరో 2 వికెట్లు పడగొట్టగా... మేగన్ షుట్, యాష్లే గార్డ్‌నర్ చెరో వికెట్ తీశారు. అనంతరం ఆస్ట్రేలియా 18.4 ఓవర్లలో 3 వికెట్లకు 149 పరుగులు చేసింది. అలీసా హీలీ (38 బంతుల్లో 55; 9 ఫోర్లు, 1 సిక్స్), బెత్ మూనీ (45 బంతుల్లో 52 నాటౌట్; 5 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించారు. వీరిద్దరు తొలి వికెట్‌కు 60 బంతుల్లోనే 85 పరుగులు జత చేశారు. పూజ వస్త్రకర్‌కు 2 వికెట్లు దక్కాయి. ఆసీస్ కెప్టెన్ అలీసా హీలీకి 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు దక్కింది. వచ్చే సెప్టెంబర్‌లో బంగ్లాదేశ్‌లో మహిళల టి20 వరల్డ్ కప్ జరగనుండగా... ఆలోపు మన టీమ్ ఒక్క టి20 మ్యాచ్ కూడా ఆడబోవడం లేదు. తొలి వికెట్‌కు 28 బంతుల్లో 39 పరుగులు జోడించి భారత్‌కు షఫాలీ, స్మృతి సరైన ఆరంభం అందించారు. షఫాలీని అవుట్ చేసిన షుట్ మహిళల టి20ల్లో అత్యధిక వికెట్లు (131)తీసిన బౌలర్‌గా అవతరించింది. షఫాలీ అవుటయ్యాక టీమిండియా 6 పరుగుల వ్యవధిలో జట్టు 3 కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. జెమీమా (2), హర్మన్‌ప్రీత్ ఇలా వచ్చి అలా వెళ్లారు. ఈ దశలో రిచా కొన్ని చక్కటి షాట్లతో జట్టును ఆదుకుంది. దీప్తి (14), అమన్‌జోత్ (17 నాటౌట్)లతో కలిసి తర్వాతి రెండు వికెట్లకు 69 పరుగులు జోడించడంతో టీమ్ చెప్పుకోదగ్గ స్కోరు సాధించింది. అయితే ఛేదనలో మెరుపు ఆరంభంతో హీలీ, మూనీ కలిసి ఆసీస్ పనిని సులువు చేశారు. టిటాస్ సాధు ఓవర్లో 3 ఫోర్లు, రేణుక వేసిన తర్వాతి ఓవర్లో 2 ఫోర్లు, 1 సిక్స్‌తో హీలీ చెలరేగింది. 6 ఓవర్లలోనే స్కోరు 54 పరుగులకు చేరగా... 34 బంతుల్లోనే హీలీ అర్ధసెంచరీ పూర్తయింది. వీరిద్దరి జోరుతో ఆసీస్ లక్ష్యంగా దిశగా వేగంగా సాగింది. హీలీని దీప్తి అవుట్ చేసిన కొద్దిసేపటికి వరుస బంతుల్లో తాలియా మెక్‌గ్రాత్ (20), పెరీ (0)లను వెనక్కి పంపించి పూజ ఆశలు రేపింది. అయితే అప్పటికే ఆలస్యమైపోయింది. మూనీ, లిచ్‌ఫీల్డ్ (17 నాటౌట్) నాలుగో వికెట్‌కు 20 బంతుల్లోనే అభేద్యంగా 32 పరుగులు జత చేసి మరో 8 బంతులు మిగిలి ఉండగానే జట్టును గెలిపించారు.





తులసీ చైతన్య



అజయ్ కుమార్



షమీ



హుసాముద్దీన్

'అర్జున'తో అందలం

- జాతీయ క్రీడా పురస్కారాలు అందుకున్న షమీ, హుసాముద్దీన్, అజయ్ కుమార్ రెడ్డి
- సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి, ఇషా సింగ్ గైర్హాజరు
- ఆంధ్రప్రదేశ్ స్విమ్మర్ తులసీ చైతన్యకు టెన్‌జింగ్ నార్గే అవార్డు

న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మక క్రీడా పురస్కారం 'అర్జున' అవార్డు ప్రదాన కార్యక్రమం మంగళవారం రాష్ట్రపతి భవన్‌లో ఘనంగా జరిగింది. వేర్వేరు క్రీడాంశాల్లో సత్తా చాటి ఈ పురస్కారానికి ఎంపికైన భారత ఆటగాళ్లు దేశ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా దీనిని సగర్వంగా అందుకున్నారు. భారత క్రికెట్ జట్టు స్టార్ పేస్ బౌలర్ మొహమ్మద్ షమీతో పాటు తెలంగాణ బాక్సర్ మొహమ్మద్ హుసాముద్దీన్ అర్జున అవార్డు అందుకున్న వారిలో ఉన్నారు. జకార్తాలో ఆసియా ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలో ఆడుతున్న కారణంగా తెలంగాణ షూటర్ ఇషా సింగ్ ఈ అవార్డును అందుకోలేకపోయింది. దేశ అత్యున్నత క్రీడా పురస్కారం మేజర్ ధ్యాన్‌చంద్ 'ఖేల్‌రత్న' అవార్డుకు ఎంపికైన టాప్ షట్లర్లు సాత్విక్ సాయిరాజ్ (ఆంధ్రప్రదేశ్), చిరాగ్ శెట్టి (మహారాష్ట్ర) కూడా ఈ కార్యక్రమానికి గైర్హాజరయ్యారు. వీరిద్దరు ప్రస్తుతం కౌలాలంపూర్‌లో జరుగుతున్న మలేసియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో పాల్గొంటున్నారు. భారత మహిళా చెస్ గ్రాండ్‌మాస్టర్, తమిళనాడు అమ్మాయి ఆర్. వైశాలి, రెజ్లర్ అంతిమ్ పంఘాల్, అథ్లెట్ పారుల్ చౌదరి, భారత కబడ్డీ జట్టు కెప్టెన్, తెలుగు టైటాన్స్ జట్టు స్టార్ ప్లేయర్ పవన్ కుమార్ సెహ్రావత్ కూడా అర్జున పురస్కారాన్ని అందుకున్నారు. పారా ఆర్చర్ శీతల్ దేవి అవార్డు అందుకుంటున్నప్పుడు ప్రేక్షకులు పెద్ద ఎత్తున చప్పట్లతో అభినందించగా... వీల్‌చైర్‌లో కూర్చున్న పారా కనోయిస్ట్ ప్రాచీ యాదవ్ వద్దకు వెళ్లి స్వయంగా రాష్ట్రపతి అవార్డు అందించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అంధ క్రికెటర్ అజయ్ కుమార్ రెడ్డి కూడా అర్జున అవార్డును అందుకోగా... ఆంధ్రప్రదేశ్‌కే చెందిన స్విమ్మర్ మోతుకూరి తులసీ చైతన్య టెన్‌జింగ్ నార్గే జాతీయ సాహస పురస్కారాన్ని స్వీకరించాడు. విజయవాడ సిటీ స్పెషల్ బ్రాంచ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న 34 ఏళ్ల తులసీ చైతన్య కాటలీనా చానెల్, జిబ్రాల్టర్ జలసంధి, పాక్ జలసంధి, ఇంగ్లిష్ చానెల్, నార్త్ చానెల్‌లను విజయవంతంగా ఈది తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నాడు. 2023 సంవత్సరానికి ఇద్దరికి 'ఖేల్ రత్న'... 26 మందికి 'అర్జున'... ఐదుగురికి 'ద్రోణాచార్య' రెగ్యులర్ అవార్డు... ముగ్గురికి 'ద్రోణాచార్య' లైఫ్‌టైమ్... ముగ్గురికి 'ధ్యాన్‌చంద్ లైఫ్‌టైమ్' అవార్డులు ప్రకటించారు. ప్రతి ఏటా జాతీయ క్రీడా దినోత్సవం (ఆగస్టు 29న) ఈ అవార్డులను అందజేస్తారు. అయితే ఆ సమయంలో హాంగ్జౌ ఆసియా క్రీడలు జరుగుతుండటంతో అవార్డుల ఎంపికతోపాటు ప్రదానోత్సవ కార్యక్రమాన్ని కూడా వాయిదా వేశారు.

తెలుగు టైటాన్స్ ఖాతాలో పదో పరాజయం

ముంబై: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో తెలుగు టైటాన్స్ జట్టు నిరాశాజనక ప్రదర్శన కొనసాగుతోంది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ జట్టు 26-46తో బెంగాల్ వారియర్స్ జట్టు చేతిలో ఓడిపోయింది. ఈ లీగ్‌లో టైటాన్స్ జట్టుకిది పదో పరాజయం. టైటాన్స్ జట్టులో కెప్టెన్ పవన్ సెహ్రావత్ మినహా మిగతా ఆటగాళ్లు విఫలమయ్యారు. పవన్ 11 పాయింట్లు స్కోరు చేశాడు. వారియర్స్ జట్టులో వైభవ్ 9 పాయింట్లు, నితిన్ 9 పాయింట్లు, విశ్వాస్ 8 పాయింట్లు, శుభమ్ 6 పాయింట్లు సాధించారు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో యూపీ యోధాస్‌తో తమిళ్ తలైవాస్; యు ముంబాతో హరియాణా స్టీలర్స్ తలపడతాయి.

పాయింట్ల పట్టిక (PKL)

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
పుణేరి పల్టన్	10	9	1	0	46
దబంగ్ ఢిల్లీ	11	7	3	1	40
గుజరాత్ జెయింట్స్	11	7	4	0	39
జైపూర్ పింక్ పాంథర్స్	10	6	2	2	38
యు ముంబా	10	6	4	0	32
హరియాణా స్టీలర్స్	10	6	4	0	31
బెంగళూరు బుల్స్	12	5	7	0	31
పట్నా పైరేట్స్	11	5	6	0	29
బెంగాల్ వారియర్స్	11	4	5	2	28
యూపీ యోధాస్	11	3	7	1	21
తమిళ్ తలైవాస్	10	2	8	0	14
తెలుగు టైటాన్స్	11	1	10	0	9

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

మెహులీ-రుద్రాంక్ష్ జోడీకి స్వర్ణం



జకార్తా: ఆసియా ఒలింపిక్ క్వాలిఫయింగ్ షూటింగ్ టోర్నీలో మంగళవారం భారత్‌కు ఒక స్వర్ణం, ఒక రజతం లభించాయి. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ విభాగంలో మెహులీ ఘోష్-రుద్రాంక్ష్ పాటిల్ జోడీ బంగారు పతకం... 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ విభాగంలో రిథమ్ సాంగ్వాన్-అర్జున్ జంట రజత పతకం గెలిచింది. ఫైనల్స్‌లో మెహులీ-రుద్రాంక్ష్ 16-10తో షెన్ యుఫాన్-జు మింగ్‌షుయ్ (చైనా)లపై నెగ్గగా... రిథమ్-అర్జున్ 11-17తో ట్రిన్-క్వాంగ్ (వియత్నాం)ల చేతిలో ఓడింది.

సినిమా

మా ఇద్దరికీ సంక్రాంతి కలిసొచ్చిన పండగ

– మహేశ్‌బాబు



మీనాక్షీ చౌదరి, శ్రీలీల, రాధాకృష్ణ, మహేశ్‌బాబు, త్రివిక్రమ్, తమన్, 'దిల్' రాజు

''నాన్నగారికి (సూపర్ స్టార్ కృష్ణ), నాకు సంక్రాంతి బాగా కలిసొచ్చిన పండగ. మా సినిమా సంక్రాంతికి రిలీజైతే అది బ్లాక్‌బస్టరే.. ఈసారి కూడా 'గుంటూరు కారం'తో బాగా గట్టిగా కొడతాం. కానీ, ఈసారి కొంచెం కొత్తగా ఉంది. ఎందుకంటే నాన్నగారు మన మధ్య లేరు. ఆయన నా సినిమా చూసి కలెక్షన్స్, సినిమా గురించి చెబుతుంటే చాలా ఆనందంగా ఉండేది. ఆయన ఫోన్ కోసం ఎదురు చూసేవాణ్ణి. ఇప్పుడు అవన్నీ మీరే (ఫ్యాన్స్) చెప్పాలి నాకు. ఇక నుంచి మీరే నాకు అమ్మానాన్న.. మీరే అన్నీ (చెమర్చిన కళ్లతో)'' అన్నారు మహేశ్‌బాబు. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో మహేశ్‌బాబు, శ్రీలీల జంటగా మీనాక్షీ చౌదరి కీలక పాత్రలో నటించిన చిత్రం 'గుంటూరు కారం'. మమత సమర్పణలో ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మంగళవారం గుంటూరులో జరిగిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకలో **మహేశ్‌బాబు మాట్లాడుతూ** – ''నేను త్రివిక్రమ్ గారి సినిమాలు చేసినప్పుడల్లా నా నటనలో ఒక మ్యాజిక్ జరుగుతుంది. 'అతడు, ఖలేజా' చిత్రాలకు మ్యాజిక్ జరిగింది. ఇప్పుడు 'గుంటూరు కారం'లోనూ ఆ మ్యాజిక్ జరిగింది. ఒక కొత్త మహేశ్‌బాబుని చూడబోతున్నారు. దానికి ఆయనే కారణం. మా నిర్మాత చినబాబుగారికి అత్యంత ఇష్టమైన హీరో నేనే. ఈ సినిమా చేస్తున్నప్పుడు ఆయన ముఖంలో వచ్చిన సంతోషం చూసినప్పుడు నాకు ఆనందంగా అనిపించేది. శ్రీలీలతో డ్యాన్స్ చేయడమంటే వామ్మో.. అదేం డ్యాన్సు.. హీరోలందరికీ తాట ఊడిపోద్ది (నవ్వుతూ). తమన్ ప్రతిసారీ నాకు బెస్ట్ ఇస్తాడు. 'కుర్చీ మడతపెట్టి..' పాట చూస్తే థియేటర్లు బద్దలయిపోతాయి. పాతికేళ్లుగా మీరు (ఫ్యాన్స్) చూపించిన అభిమానం మరచిపోలేను. మాటల్లేవ్.. చేతులెత్తి దండం పెట్టడం తప్ప నాకేమీ తెలియదు.. మీరెప్పుడూ నా గుండెల్లో ఉంటారు'' అన్నారు. **త్రివిక్రమ్ మాట్లాడుతూ** – ''కృష్ణగారు తెలుగు సినిమాలో విడదీయలేని ఒక అంతర్భాగం. అలాంటి గొప్ప మహానటుడు, మహా మనిషితో నేను నేరుగా పని చేయలేకపోయాను. కానీ, ఆయన పని చేసిన ఓ సినిమాకి పోసానిగారి వద్ద అసిస్టెంట్‌గా చేశాను. ఆ తర్వాత 'అతడు, ఖలేజా' సినిమాలు తీసినప్పుడు ఆయనతో మాట్లాడాను. అలాంటి గొప్ప వ్యక్తికి కొడుకుగా పుట్టిన మహేశ్‌గారు ఎంత అదృష్టవంతుడో అనిపిస్తుంటుంది. ఒక సినిమాకి 100 శాతం పని చేయాలంటే 200 శాతం పని చేసే హీరో ఎవరైనా ఉన్నారంటే మహేశ్‌గారే.. ఈ మాట చెప్పడానికి తెలుగు ఇండస్ట్రీలో ఎవరు కూడా వెనక్కి తిరిగి చూడరు. 'అతడు, ఖలేజా'లకు పని చేసినప్పుడు ఎలా ఉన్నారో ఇప్పుడూ అలాగే ఉన్నారు. అది అందం పరంగా, నటన పరంగానూ. ఈ సంక్రాంతిని రమణగాడితో కలిసి థియేటర్లలో ఆనందంగా జరుపుకుందాం'' అన్నారు. నిర్మాత **'దిల్' రాజు మాట్లాడుతూ**– ''చినబాబు, నాగవంశీల సక్సెస్ జర్నీ అద్భుతంగా ఉంది. త్రివిక్రమ్ ప్రతి సినిమాలో ఏదో మాయ చేస్తారు.. ఈ సినిమాలో కూడా చేశారు. 'గుంటూరు కారం'తో మహేశ్‌గారు కలెక్షన్ల తాట తీస్తారు. బ్లాక్ బస్టర్ సినిమా రాబోతోంది'' అన్నారు.

నా పాట తెలిసినంతగా నేను తెలియను!

– కృష్ణకాంత్



''తెలుగు చిత్ర పరిశ్రమలో పదకొండేళ్ల ప్రయాణం నాది (తొలి చిత్రం 'అందాల రాక్షసి'). ఇన్నేళ్ల కెరీర్ పరంగా హ్యాపీగా ఉన్నాను. అయితే నా పాటలు తెలిసినంతగా నేనెక్కువగా జనాలకు తెలియదేమో అనిపిస్తుంటుంది. అయినా నేను కాదు.. నా పాటలు వారికి తెలియ డం సంతృప్తిగా ఉంది'' అని పాటల రచయిత కృష్ణకాంత్ అన్నారు. నేడు ఆయన బర్త్‌డే (జనవరి 10). ఈ సందర్భంగా మంగళవారం కృష్ణకాంత్ మాట్లాడుతూ– ''ఇన్నేళ్లలో ఎన్నో పాటలు రాశాను. 2023లో 'విరూపాక్ష, కోట బొమ్మాళి, హాయ్ నాన్న, సలార్, జైలర్, జవాన్, లియో'.. ఇలా 27 సినిమాల్లో 70 పాటలు రాశాను. సిద్ధార్థ్ 'చిన్నా', 'ది మార్వెల్స్' చిత్రాలకు పాటలు, మాటలు రాశా. మన పాట వైరల్ కావాలనే ఆలోచనతో రాస్తే సినిమా ఆడినన్ని రోజులు గుర్తుంటుంది.. ఆ తర్వాత మరచిపోతారు. నా ప్రతి పాటలో ఓ భావం, అర్థం ఉండాలనే ఆలోచనతో రాస్తాను. నేను పాటలు రాసిన 'హను-మాన్', 'సైంధవ్', 'ఈగల్', 'కల్కి 2898 ఏడీ' చిత్రాలు రిలీజ్ కానున్నాయి. ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వం వహిస్తున్న సినిమాకీ పాటలు రాశాను'' అన్నారు.



''ఓ ప్రాసెస్‌ను ఫాలో అవుతూ నిజాయితీగా సినిమా తీస్తే, ఆ సినిమా కచ్చితంగా విజయం సాధిస్తుందని నమ్ముతాను. 'సైంధవ్'ను కూడా ఇలాగే తీశాను. ఈ సినిమా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. అలాగే జయాపజయాల గురించి ఆలోచించే మనస్తత్వం నాకు లేదు. నా ప్రయాణాన్ని ఆస్వాదిస్తాను'' అన్నారు శైలేష్ కొలను. వెంకటేశ్ హీరోగా శైలేష్ కొలను దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సైంధవ్'. వెంకట్ బోయనపల్లి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 13న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం విలేకర్ల సమావేశంలో శైలేష్ కొలను చెప్పిన విశేషాలు.

నా జీవితంలోని ప్రేమతో సినిమా చేస్తాను

– దర్శకుడు శైలేష్ కొలను

- 'హిట్ 2' రిలీజ్ తర్వాత నిర్మాత వెంకట్‌గారు చెప్పారని వెంకటేశ్‌గారిని కలిశా. ఆయన్ను కలిసిన తొలిసారి మేం సినిమాలు కాకుండా జీవిత విశేషాలను మాట్లాడుకున్నాం. అలా రెండు మూడుసార్లు కలుసుకున్నాక ఓ సందర్భంలో ఆయనకు 'సైంధవ్' స్టోరీ లైన్ చెప్పాను. ఆ తర్వాత పూర్తి కథ చెప్పా. 'ఈ స్క్రిప్ట్ నా 75వ సినిమాకు సరిపోతుందనిపిస్తోంది. ఈ సినిమా చేద్దాం' అన్నారు. వెంకటేశ్‌గారి అనుభవం, ఆయన సూచనలు, సలహాలు తీసుకుని 'సైంధవ్' స్క్రిప్ట్‌ను మరింత బాగా రెడీ చేశాను. అలాగే వెంకటేశ్‌గారు చెప్పారని, సురేష్‌బాబుగారికి కూడా కథ వినిపించాను. ఆయన కొన్ని ఇన్‌పుట్స్ ఇచ్చారు
- దర్శకుడిగా నేను తొలుత ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్స్ చేశాను. కానీ 'సైంధవ్' ఎమోషనల్ డెప్త్ ఉన్న ఫిల్మ్. స్పైనల్ మస్కులర్ అట్రోఫీ అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్న తన చిన్నారి కుమార్తె గాయత్రిని (సారా పాత్ర)ని తండ్రిగా సైంధవ్ (వెంకటేశ్ పాత్ర) ఏ విధంగా కాపాడుకుంటాడు? గాయత్రికి కావాల్సిన రూ. 17 కోట్ల ఖరీదైన ఇంజక్షన్ కోసం ఏ విధంగా పోరాటం చేస్తాడు? అనేది ఈ చిత్రకథ. వెంకటేశ్‌గారి పాత్రకు ఫ్లాష్ బ్యాక్ స్టోరీ ఉంటుంది. కానీ రొటీన్‌గా ఉండదు. ఎంత కొత్తగా డిజైన్ చేశానన్నది థియేటర్స్‌లో చూస్తారు. అలాగే ఈ సినిమా కోసం 'ఇంద్రప్రస్థ' అనే ప్రత్యేకమైన సిటీని క్రియేట్ చేశాం. మేజర్‌గా నైట్ షూట్ చేయాల్సి వచ్చింది. నైట్ షూట్స్ అని వెంకటేశ్‌గారికి ముందే చెప్పాను. బాగా సపోర్ట్ చేశారు. 'సైంధవ్'ను ప్రేక్షకులు సపోర్ట్ చేస్తే పార్ట్ 2 చేసే స్కోప్ కథలో ఉంది
- థ్రిల్లర్స్, యాక్షన్ చిత్రాలే కాదు.. ఓ దర్శకుడిగా అన్ని రకాల సినిమాలు చేయాలని ఉంది. నాది ప్రేమ వివాహం. నా జీవితంలో జరిగిన లవ్ మూమెంట్స్‌ను ఓ కథగా రాశాను. తప్పకుండా ఈ సినిమా చేస్తాను. అలాగే నానీగారితో 'హిట్ 3' ఉంటుంది.

వరాలు అందరికీ కనెక్ట్ అవుతుంది

– ఆషికా రంగనాథ్



నాగార్జున హీరోగా నటించిన తాజా చిత్రం 'నా సామిరంగ'. ఈ చిత్రంలో 'అల్లరి' నరేశ్, రాజ్ తరుణ్, ఆషికా రంగనాథ్, మిర్నా మీనన్, రుక్సార్ థిల్లాన్ కీలక పాత్రల్లో నటించారు. విజయ్ బిన్నీ దర్శకత్వంలో పవన్‌కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం విలేకర్ల సమావేశంలో ఆషికా రంగనాథ్ మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో రెండు వేరియేషన్స్ ఉన్న వరాలు (వరలక్ష్మి) పాత్ర చేశాను. స్వతంత్ర భావాలు కలిగిన అమ్మాయి వరాలు. కాస్త రెబల్‌గా ఉంటుంది. అందుకే వరాలు పాత్రకు అమ్మాయిలందరూ కనెక్ట్ అవుతారని నా నమ్మకం. నాగార్జున గారు రొమాంటిక్ హీరో. కథకు అనుగుణంగా మా పాత్రల మధ్య రొమాంటిక్ సన్నివేశాలు ఉంటాయి. విజయ్ బిన్నీగారు ఈ సినిమాను సంక్రాంతికి విడుదల చేస్తామన్నప్పుడు జోక్ చేస్తున్నారేమో? అనుకున్నాను. ఎందుకంటే అంత తక్కువ టైమ్‌లో షూటింగ్ పూర్తవుతుందా అని డౌట్. కానీ నాగ్ సార్ హార్డ్ వర్క్, యూనిట్ అందరి సపోర్ట్‌తో ఈ సినిమా సంక్రాంతికి విడుదలవుతోంది. ప్రస్తుతం తమిళంలో సిద్ధార్థ్‌తో ఓ సినిమా, కన్నడంలో రెండు సినిమాలు చేస్తున్నాను'' అన్నారు. ఇంకా మాట్లాడుతూ– ''నన్ను కొందరు జూనియర్ అనుష్క అంటుంటే హ్యాపీగా ఉంది. నాకు అనుష్కగారంటే చాలా ఇష్టం. ఓ ఆర్టిస్టుగా చాలా కష్టపడి ఈ స్థాయికి చేరుకున్నాను. కన్నడలో ఓవర్‌నైట్ స్టార్‌ని కాలేదు. నటిగా విభిన్నమైన పాత్రలు చేయాలని ఉంది. పీరియాడికల్ ఫిల్మ్స్ చేయాలని ఉంది. ఎప్పటికైనా రాజమౌళిగారి సినిమాలో నటించాలని బలంగా కోరుకుంటున్నాను'' అని చెప్పుకొచ్చారు.

రీల్స్


డేట్ ఫిక్స్



రజనీ కాంత్

రజనీకాంత్, లెజెండరీ క్రికెటర్ కపిల్‌దేవ్, జీవితా రాజశేఖర్ కీలక పాత్రల్లో విష్ణు విశాల్, విక్రాంత్ హీరోలుగా నటించిన చిత్రం 'లాల్ సలామ్'. ఐశ్వర్యా రజనీకాంత్ దర్శకత్వంలో సుభాస్కరన్ ఈ సినిమాను నిర్మించారు. ఈ సినిమాను సంక్రాంతికి విడుదల చేస్తామని తొలుత చిత్రం యూనిట్ ప్రకటించింది. తాజాగా 'లాల్ సలామ్' సినిమాను ఫిబ్రవరి 9న విడుదల చేస్తామని మంగళవారం కొత్త విడుదల తేదీని ప్రకటించారు మేకర్స్. ''హిందూ, ముస్లిం యువకులు వారెంతగానో ప్రేమించే క్రికెట్ ఆట విషయంలో మతం పేరుతో గొడవలు పడుతూ ఉంటే ఆ గొడవలను మొయిద్దీన్ భాయ్ (సినిమాలో రజనీ పాత్ర) ఎలా సర్దుబాటు చేశాడు? అన్నదే చిత్రకథాంశం'' అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: ఎ.ఆర్. రెహమాన్.

విజయానికి అడ్డదారులుండవు



ప్రశాంత్, సందీప్

కొరియోగ్రాఫర్ 'ఆట' సందీప్ హీరోగా నటించిన చిత్రం 'షార్ట్ కట్'. విజయానికి అడ్డదారులుండవు అనేది ట్యాగ్‌లైన్. రామకృష్ణ కంచి దర్శకత్వంలో షర్మిల కంచి సమర్పణలో తోట రంగారావు, పున్నపు రజనీకాంత్ నిర్మించారు. హైదరాబాద్‌లో ఈ చిత్రం పోస్టర్ విడుదల, షో రీల్ వేడుక జరిగింది. రామకృష్ణ కంచి మాట్లాడుతూ– ''25 ఏళ్లుగా చిత్ర పరిశ్రమలో ఉంటూ చాలా శాఖల్లో పని చేశాను. ఆ అనుభవంతో 'షార్ట్ కట్' తీశా. ప్రస్తుతం యువత డ్రగ్స్‌కు అలవాటుపడి తమ జీవితాల్ని ఎలా నాశనం చేసుకుంటున్నారు? ఈ దందా వెనక జరుగుతున్న చీకటి కోణాలు ఏంటి? అనేది ఈ చిత్రంలో చూపించాం'' అన్నారు. ''డార్క్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రమిది'' అన్నారు 'ఆట' సందీప్. ''ఈ సినిమాను కేవలం డబ్బు కోసమే కాకుండా సమాజానికి మంచి సందేశం ఇవ్వాలని నిర్మించాం'' అన్నారు తోట రంగారావు. 'బిగ్ బాస్ 7' విజేత పల్లవి ప్రశాంత్ పాల్గొన్నారు.

రంగుల ప్రపంచంలో...



క్రాంతి, శ్రీలు

క్రాంతి, శ్రీలు హీరో హీరోయిన్లుగా పరిచయమవుతున్న చిత్రం 'కొత్త రంగుల ప్రపంచం'. నటుడు పృథ్వీరాజ్ ఈ మూవీతో దర్శకునిగా మారారు. పద్మా రేఖ, గుంటక శ్రీనివాస్ రెడ్డి, కుర్రి కృష్ణారెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 20న విడుదలవుతోంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో పృథ్వీరాజ్ మాట్లాడుతూ– ''కొత్త హీరో, కొత్త హీరోయిన్, కొత్త డైరెక్టర్.. ఇలా అందరం కలిసి 'కొత్త రంగుల ప్రపంచం' అనే మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాం. ఈ చిత్రం హిట్టవుతుందని ఆశిస్తున్నా'' అన్నారు. ''ఈ మూవీలో నా పాత్ర చాలా బాగుంటుంది'' అన్నారు క్రాంతి. ''మా నాన్న (పృథ్వీరాజ్) నన్ను హీరోయిన్‌గా పెట్టి ఈ సినిమా డైరెక్ట్ చేయడం చాలా ఆనందంగా ఉంది. ఈ మూవీ కోసం పని చేసిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు ఈ చిత్రం ప్లస్ అవుతుంది'' అని శ్రీలు అన్నారు.

సాక్షి బిజినెస్
బుధవారం
10-1-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	31	71,386
నిఫ్టీ ▲	32	21,545

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	14,864	▲	21
డోజోన్స్	37,528	▼	155
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,684	▼	10
డాక్స్	16,688	▼	28
షాంఘై	2,893	▲	6
నికాయ్	33,763	▲	386

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	62,415	▼	125
బంగారం (99.5 స్వచ్ఛత)	62,165	▼	125
వెండి (కేజీ)	71,840	▲	290

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటికి	82.66	83.68
£	బ్రిటన్ పౌండ్	ఒకటికి	104.85	107.42
€	యూరో	ఒకటికి	90.01	92.37
¥	జపాన్ ఎన్ (100)	ఒకటికి	57.22	58.58
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటికి	55.01	56.95
S$	సింగపూర్ డాలర్	ఒకటికి	61.69	63.49
SAR	సౌదీ రియాల్	పదింటికి	21.21	22.83
UAE D	యూఏఈ దిర్హామ్	పదింటికి	21.73	23.53
¥	చైనా యువాన్	పదింటికి	10.48	12.55

బీ న్యూ స్టోర్లలో 'రెడ్‌మీ నోట్ 13 5జీ సిరీస్' స్మార్ట్ ఫోన్లు



హైదరాబాద్: మల్టీ బ్రాండ్ రిటైల్ చైన్ బీ న్యూ మొబైల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ స్టోర్లలో 'రెడ్‌మీ నోట్ 13 5జీ సిరీస్' స్మార్ట్ ఫోన్ అందుబాటులోకి వచ్చింది. హైదరాబాద్‌లోని మాదాపూర్ బీ న్యూ స్టోర్‌లో మంగళవారం రుహాని శర్మ ఈ ఫోన్‌ను విడుదల చేశారు. ఐసీఐసీఐ క్రెడిట్, డెబిట్ కార్డు ద్వారా రెడ్‌మీ నోట్ 13 ప్రోప్లస్ 5జీ కొనుగోలుపై రూ.2 వేలు తక్షణ తగ్గింపు, రెడ్‌మీ నోట్ 13 5జీ కొనుగోలుపై రూ.1000 డిస్కౌంట్ పొందొచ్చు. ప్రత్యేక షావోమి లాయల్టీ బోనస్ రూ.2,500 కూడా ఉంది. అదనంగా ఏదైనా రెడ్‌మీ నోట్ 13 సిరీస్ కొనుగోలుపై రూ.1999లకే రెడ్‌మీ వాచ్ 3 యాక్టివ్‌ను పొందొచ్చు. ఆవిష్కరణ కార్యక్రమంలో సంస్థ సీఈవో సాయి నిఖిలేష్, ఎండీ సాయి నితేష్, సేల్స్ సీనియర్ మేనేజర్ సయ్యద్ అన్వర్, రిటైల్ మార్కెటింగ్ మేనేజర్ ఇఫ్తాకర్, శ్రీవాస్తవ్ పాల్గొన్నారు.

సెలెక్ట్ మొబైల్స్ 'సంక్రాంతి సూపర్ సేల్' ఆఫర్లు



హైదరాబాద్: ప్రముఖ మొబైల్ రిటైల్ చైన్ సెలెక్ట్ మొబైల్స్ రెడ్‌మీ నోట్ 13 'రెడ్‌మీ నోట్ 13 5జీ సిరీస్' స్మార్ట్ ఫోన్ అందుబాటులోకి వచ్చింది. హైదరాబాద్‌లోని మాదాపూర్ సెలెక్ట్ స్టోర్‌లో మంగళవారం సినీ నటి సిరి హనుమంతు ఈ స్మార్ట్ ఫోన్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సంస్థ సీఎండీ వై గురు 'సూపర్ సంక్రాంతి సేల్' ఆఫర్లు ప్రకటించారు. ఇందులో భాగంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుపై 7.5% వరకు తక్షణ తగ్గింపు, అన్ని మోడల్స్‌పై రూ.3000 వరకు తగ్గింపు పొందవచ్చు. బ్రాండెడ్ స్మార్ట్‌వాచ్ రూ.999 నుంచి, ఇయర్ బడ్స్ రూ.799 ప్రారంభ ధరతో అందిస్తుంది. ఎక్స్ఛేంజీ ద్వారా అన్ని ప్రముఖ బ్రాండ్‌లపై రూ.30 వేల వరకు తగ్గింపు ఇస్తుంది. మొబైల్ కొనుగోలుపై స్మార్ట్ టీవీ/సౌండ్ బార్‌ను కేవలం రూ.2999లకే పొందవచ్చు. అత్యాధునిక ఫీచర్లు కలిగిన 'రెడ్‌మీ నోట్ 13 5జీ సిరీస్' స్మార్ట్‌ఫోన్లతో పాటు 'సంక్రాంతి సూపర్ సేల్' ఆఫర్లు అన్ని సెలెక్ట్ స్టోర్లలో లభ్యమవుతాయని గురు తెలిపారు.

మూడు రోజులకు ఒక టాటా స్టార్‌బక్స్

- భారీగా కొత్త స్టోర్ల విస్తరణ
- 2028 నాటికి 1000 స్టోర్ల లక్ష్యం



ముంబై: టాటా కన్స్యూమర్, స్టార్‌బక్స్ జాయింట్ వెంచర్ కంపెనీ టాటా స్టార్‌బక్స్ (కాఫీ ఔట్‌లెట్స్) భారీ విస్తరణ ప్రణాళికలను ప్రకటించింది. ప్రతి మూడు రోజులకు ఒక కొత్త స్టోర్‌ను ప్రారంభించనున్నట్టు తెలిపింది. 2028 నాటికి దేశవ్యాప్తంగా తమ నిర్వహణలోని స్టోర్లను 1,000కి పెంచుకోవాలనే లక్ష్యంతో ఉన్నట్టు ప్రకటించింది. స్థానిక భాగస్వాములకు నైపుణ్య శిక్షణతో ఉపాధి కల్పించడం, కొత్త స్టోర్ల ప్రారంభంతో కస్టమర్లకు మెరుగైన అనుభవాన్ని అందించడం, ప్రపంచవ్యాప్తంగా స్టార్‌బక్స్ కస్టమర్లు భారత కాఫీ రుచులను ఆస్వాదించేలా ప్రోత్సహించడం తమ విధానంలో భాగంగా ఉంటాయని వెల్లడించింది. ఇరు సంస్థలు 2012లో చెరో సగం వాటాతో కూడిన జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేయడం గమనార్హం. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 54 పట్టణాల్లో 390 స్టోర్లను నిర్వహిస్తూ, 4,300 మందికి ఉపాధి కల్పిస్తోంది. 2028 నాటికి వెయ్యి స్టోర్ల లక్ష్యాన్ని సాధించేందుకు వీలుగా ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లోకి విస్తరిస్తామని, ఎయిర్‌పోర్టుల్లోనూ స్టోర్లను ప్రారంభిస్తామని, ఉద్యోగుల సంఖ్యను 8,600కు పెంచుకుంటామని ప్రకటించింది.

మహిళలకు శిక్షణ

ఫుడ్ అండ్ బేవరేజెస్ (ఎఫ్అండ్‌బీ) పరిశ్రమలో కెరీర్ కోరుకునే మహిళలకు వృత్తిపరమైన శిక్షణ అందిస్తున్నట్టు టాటా స్టార్‌బక్స్ ప్రకటించింది. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, ముంబైలో స్టోర్లలో పనిచేస్తూనే నేర్చుకునే అవకాశం కల్పిస్తున్నట్టు తెలిపింది. ఉద్యోగులకు వారంలో ఐదు రోజుల పని విధానాన్ని అమలు చేస్తున్న తొలి ఎఫ్అండ్‌బీ కంపెనీ తమదేనని పేర్కొంది.

తమిళనాడు ప్రభుత్వంతో రామ్‌రాజ్ కాటన్ ఒప్పందం



చెన్నై: రామ్‌రాజ్ కాటన్ తమిళనాడు ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందంలో భాగంగా వచ్చే అయిదేళ్లలో రూ.1,000 కోట్ల పెట్టుబడి, 5,000 మందికి ఉద్యోగావకాశాలు, చేనేత ప్రాసెసింగ్ కార్యక్రమాన్ని రామ్‌రాజ్ కాటన్ ఏర్పాటు చేయనుంది. ఒప్పంద ప్రతాలను సంస్థ వ్యవస్థాపకులు కే.ఆర్.నాగరాజన్, ముఖ్యమంత్రి స్టాలిన్‌కు అందజేశారు. 'తమిళనాడు ప్రభుత్వంతో కలిసి అమలు చేయబోతున్న పారిశ్రామిక పెట్టుబడులతో ఎంతో మంది చేనేత కార్మికులకు ఉపాధి లభిస్తుంది. అలాగే పారిశ్రామిక ప్రగతిలో తమిళనాడును మరింత అభివృద్ధి పథంవైపు తీసుకెళ్తుంది' అని నాగరాజన్ తెలిపారు.

సోనీతో విలీన డీల్‌కు కట్టుబడి ఉన్నాం

జీ ఎంటర్‌టైన్‌మెంట్ స్పష్టీకరణ



న్యూఢిల్లీ: సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియాతో (ప్రస్తుతం కల్వర్ మ్యాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ - సీఎంఈపీఎల్) విలీన డీల్‌కు కట్టుబడి ఉన్నామని జీ ఎంటర్‌టైన్‌మెంట్ (జీల్) స్పష్టం చేసింది. ఈ ఒప్పందాన్ని విజయవంతంగా పూర్తి చేసుకునేందుకు కృషి చేస్తున్నామని స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలిపింది. విలీన సంస్థకు జీల్ సీఈవో పునీత్ గోయెంకా సారథ్యం వహించడం ఇష్టం లేని కారణంగా సోనీ ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలనే యోచనలో ఉన్నట్లుగా వార్తలు వచ్చిన నేపథ్యంలో జీల్ వివరణ ప్రాధాన్యం సంతరించుకుంది. జీల్‌తో తమ భారత విభాగం సీఎంఈపీఎల్‌ను విలీనం చేసేందుకు జపాన్‌కు చెందిన సోనీ గ్రూప్ రెండేళ్ల క్రితం డీల్ కుదుర్చుకుంది. అప్పట్నుంచి వివిధ కారణాలతో అది వాయిదా పడుతూ వస్తోంది. జీల్ వ్యవస్థాపకుడు సుభాష్ చంద్ర, ఆయన తనయుడైన గోయెంకా .. కంపెనీ నిధులను మళ్లించారనే ఆరోపణలు తెరపైకి వచ్చాయి. దీనిపై మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ విచారణ జరిపింది. గోయెంకాను ఏ లిస్టెడ్ కంపెనీ బోర్డులో చేరరాదని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. దీనిపై అప్పిలేట్ న్యాయస్థానంలో ఆయనకు ఊరట లభించింది. అయితే, ఈ మొత్తం వ్యవహారాన్ని కార్పొరేట్ గవర్నెన్స్ వైఫల్యంగా భావిస్తున్న సోనీ.. విలీన సంస్థకు గోయెంకాను సీఈవోగా చేసేందుకు ఇష్టపడటం లేదని, ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని భావిస్తోందని వార్తలు వచ్చాయి. ఒప్పందం పూర్తి కావడానికి జనవరి 20 వరకు గడువు ఉండటంతో ఏం జరగనుందని సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ఆరంభ లాభాలు ఆవిరి

- ఇంట్రాడే గరిష్టాల నుంచి ఒక శాతం వెనక్కి
- స్వల్ప లాభాలతో గట్టెక్కిన స్టాక్ సూచీలు
- బ్యాంకులు, మీడియా, ఎఫ్‌ఎంసీజీ షేర్లలో అమ్మకాలు



ముంబై: గరిష్ట స్థాయిల వద్ద ఆఖరి గంటలో లాభాల స్వీకరణ చోటుచేసుకోవడంతో స్టాక్ సూచీలు మంగళవారం ఆరంభంలో ఆర్జించిన భారీ లాభాలను కోల్పోయి స్వల్పలాభాలతో గట్టెక్కాయి. ఇంట్రాడేలో 680 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్ చివరికి 31 పాయింట్ల స్వల్ప లాభంతో 71,386 వద్ద నిలిచింది. నిఫ్టీ ట్రేడింగ్‌లో 211 పాయింట్లు ఆర్జించింది. ఆఖరికి 32 పాయింట్లు పెరిగి 21,545 వద్ద నిలిచింది. ఉదయం లాభాలతో మొదలైన సూచీలు మధ్యాహ్నం వరకు స్థిరమైన లాభాలతో ముందుకు కదిలాయి. అయితే ఆఖరి గంటన్నరలో అమ్మకాలు వెల్లువెత్తడంతో ఇంట్రాడే గరిష్టం నుంచి దాదాపు ఒక శాతం దిగివచ్చాయి. బ్యాంకింగ్, మీడియా, ఎఫ్‌ఎంసీజీ, సర్వీసెస్ రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఆటో, మెటల్, ఐటీ, ఫార్మా, రియల్టీ, ఇంధన షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. చిన్న తరహా షేర్లకు డిమాండ్ లభించడంతో బీఎస్‌ఈ స్మాల్ క్యాప్ సూచీ 0.37% లాభపడింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.991 కోట్ల షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.104 కోట్ల షేర్లను కొన్నారు. ఆసియాలో జపాన్ (1%), సింగపూర్ (0.50%), చైనా (0.20%) మినహా మిగిలిన అన్ని దేశాల స్టాక్ సూచీలు అరశాతం మేర నష్టపోయాయి. యూరప్ మార్కెట్లు అరశాతానికి పైగా పతనమయ్యాయి. అమెరికా మార్కెట్లు స్వల్ప నష్టాల్లో ట్రేడవుతున్నాయి. 'అధిక వాల్యుయేషన్ ఆందోళనలు, ఆసియా మార్కెట్లలో మిశ్రమ సంకేతాలు మన మార్కెట్లో లాభాల స్వీకరణకు పురిగొల్పాయని జియోజిత్ ఫైనాన్సియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియాతో 10 బిలియన్ డాలర్ల విలీనంపై సందిగ్ధత నెలకొనడంతో జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ షేరు 8% పతనమైన రూ.256 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 13% క్షీణించి రూ.242 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. షేరు భారీ పతనంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.2,036 కోట్లు నష్టపోయి రూ.24,613 కోట్లకు దిగివచ్చింది.
- బజాజ్ ఆటో రూ.4,000 కోట్ల బైబ్యాక్ ప్రకటించడంతో కంపెనీ షేరు 2% పెరిగి రూ.7,094 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 6% ఎగసి రూ.7,420 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది. ఈ క్రమంలో సంస్థ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.2 లక్షల కోట్ల మైలురాయిని అధిగమించింది.
- జ్యోతి సీఎన్‌సీ ఆటోమేషన్ ఐపీఓకు తొలి రోజు విశేష స్పందన లభించింది. ఇష్యూ ప్రారంభమైన తొలి కొన్ని గంటల్లోనే పేర్లు పూర్తిగా సబ్‌స్క్రైబ్ అయ్యాయి. పబ్లిక్ ఇష్యూలో భాగంగా కంపెనీ మొత్తం 1.75 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచగా 4.40 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. మొత్తంగా మొదటి రోజే 2.51 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబ్ అయ్యింది. ఇందులో రిటైల్ విభాగం 8.25 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల విభాగం 3.63 రెట్లు, క్యూఐబీ కోటా 2 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యాయి.

టీవీ, ఓటీటీలు.. రెండింటికీ చోటుంది

టాటా ప్లే ఎండీ హరిత్ నాగ్‌పాల్



న్యూఢిల్లీ: ఓవర్-ది-టాప్ (ఓటీటీ)ల రాకతో టీవీలకు కాలం చెల్లుతోందనే అభిప్రాయాలను టాటా ప్లే ఎండీ, సీఈవో హరిత్ నాగ్‌పాల్ తోసిపుచ్చారు. బస్సులు, రైళ్లు, విమానాల తరహాలోనే టీవీలు, ఓటీటీలు కూడా కలిసి ముందుకు సాగేందుకు అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. భారత్‌లో టీవీలను ఇష్టపడే కస్టమర్లు ఎప్పుడూ ఉంటారని చెప్పారు. 'చాలా మందికి ప్రైవేట్ విమానాలు ఉన్నాయి. అంతమాత్రాన కమర్షియల్ ఎయిర్‌లైన్స్ మూతబడ్డాయా? లేదుగా. విమానాలు వచ్చాయని రైళ్లు, బస్సులు కనుమరుగయ్యాయా? లేదు. దేశీయంగా 30 కోట్ల కుటుంబాల్లో ఇప్పటికీ మొదటి టీవీని కొనుక్కోని కుటుంబాలు 14 కోట్ల పైచిలుకు ఉన్నాయి. కాబట్టి ఓటీటీ వచ్చింది కదా ఇక టీవీ పోతుందని అనుకోవడానికి లేదు. రెండూ కలిసి మనుగడ సాగించగలవు' అని నాగ్‌పాల్ చెప్పారు. ఎంత కొత్త టెక్నాలజీ అందుబాటులోకి వచ్చినా.. పాత టెక్నాలజీని మాత్రమే వాడుకోగలిగే స్తోమత గల కస్టమర్ల సెగ్మెంట్ కూడా ఒకటి ఉంటుందని పేర్కొన్నారు. 'ఎడాప్ట్: టు థ్రైవ్, నాట్ జస్ట్ సర్వైవ్' పేరిట రాసిన పుస్తకాన్ని నాగ్‌పాల్ ఆవిష్కరించారు.

లైఫ్ 108 హెల్త్‌కేర్‌లో నిహార్ ఇన్ఫోకి మెజారిటీ వాటాలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అంకుర సంస్థ లైఫ్ 108 హెల్త్‌కేర్‌లో 51 శాతం పైచిలుకు వాటాలు కొనుగోలు చేస్తున్నట్లు లిస్టెడ్ సంస్థ నిహార్ ఇన్ఫో గ్లోబల్ వెల్లడించింది. 2021లో ఏర్పాటైన లైఫ్ 108 సంస్థ ఆరోగ్య సంరక్షణ, లైఫ్‌స్టయిల్ ఉత్పత్తులను రిటైల్, హోల్‌సేల్, ఈ-కామర్స్ పోర్టల్స్ ద్వారా విక్రయిస్తోంది. న్యూట్రాస్యూటికల్స్ వంటి హెల్త్ సప్లిమెంట్స్ తయారీలోకి కూడా ప్రవేశించే యోచనలో ఉంది. లైఫ్ 108 కొనుగోలు రాబోయే 12 నెలల్లో తమ టర్నోవర్ వృద్ధికి గణనీయంగా దోహదపడగలదని నిహార్ ఇన్ఫో తెలిపింది.

NIHAR INFO GLOBAL

జాబ్ పాయింట్

భారత వాయుసేనలో అగ్నివీర్ వాయు పోస్టులు

భారత వాయుసేన.. అగ్నిపథ్ స్కీమ్‌లో భాగంగా అగ్నివీర్ వాయు(01/2025) నియామకాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన అవివాహిత పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులతో ఇంటర్మీడియట్(10+2)/ఇంటర్మీడియట్(సైన్స్ కాని ఇతర సబ్జెక్టులు)/ఇంటర్ ఒకేషనల్ లేదా మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లొమా (మెకానికల్/ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్/ఆటోమొబైల్/ కంప్యూటర్ సైన్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ /ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ)/తత్సమాన ఉత్తీర్ణులవ్వాలి. నిర్దిష్ట శారీరక/వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి.
» **వయసు:** 02.01.2004 నుంచి 02.07.2007 మధ్య జన్మించి ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఫేజ్-1(ఆన్‌లైన్ రాతపరీక్ష), ఫేజ్-2(ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, అడాప్టబిలిటీ టెస్ట్-1, అడాప్టబిలిటీ టెస్ట్-2), ఫేజ్-3(మెడికల్ ఫిట్‌నెస్ టెస్ట్), ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభతేది:** 17.01.2024.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ గడువుతేది:** 06.02.2024.
» **ఆన్‌లైన్ పరీక్ష ప్రారంభ తేది:** 17.03.2024.
» **వెబ్‌సైట్:** https://agnipathvayu.cdac.in

ఏపీపీఎస్సీ- 897 గ్రూప్-2 పోస్టులు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ).. గ్రూప్-2 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 897
» **పోస్టుల వివరాలు:** ఎగ్జిక్యూటివ్-331, నాన్ ఎగ్జిక్యూటివ్-566.
» **ఎంపిక విధానం:** స్క్రీనింగ్ టెస్ట్, మెయిన్ ఎగ్జామినేషన్, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా అభ్యర్థులను ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** స్క్రీనింగ్ టెస్ట్ ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటుంది. జనరల్ స్టడీస్, మెంటల్ ఎబిలిటీలో 150 ఆబ్జెక్టివ్ ప్రశ్నలకు 2.30 గంటల్లో ఓఎంఆర్ షీట్‌పై సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది. మెయిన్ ఎగ్జామ్‌లో పేపర్-1, పేపర్-2లో 150 చొప్పున ఆబ్జెక్టివ్ ప్రశ్నలకు జవాబులు గుర్తించాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.01.2024.
» **స్క్రీనింగ్ టెస్ట్ తేది(ప్రిలిమినరీ ఎగ్జామ్):** 25.02.2024.
» **వెబ్‌సైట్:** https://psc.ap.gov.in

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్‌లో 30 పోస్టులు

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్.. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 30
» **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్-14, అసోసియేట్ ప్రొఫెసర్-11, అసిస్టెంట్ ప్రొఫెసర్- 05.
» **సబ్జెక్టులు:** మ్యాథ్స్ అండ్ స్టాటిస్టిక్స్, కంప్యూటర్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్, ఫిజిక్స్, అడ్వాన్స్‌డ్ స్టడీస్ ఇన్ ఎలక్ట్రానిక్స్ సైన్స్ అండ్ టెక్నాలజీ, కెమిస్ట్రీ, బయోకెమిస్ట్రీ, మెడికల్ సైన్సెస్, న్యూరల్ అండ్ కాగ్నిటివ్ సైన్సెస్, ఫిలాసఫీ, హిందీ, ఉర్దూ, అప్లైడ్ లింగ్విస్టిక్స్, ఇంగ్లిష్ లాంగ్వేజ్ స్టడీస్, ఎకనామిక్స్, ఎడ్యుకేషన్ అండ్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ, డాన్స్, థియేటర్ ఆర్ట్స్.
» **అర్హత:** సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ, పీహెచ్‌డీ, నెట్/స్లెట్/సెట్ ఉత్తీర్ణతతో పాటు బోధన/పరిశోధనానుభవం కలిగి ఉండాలి. **వయసు:** 65 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు ప్రొఫెసర్‌కు రూ.1,44,200 నుంచి రూ.2,18,200, అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.1,31,400 నుంచి రూ.2,17,100, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.57,700 నుంచి రూ.1,82,400.
» **ఎంపిక విధానం:** అకడమిక్ రికార్డు, ఇంటర్వ్యూ, డెమాన్‌స్ట్రేషన్/సెమినార్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.01.2024.
» **దరఖాస్తు హార్డ్‌కాపీ స్వీకరణకు చివరితేది:** 31.01.2024.
» **వెబ్‌సైట్:** https://uohyd.ac.in

ఎన్‌టీపీసీ, న్యూఢిల్లీలో 25 అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు

న్యూఢిల్లీలోని నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్(ఎన్‌టీపీసీ).. అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 25
» **అర్హత:** సీఏ/సీఎంఏ ఉత్తీర్ణతతో పాటు ఏడేళ్ల పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 37 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.60,000 నుంచి రూ.1,80,000.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.01.2024.
» **వెబ్‌సైట్:** ntpc.co.in

డేటా స్కిల్స్.. భలే డిమాండ్!

» డేటా సైన్స్ విభాగంలో విస్తృతంగా కొలువులు
» బిగ్ డేటా, డేటా సైన్స్, డేటా సెక్యూరిటీ స్కిల్స్‌కు డిమాండ్
» నైపుణ్యాలుంటే సంస్థల రెడ్ కార్పెట్ స్వాగతం!

బిగ్ డేటా.. డేటా సైన్స్.. డేటా సెక్యూరిటీ.. ప్రస్తుతం వీటికి కార్పొరేట్ రంగం పెద్దపీట వేస్తోంది. వీటి ద్వారా సంస్థలు తమ కార్యకలాపాల విస్తరణ, కస్టమర్స్ సంఖ్యను పెంచుకునే దిశగా అడుగులు వేస్తున్నాయి. ఇందుకోసం ఈ విభాగాల్లో.. నైపుణ్యాలున్న వారి కోసం అన్వేషణ సాగిస్తున్న పరిస్థితి! ముఖ్యంగా డేటాసైన్స్‌లో పీజీ స్థాయి నైపుణ్యాలున్న వారికి భారీ డిమాండ్ నెలకొంది!! ఈ నేపథ్యంలో.. బిగ్ డేటా, డేటాసైన్స్, డేటా సెక్యూరిటీతో ప్రయోజనాలు, లభిస్తున్న కొలువులు, అవసరమైన నైపుణ్యాలు, కెరీర్ అవకాశాలు తదితర వివరాలు..

వినియోగదారులు కోరుకుంటున్న ప్రొడక్టులు ఏంటి.. ఎలాంటి ఉత్పత్తులకు డిమాండ్ అధికంగా ఉంది.. సెర్చ్ ఇంజన్‌లో ఏ ప్రొడక్ట్ ముందు వరుసలో ఉంది.. ప్రస్తుతం కార్పొరేట్ సంస్థలకు ఇలాంటి డేటా అత్యంత కీలకంగా మారుతోంది. ఈ గణాంకాల ఆధారంగా సంస్థలు వ్యాపార ప్రణాళికలు రూపొందించుకుంటున్నాయి. అందుకే ఇలాంటి కీలక సమాచారం అందించే డేటా సైన్స్, బిగ్ డేటా, డేటా సెక్యూరిటీ నైపుణ్యాలున్న వారికి డిమాండ్ పెరుగుతోంది.

డేటా సైన్స్

ప్రస్తుతం అన్ని రంగాల్లోని సంస్థలు తమ వినియోగదారుల అభిరుచి, ఆసక్తులకు అనుగుణంగా తమ సేవలు, ఉత్పత్తులను అందించాలని ప్రయత్నిస్తున్నాయి. ఉత్పత్తులు, సేవలకు సంబంధించి అందుబాటులో ఉన్న లేదా సేకరించిన సమాచారాన్ని.. గణాంక సహితంగా కంపెనీలకు అవసరమైన రీతిలో తీర్చిదిద్దడమే డేటా సైన్స్ అని చెప్పొచ్చు. ఈ కార్యకలాపాలను సజావుగా నిర్వహించే విభాగమే.. డేటా సైన్స్ విభాగంగా పేర్కొంటున్నారు. డేటా సైన్స్ నిపుణులు సమాచార సేకరణ, విశ్లేషణ మాత్రమే కాకుండా.. సంస్థలోని ఇతర విభాగాలతో సమ్మిళితంగా విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ముఖ్యంగా స్టాటిస్టిక్స్, అల్గారిథమ్స్, డేటా అనాలిసిస్, మెషీన్ లెర్నింగ్, కోడింగ్, ప్రోగ్రామింగ్ విభాగాలతో కలిసి పని చేయాల్సి ఉంటుంది. ఇలా అన్ని విభాగాలను సమన్వయం చేసుకుంటూ ఒక ఉత్పత్తి లేదా సేవకు సంబంధించి సంస్థ సరైన నిర్ణయం తీసుకునేలా ఉపయుక్త సమాచారాన్ని సిద్ధం చేసే విభాగమే.. డేటా సైన్స్! దీని ఆధారంగా సంస్థలు భవిష్యత్తు వ్యాపార, మార్కెటింగ్ వ్యూహాలపై నిర్ణయం తీసుకుంటున్నాయి. గత కొంతకాలగా ప్రపంచవ్యాప్తంగా డేటా సైన్స్ నిపుణులకు డిమాండ్ పెరుగుతోంది. మన దేశం డేటాసైన్స్ నిపుణుల సేవల వినియోగంలో ప్రపంచంలో రెండో స్థానంలో ఉంది. డేటా సైన్స్‌కు సంబంధించి ఉద్యోగాల పరంగా ప్రతి పది ఉద్యోగాల్లో ఒక ఉద్యోగం భారత్‌లోనే లభిస్తోంది. ఓ తాజా జాబ్స్ రిపోర్ట్ ప్రకారం-అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న జాబ్ ప్రొఫైల్‌గా డేటా సైన్స్ నిలుస్తోంది.

బిగ్ డేటా అనలిటిక్స్

డేటా రంగంలో మరో ముఖ్యమైన విభాగం.. బిగ్ డేటా. విస్తృతంగా ఉండే భారీ డేటాను ఒక క్రమపద్ధతిలో అమర్చడం.. విశ్లేషించడం ద్వారా వినియోగదారులు ఆశిస్తున్న సేవలు, ఉత్పత్తుల గురించి నివేదికలు రూపొందించి సదరు సంస్థలోని ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్ విభాగాలకు అందిస్తారు బిగ్ డేటా నిపుణులు! డేటా అనుబంధ సాంకేతికతల ఆధారంగా కార్యకలాపాలు నిర్వహించాలని భావిస్తున్న సంస్థల్లో..అధికశాతం బిగ్ డేటా అనలిటిక్స్‌పైనే ఆధారపడుతున్నాయి. దీంతో.. బిగ్ డేటా విభాగంలో నిపుణులైన మానవ వనరులకు డిమాండ్ పెరుగుతోంది. బిగ్ డేటా రంగంలో అత్యంత కీలకం.. అంకెలు, గణాంకాల విశ్లేషణ. అందుకే కంపెనీలు.. ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్‌లో బ్యాచిలర్, మాస్టర్ డిగ్రీ చేసిన అభ్యర్థులకు ఆఫర్స్ ఇస్తున్నాయి. కంప్యుటేషనల్, మ్యాథమెటికల్ స్కిల్స్ ఉన్న వారికి బిగ్ డేటా అనలిటిక్స్‌లో ఉద్యోగాలు లభించే వీలుంది. మ్యాథ్స్, సైన్స్ విభాగాల విద్యార్థులకు అవకాశాలు మెరుగ్గా ఉంటాయని నిపుణుల అభిప్రాయం. బిగ్ డేటా అనాలిసిస్, మేనేజ్‌మెంట్ పరంగా ప్రపంచంలో అగ్రరాజ్యంగా పేరొందిన అమెరికా తర్వాత భారత్ నిలుస్తోంది. ముఖ్యంగా స్టార్ట్-అప్, ఈ-కామర్స్ సంస్థలలో బిగ్ డేటా నిపుణులకు డిమాండ్ ఎక్కువగా ఉంది.

డేటా సెక్యూరిటీ



డేటా సంబంధిత కార్యకలాపాలు నిర్వహించే సంస్థలు ప్రాధాన్యం ఇస్తున్న మరో విభాగం.. డేటా సెక్యూరిటీ. తమ డేటా భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవడానికి కంపెనీలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. ముఖ్యంగా ఆన్‌లైన్‌లో సేవలు అందించే సంస్థలు తమ డేటా భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తాయి. క్లయింట్ సంస్థలు, వారి యూజర్లకు సంబంధించిన వివరాలు, అదే విధంగా తాము వారికి అందిస్తున్న సర్వీసులకు సంబంధించిన డేటాను భద్రంగా నిక్షిప్తం చేసుకోవాల్సి ఉంటుంది. డేటా వివరాలను పటిష్టంగా నిర్వహించడం, ఏ స్థాయిలోనూ డేటాను ఇతరులు యాక్సెస్ కాకుండా చూసే విభాగం.. డేటా సెక్యూరిటీ. సైబర్ సెక్యూరిటీలో ఒక విభాగంగా డేటా సెక్యూరిటీని సంస్థలు పరిగణిస్తున్నాయి. సైబర్ సెక్యూరిటీ నైపుణ్యాలు నేర్చుకున్న వారు డేటా సెక్యూరిటీ సంబంధిత అంశాలపై ప్రత్యేక దృష్టి పెడితే.. ఈ విభాగంలో కొలువులు సొంతం చేసుకోవచ్చు. డేటా సెక్యూరిటీ నిపుణులకు.. ఇంటర్నెట్, డేటా ఇన్ఫర్మేషన్, దాని ప్రాధాన్యతకు సంబంధించి స్పష్టత ఉండాలి. డిగ్రీ విద్యార్థులు సైతం సైబర్ సెక్యూరిటీ సంబంధిత కోర్సుల్లో అడుగు పెట్టి..ఇంటర్నెట్, డేటా మేనేజ్‌మెంట్/ఇన్ఫర్మేషన్, ఎథికల్ హ్యాకింగ్ తదితర అంశాల్లో పట్టు సాధిస్తే.. ఈ విభాగంలో కొలువు దక్కించుకోవచ్చు.

డిమాండింగ్ స్కిల్స్ ఇవే

- డేటా సంబంధిత విభాగాల్లో కొలువులు సొంతం చేసుకోవడానికి.. మెషీన్ లెర్నింగ్, ఆర్, పైథాన్, హడూప్, ఎస్‌క్యూఎల్ వంటి లాంగ్వేజ్ స్కిల్స్ కీలకంగా నిలుస్తున్నాయి. అదే విధంగా మ్యాథమెటిక్స్, కంప్యుటేషన్, స్టాటిస్టిక్స్‌పై అవగాహన ఉంటే.. మరింత వేగంగా రాణించే అవకాశం ఉంటుంది.
- బిగ్ డేటా విభాగంలో రాణించడానికి ప్రాథమికంగా మ్యాథ్స్, సైన్స్, ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్ నేపథ్యం అవసరం. దీంతోపాటు ఈ విభాగంలో మరింత మెరుగైన నైపుణ్యాలు సొంతం చేసుకోవడానికి స్ట్రక్చర్డ్, సెమీ స్ట్రక్చర్డ్, అన్-స్ట్రక్చర్డ్ పేరిట ఉండే డేటా విశ్లేషణలో ప్రత్యేక నైపుణ్యాలు అవసరమవుతున్నాయి. వీటికోసం హడూప్ టెక్నాలజీ; జావా; పైథాన్; ఎస్ఏఎస్; రూబీ డెవలపర్ వంటి కోర్సులు నేర్చుకోవడం ఉపయుక్తంగా ఉంటుంది.

సర్టిఫికేషన్ కోర్సులు

డేటా సైన్స్, బిగ్ డేటా, డేటా సెక్యూరిటీ విభాగాల్లో నైపుణ్యాల కోసం పలు సర్టిఫికేషన్ కోర్సులు అందుబాటులోకి వస్తున్నాయి. వీటి ద్వారా డేటా మైనింగ్, స్టాటిస్టికల్ టూల్స్, కోడింగ్, మెషీన్ లెర్నింగ్ వంటి వాటిపై అవగాహన పెంచుకోవచ్చు. మూక్స్ విధానంలో ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్సులను పూర్తి చేసే వీలుంది.

అకడమిక్ కోర్సులు

ప్రస్తుతం డేటా సైన్స్‌కు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని పలు ఇన్‌స్టిట్యూట్‌లు బ్యాచిలర్ స్థాయిలోనే డేటా సైన్స్, డేటా అనలిటిక్స్, బిగ్ డేటా సబ్జెక్ట్‌లతో కోర్సులను అందిస్తున్నాయి. బీఎస్సీ, బీకాంలో డేటా అనలిటిక్స్ గ్రూప్‌ను ప్రవేశ పెడుతున్నాయి. దీంతోపాటు..జావా, పైథాన్, ఆర్, ఎస్‌క్యూఎల్ వంటి కంప్యూటర్ ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్ నేర్చుకోవడం ద్వారా డేటా సైన్స్ ఉద్యోగాలకు సిద్ధం కావొచ్చు. అదే విధంగా కంప్యూటర్ సైన్స్‌లో బీటెక్ పూర్తి చేసిన విద్యార్థులు బిగ్ డేటా, డేటా అనలిటిక్స్‌లో సర్టిఫికేషన్స్ పూర్తి చేయడం ద్వారా కొలువుల అన్వేషణ సాగించొచ్చు. పీజీ స్థాయిలో ఎంబీఏలో డేటాసైన్స్ లేదా మార్కెటింగ్, బిజినెస్ అనలిటిక్స్ స్పెషలైజేషన్స్ పూర్తి చేసిన విద్యార్థులు సులువుగా ఈ విభాగంలో కొలువుదీరొచ్చు.

జాబ్ ప్రొఫైల్స్

డేటా విభాగానికి సంబంధించిన నైపుణ్యాలు సొంతం చేసుకుంటే..డేటా సైంటిస్ట్, డేటా ఇంజనీర్, స్టాటిస్టిషియన్, మెషీన్ లెర్నింగ్ ఇంజనీర్, డేటా అనలిస్ట్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, టెక్నికల్ ఆర్కిటెక్ట్, గ్రిడ్ కంప్యూటింగ్ ఇంజనీర్స్ వంటి ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు.

ఆకర్షణీయ వేతనాలు

డేటా సంబంధిత విభాగాల్లో ఆకర్షణీయమైన వేతనాలు లభిస్తున్నాయి. ఆయా హోదాలను బట్టి కనిష్టంగా రూ.5లక్షలు, గరిష్టంగా రూ.8లక్షల వార్షిక వేతనాలు అందుకునే వీలుంది. ఫ్రెషర్స్‌కు సగటున రూ.నాలుగు లక్షల వార్షిక వేతనం లభిస్తోంది.





Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.